: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM
Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

తాడేపల్లిగూడెం
29-5-2026 శుక్రవారం
సంపుటి: 32 సంచిక: 118
పేజీలు: 8+4 వెల: 6.50

# 2047 నాటికి ఎపి టాప్



గురువారం మహానాడు సభలో 'కాలపురుషుడి సంతకం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు లోకేష్, అచ్చెన్నాయుడు, అనిత తదితరులు

## రాష్ట్రాన్ని దేశంలోనే నం.1 చేస్తాం

## అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

## వర్చువల్ మహానాడు విజయవంతం

## ప్రతి కార్యకర్త, ప్రజా ప్రతినిధి అంకిత భావంతో కదలాలి

## గొడ్డలిపార్టీ తప్పుడు ప్రచారాలను ఎండగట్టండి

## రాజకీయ తీర్మానం అనంతర ప్రసంగంలో సిఎం చంద్రబాబు

## రాష్ట్ర వ్యాప్తంగా 1875 క్లస్టర్లతో పాటు 12 దేశాలనుంచి కార్యకర్తలు, నేతలు హాజరు

**విజయవాడ,మే 28,ప్రభాతవార్తప్రతినిధి:** మెడపై కత్తి పెట్టినా జై చంద్రబాబు, జై తెలుగుదేశం అంటూ ప్రాణం వదిలిన కార్యకర్తలే శిరోధార్యం అని టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. 2047 నాటికి స్వర్ణాంధ్రను విశ్వవిఖ్యాతం చేస్తామన్నారు. మహానాడు రెండో రోజున కీలకమైన రాజకీయ తీర్మానం కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు పెట్టారు. గొడ్డలి పార్టీ పాలనలో రాష్ట్రం ఆర్థిక సంక్షోభం, పెట్టుబడుల తగ్గుదల, పరిశ్రమల వలస, సాగునీటి ప్రాజెక్టుల నిరక్ష్యం, యువతలో నిరుద్యోగం వంటి అనేక సవాళ్లను ఎదుర్కొన్నాం. ఈ నేపథ్యంలో రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి మార్గంలో నడిపించాల్సిన చారిత్రాత్మక బాధ్యతను ప్రజలు కూటమి ప్రభుత్వంపై పెట్టారు. ప్రజల ఆశయాలను కేంద్ర బిందువుగా తీసుకుని అభివృద్ధి సంక్షేమమే సమాన ప్రాధాన్యంతో అమలు చేయడమే లక్ష్యంగా భావించి సిఎం చంద్రబాబు రెండేళ్ల పాలనలో అమలు చేసి చూపించారు...2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే టిడిపి లక్ష్యం. స్వర్ణాంధ్ర నిర్మాణం కోసం ప్రతి కార్యకర్త, ప్రతి ప్రజాప్రతినిధి అంకితభావంతో పనిచేయాలని ఈ మహానాడు పిలుపునిస్తోంది. అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన, ప్రజా భాగస్వామ్యంతో రాష్ట్రాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు టిడిపి ప్రభుత్వం సంపూర్ణ కట్టుబాటుతో ముందుకు సాగుతుందని ప్రకటిస్తోంది.
ఏ ప్రభుత్వం అయినా ఎక్కువ కాలం పాలన సాగిస్తేనే రాష్ట్ర ప్రగతి సాధ్యమవుతుంది. ఒక్క ఛాన్స్ పేరుతో రాష్ట్రం 25 యేళ్లు వెనక్కి వెళ్లింది. మళ్లీ ఇప్పుడిప్పుడే ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవిస్తున్నారు.

>>2



## మహానాడు సంచలన రికార్డు

### 11 లక్షల మంది కేడర్ హాజరయ్యారు: మంత్రి లోకేష్

**విజయవాడ,మే 28,ప్రభాతవార్తప్రతినిధి:** మహానాడుకు 11 లక్షల మంది పార్టీ క్యాడర్ హాజరయ్యారని టిడిపి కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేష్ తెలిపారు. మరో సంచలన రికార్డు నమోదు చేసుకుందని అన్నారు. ఈ అటెండెన్స్‌లో వారంతా నమోదు చేయించుకున్నారని వివరించారు. గురువారం మహానాడులో మంత్రి లోకేష్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాష్ట్రంలోని నియోజకవర్గాల్లో ఇప్పటి నుంచే మహిళా నాయకత్వాన్ని తయారు చేస్తామన్నారు. పార్టీలో ఎప్పటికప్పుడు సంస్కరణలు తీసుకురావాల్సి ఉందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ కాలం

>>2



గురువారం ఎన్టీఆర్ జయంతి, మహానాడు సందర్భంగా పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

## 'భారతరత్నం' ఎన్టీఆర్

### ఇది తెలుగు ప్రజల ఆకాంక్ష

### ఎన్టీఆర్‌కు అత్యున్నత పురస్కారం ప్రకటించాలని మహానాడు ఏకగ్రీవ తీర్మానం

### లోకేష్ ప్రతిపాదించిన మహిళలకు 33% రిజర్వేషన్లు మనమే ప్రారంభిద్దాం

### - సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**విజయవాడ, మే 28,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుజాతికి వెలుగై నిలిచిన స్వర్గీయ నందమూరి తారక రామారావుకు భారతరత్న ఇవ్వాలనేది ప్రజలందరి డిమాండ్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. దేశరాజకీయాల్లో పెనుమార్పులకు నాంది పలికిన మహోన్నత నాయకుడికి భారతరత్న ఇవ్వాలని ఆయన కోరారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా గురువారం మహానాడు రెండో రోజున ఎన్టీఆర్ కు నివాళి అర్పించే తీర్మానంపై సీఎం చంద్రబాబు ప్రసంగించారు. తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు తెలుగు ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారని సిఎం అన్నారు. సామాన్య ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ నిర్ణయాలు తీసుకున్నారని వివరించారు. ప్రజల మనస్సుల్లో ఎన్టీఆర్ చిరస్మరణీయ స్థానం సంపాదించా

>>2



గురువారం బెంగళూరులోని గవర్నర్ కార్యాలయంలో రాజీనామా పత్రం సమర్పిస్తున్న సిఎం సిద్ధరామయ్య

## సిద్ధరామయ్య రాజీనామా

### • ఎమ్మెల్యేగా కొనసాగుతానన్న సిఎం • కర్ణాటక సంక్షోభానికి తెర • 30న డికె పదవీ స్వీకారం చేసే అవకాశం

**బెంగళూరు, మే 28:** కర్ణాటకలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న నాయకత్వ మార్పిడి సమస్యకు హైకమాండ్ ఎట్టకేలకు తెరదించింది. సిఎం పదవిని ఇరువురునేతలు పంచుకోవాలన్న ఒప్పందంలో భాగంగానే రాష్ట్ర కొత్త సిఎంగా ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి డికెశివకుమార్‌కు అవకాశం కల్పించాలని హైకమాండ్ ఆదేశించడంతో సిద్ధరామయ్య అంగీకరించారు. వయసు పైబడుతుండటం, ప్రభుత్వంపై క్రమేపీ వ్యతిరేకత వస్తోందని, ఈక్రమంలో నాయకత్వం మార్పు అనివార్యమని ఆయనకు హితోక్తులు చెపుతూ హైకమాండ్ రాజ్యసభ ఆఫర్ కూడా ఇచ్చింది. ఢిల్లీనుంచి కర్ణాటకకు వచ్చీరాగానే సిద్ధరామయ్య మాటకు కట్టుబడి రాజీనామా సమర్పించారు. గవర్నర్ తావర్‌చెంద్ గెహ్లోత్ నగరంలో లేకపోవడంతో ఆయన కార్యాలయానికి వెళ్లి లేఖ ఇచ్చివచ్చారు. సిఎంతోపాటే కాబోయే సిఎం డికె శివకుమార్ పలువురు కేబినెట్ మంత్రులు కూడా ఆయన వెంట వెళ్లారు. సిఎం కాబోతున్న శివకుమార్ గురువారం తన సీనియర్ 80 ఏళ్ల వృద్ధనేత అయిన సిద్ధరామయ్యకు పాదాభివందనం చేసి ఆయన ఆశీస్సులు తీసుకోవడం కొత్త భాష్యాలకు తెరతీసింది. ప్రస్తుతం గవర్నర్ మధ్యప్రదేశ్‌లో ఉండటంతో ఆయనవచ్చిన తర్వాతనే రాజీనామా ఆమోదం పొందుతుందని,

>>2



## అటు ఎండ, ఇటు వాన

### రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితి

### మార్కాపురం జిల్లా: $45.2^{0}$

### ఏలూరు జిల్లా: $45^{0}$



**విజయవాడ, మే28,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో పగలు మండే ఎండలు, రాత్రుళ్లు ఈదురు గాలులతో కూడిన అదిరే వర్షాలుతో కూడిన వాతావరణం నెలకుని ఉంటుంది. రాష్ట్రంలో ఎండల తీవ్రత, పిడుగులతో కూడిన వర్షాలతో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల మధ్య ప్రయాణాలను వాయిదా వేసుకోవాలన్నారు. బయటకు వెళ్లేవారు తప్పనిసరిగా మంచినీరు వెంట తీసుకుని వెళ్లాలని కోరారు. పిడుగులతో కూడిన ఆకస్మిక వర్షాలు కురిసేపుడు చెట్ల క్రింద నిలబడరాదని సూచించారు.
గురువారం మార్కాపురం జిల్లా నందనమారెళ్లలో 45.2డిగ్రీలు, ఏలూరు జిల్లా ధర్మాజీగూడెంలో 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు. కృష్ణా జిల్లా కంకిపాడు, ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో 44.6, తూర్పుగోదావరి జిల్లా బ్రాహ్మణగూడెం, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడులో 44.4, పల్నాడ జిల్లా నూజెండ్లలో 44.1, గుంటూరుజిల్లా పాండ్రపాడులో 44, బాపట్లజిల్లా మార్టూరు, నెల్లూరుజిల్లా గూడూరులో 43.8, పోలవరంజిల్లా చింతూరులో 43.6, తిరుపతిజిల్లా వెంకటగిరిలో 43, చిత్తూర జిల్లా నింద్ర, విశాఖ జిల్లా ములగాడలో 42 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు.
14 జిల్లాల పరిధిలోని 110 మండలాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయని ఆయన వెల్లడించారు. ఇందులో ముఖ్యంగా పల్నాడు 16, ప్రకాశం 15, బాపట్ల 13, ఎన్టీఆర్ 12, కృష్ణా 12, గుంటూరు12, ఏలూరు 6, మార్కాపురం 6, నెల్లూరు 6 మండలాల్లో ఎండ ప్రభావం ఎక్కువగా చూపిందన్నారు ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎండలో బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాదులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు,మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఇక జార్ఖండ్ నుండి ఒడిశా మీదుగా ఉత్తరాంధ్ర వరకు ద్రోణి విస్తరించి ఉందని ఏపిఎస్డీఎంఎ ఎండీ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు.
దీనిప్రభావంతో రేపు ..మార్కాపురం, ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు.. జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మిగతా జిల్లాల్లోనూ చెదురుమదురుగా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, విద్యుత్ స్తంబాలు, హోర్డింగ్స్ క్రింద నిలబడొద్దని సూచించారు.

## ప్రిజనరీ పాలన నుంచి విజనరీ పాలనకు వచ్చాం

### - కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**విజయవాడ, మే 28,ప్రభాతవార్తప్రతినిధి:** సుస్థిర పాలన అందిస్తూ నిరంతర పాలనకు కృషిచేయాలని రామ్మోహన్ నాయుడు తెలిపారు. నిరంతర పాలన కోసం నాయకులందరూ ఏకైక అజెండాతో ముందుకెళ్లాలని సూచించారు. అన్ని ఎన్నికల్లో అధిక మెజార్టీతో గెలిపించే బాధ్యత అందరూ తీసుకోవాలన్నారు. టిడిపి ఎల్లప్పుడూ ముందంజలో ఉండే కార్యక్రమం చేయాలని పేర్కొన్నారు. 40 యేళ్లయినా నిత్య యవ్వనంతో ముందుకు నడిచే పార్టీ అని చెప్పారు. యువతను ఎప్పటికప్పుడు భాగస్వాములను చేస్తున్నామని వివరించారు. మహిళలకు ఎన్నికల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్న పార్టీ టిడిపి అని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉంటూ ముందుకెళ్లాలన్నారు. ప్రిజనరీ పాలన నుంచి విజనరీ పాలనకు వచ్చామని చెప్పారు. ప్రిజనరీ పాలనలో గొడ్డలి వస్తే విజనరీ పాలనలో గూగుల్ వచ్చిందని తెలిపారు. ప్రిజనరీ పాలనలో గంజాయి వస్తే విజనరీ పాలనలో ఏఎంఎన్ఎస్ వంటి పెట్టుబడులు వచ్చాయని వివరించారు. ప్రిజనరీ పాలనలో డెడ్‌బాడీలు డోర్ డెలివరీ చేస్తే విజనరీ పాలనలో వాట్సప్ గవర్నెన్స్ డెలివరీ వచ్చిందన్నారు. ఆరోజు శవాలపై రాజకీయాలు చేస్తే ఇవాళ యువతకు ఉపాధి అవ

>>2

## ప్రజా పోరాటాలు ఉధృతం

### విబి జీ రామ్‌జీ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు

### ఒంగోలులో అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్లీనరీలో సిపిఐ జాతీయ నేతలు డి.రాజా, కె. రామకృష్ణ




గురువారం ఒంగోలులో బికెఎంయు జాతీయ కౌన్సిల్ సమావేశాల దృశ్యం

**ఒంగోలు కలెక్టరేట్ ప్రభాతవార్త:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి దాని స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలని భావిస్తున్న జి రామ్ జి చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజా పోరాటాలను ఉధృతం చేస్తామని సిపిఐ జాతీయ నాయకులు డి.రాజా, కె.రామకృష్ణ హెచ్చరించారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో గురువారం ప్రారంభమైన బికెఎంయూ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా నిర్వహించిన జాతీయ సెమినార్‌లో 18 రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. బికెఎంయూ జాతీయ అధ్యక్షుడు పెరియార్ స్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శులు డి.రాజా,

>>2



## విజయ సాయి విచారణ పూర్తి

### మద్యం కుంభకోణం కేసు

**విజయవాడ మే 28 ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన ఎపి మద్యం కుంభకోణం కేసులో మాజీ ఎంపి విజయసాయిరెడ్డి ఇడి విచారణ ముగిసింది. బషీర్‌బాగ్‌లోని ఇడి కార్యాలయంలో ఏడున్నర గంటలపాటు అధికారులు ఆయన్ను విచారిం చారు. ఈ కేసులో ఇప్పటికే

>>2

## ఆక్వాకల్చర్ సమస్యలు పరిష్కరిస్తాం

### పరిశ్రమ నిలదొక్కుకొనేలా సమతుల్య నిర్ణయాలు: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ మే 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఆక్వా కల్చర్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో పరిశీలిస్తున్నదని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రింప్ ఫీడ్ ధరల పెరుగుదల, ముడి పదార్థాల కొరత, రైతులపై పెరుగుతున్న వ్యయభారం, ఎగుమతుల సవాళ్లు వంటి అంశాలపై మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో రైతులు, ఫీడ్ తయారీదారులు, ఎగుమతిదారులు, పరిశ్రమ ప్రతినిధుల అభిప్రాయాలను ప్రభుత్వం సమగ్రంగా విన్నదన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న వేసవి పంట సమయంలో ఫీడ్ ధరల పెంపు రైతులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని, అదే సమయంలో ఫీడ్ పరిశ్రమ కూడా ముడి పదార్థాల ధరల పెరుగుదలతో ఒత్తిడిని ఎదు



ర్కొంటోందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా, పరిశ్రమ నిలదొక్కుకునేలా సమతుల్య నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఫీడ్, సీడ్ నాణ్యతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, సిసిటివి ఆధారిత హ్యాచరీ పర్యవేక్షణ, సీడ్ ట్రేస్ ఐఓటీ ఆధారిత

>>2


మహానాడుకు వచ్చిన మహిళా నేతలతో మంత్రి లోకేష్


గురువారం మాహానాడు వేదికపై ముస్లిం నేతలతో సిఎం చంద్రబాబు


హైదరాబాద్‌లో ఎన్టీఆర్ ఘాట్‌వద్ద నివాళులర్పిస్తున్న భువనేశ్వరి, రామకృష్ణ తదితరులు

# 2047 నాటికి ఎపి టాప్

>> మంచి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధిని కళ్లారా చూస్తున్నారు. అమలు చేస్తున్న పథకాలతో ప్రతి ఇంట్లో కొత్త వెలుగులు విరాజిల్లుతున్నాయి. గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ 2029లో తిరిగి అధికారంలోకి వచ్చే విధంగా ప్రజారంజక పాలన సాగిస్తూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడతామని మహానాడు వేదికగా తీర్మానిస్తున్నామని పేర్కొన్నారు.రాజకీయ తీర్మానంలో ప్రస్తావించిన అంశాలను ఉటంకిస్తూ మహానాడులో ముగింపు ప్రసంగం చేసారు.యుద్ధ పరిస్థితుల కారణంగా ఈసారి వర్చువల్‌గా నిర్వహించిన మహానాడు విజయవంతమైందని సిఎం చంద్రబాబు అన్నారు. వర్చువల్ మహానాడు అదరగొట్టింది. అత్యద్భుతంగా మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించాం అన్నారునా రాజకీయ జీవితంలో హైబ్రీడ్ విధానంలో ఈ మహానాడు పెద్ద ప్రయోగం అన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా 1,875 క్లస్టర్లతో పాటు 12 దేశాల నుంచి కార్యకర్తలు, నేతలు హాజరయ్యారని తెలిపారు.

**మహానాడులో ఏకంగా 16.78 లక్షల మంది హాజరుకావటం ఓ రికార్డు**

రికార్డులు సృష్టించడం, వాటిని తిరగరాయడం టిడిపికి మాత్రమే సాధ్యం అన్నారు.మహానాడును గ్రాండ్ సక్సెస్ చేసిన అందరికీ అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.కార్యకర్తే అధినేత అనే నినాదాన్ని ఆచరిస్తూ ఈ మహానాడులో వారికి భాగస్వామ్యం కల్పించాం అన్నారు. ఆకాశమే హద్దుగా పార్టీలో కార్యకర్తలు ఎదిగేందుకు అవకాశాలు కల్పించాం నేతలు, కార్యకర్తలను చూసి నేను కూడా పోటీ పడే పరిస్థితి వచ్చింది. శాశ్వతంగా పార్టీని మోసింది, మోసేది, మోయబోయేది కార్యకర్తలే. వారందరికీ పాదాభివందనం. 48 డిగ్రీల తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలు, ఎండలు ఉన్నా 1,875 క్లస్టర్ల నుంచి ఈ హైబ్రీడ్ విధానంలో మహానాడుకు హాజరై విజయం చేకూర్చారు. కార్యకర్తల సంక్షేమం కోసం రూ.160 కోట్ల రూపాయల మేర ఖర్చు చేశాం. నాపై కార్యకర్తలు, ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తున్నాను అందుకే 2047 స్వర్ణాంధ్ర విజన్ తయారు చేసి ఆ దిశగా ముందుకు వెళ్తున్నాను. తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు నేను ఎప్పుడూ రుణపడి ఉంటాను. కార్యకర్తల బిడ్డలకు విద్య, సాధికారత, నైపుణ్యం లాంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. సోషల్ రీ ఇంజనీరింగ్ ద్వారా విస్తృత అవకాశాలు కల్పిస్తున్నాం, బూత్ కమిటీలు, యూనిట్లు క్లస్టర్ల వరకూ అందరికీ న్యాయం చేస్తున్నాం. ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్ మా లక్ష్యం. నీతి నిజాయితీగా కార్యకర్తలు ఆర్థికంగా ఎదిగేలా నేను బాధ్యత తీసుకుంటాను.

ప్రజల కోసం పనిచేసే కార్యకర్తల కోసం నేతలు కూడా పనిచేయాలని పిలుపునిస్తున్నాను పార్టీ కోసం, జెండా కోసం నేతలు, కార్యకర్తలు తమ ఆస్తులు అమ్ముకున్నారు. మెడపై కత్తి పెట్టినా జై చంద్రబాబు, జై తెలుగుదేశం అంటూ ప్రాణం వదిలిన కార్యకర్తలే నాకు శిరోధార్యం అన్నారు.

**స్వర్ణాంధ్ర సాకారం దిశకు అడ్డు వైసీపీ**

గొడ్డలి పార్టీ పాలనలో రాష్ట్రం ఆర్థిక సంక్షోభం, పెట్టుబడుల తగ్గుదల, పరిశ్రమల వలస, సాగునీటి ప్రాజెక్టుల నిరక్ష్యం, యువతలో నిరుద్యోగం వంటి అనేక సవాళ్లను ఎదుర్కొన్నాం. ఈ నేపథ్యంలో రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి మార్గంలో నడిపించాల్సిన చారిత్రాత్మక బాధ్యతను ప్రజలు కూటమి ప్రభుత్వంపై పెట్టారు. ప్రజల ఆశయాలను కేంద్ర బిందువుగా తీసుకుని అభివృద్ధి సంక్షేమమే సమాన ప్రాధాన్యంతో అమలు చేయడమే లక్ష్యంగా భావించి సిఎం చంద్రబాబు రెండేళ్ల పాలనలో అమలు చేసి చూపించారు.

2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే టిడిపి లక్ష్యం. స్వర్ణాంధ్ర నిర్మాణం కోసం ప్రతి కార్యకర్త, ప్రతి ప్రజాప్రతినిధి అంకితభావంతో పనిచేయాలని ఈ మహానాడు పిలుపునిస్తోంది. అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన, ప్రజా భాగస్వామ్యంతో రాష్ట్రాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు టిడిపి ప్రభుత్వం సంపూర్ణ కట్టుబాటుతో ముందుకు సాగుతుందని ప్రకటిస్తోందని తెలిపారు.

**ఎన్డీయే కూటమితో సుదృఢ బంధం**

రాష్ట్ర ప్రజల క్షేమం కోరి విశాల దేశ ప్రయోజనాల కోసం గత ఎన్నికల్లో ఎన్డీయే కూటమితో మనం జతకట్టాం. గతంలో అనేక సందర్భాల్లో రాష్ట్రంలోనూ, దేశంలోనూ కూటములను ఏర్పాటు చేశాం. ఎన్డీయేతో గతంలోనూ కలిసి పనిచేసాం. ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రతిష్టను ప్రపంచ వ్యాప్తంగా పెంచేందుకు నిరంతరాయంగా శ్రమిస్తున్నారు. ఆయన నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ప్రగతి పథాన దూసుకెళుతుంది. రాష్ట్రంలో తెలుగుదేశం జనసేన - బిజెపి కూటమిని గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించారు. కూటమికి 164 స్థానాలివ్వడం, ఆరాచక వైసీపీని 11 స్థానాలకే పరిమితం చేయడం తెలుగు వారి విజ్ఞతకు ప్రబల తార్కాణం. గడిచిన రెండేళ్లలో కూటమి మైత్రీ బంధం మరింత బలపడింది. ప్రధాని మోడీ మన అధినేత చంద్రబాబు, యువనేత లోకేష్‌పై చూపుతున్న ప్రేమాభిమానాలు వెలకట్టలేనివి. దేశంలో అనేక రాష్ట్రాల్లో ఎన్డీయే ప్రచారాల్లో, ముఖ్యమంత్రుల ప్రమాణ సంరంభాల్లో మన నాయకుల భాగస్వామ్యం అనిర్వచనీయం. అలాగే జన సేనాని పవన్ కల్యాణ్ కూటమి ఐక్యతకు, పాలన జనరంజకంగా సాగడానికి అందిస్తున్న సంపూర్ణ మద్దతు మరువలేనిది. ఈ రాష్ట్రానికి కనీసం 15 సంవత్సరాలు చంద్రబాబు పాలన అవసరమని పదే పదే ఆయన చెబుతుండడం కూటమి ఐకమత్యానికి తిరుగులేని సంకేతం. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో, దేశంలో ఎన్డీయే కూటమి భవిష్యత్తులో మరింత బలపడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదని చంద్రబాబు పేర్కొన్నారు.

# 'భారతరత్నం' ఎన్టీఆర్

>> రన్నారు. తెలుగు ప్రజల ఐక్యత కోసం పనిచేసిన మహోన్నత నేత ఎన్టీఆర్ అని... భారత రాజకీయ చరిత్రలో ఆయన సేవలు విశిష్టం...అపూర్వం అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎన్టీఆర్‌కు భారత రత్న ప్రకటించాలని మహానాడు ఏకగ్రీవంగా తీర్మానించింది.

**ఎన్టీఆర్ ఖ్యాతి మరెవరికీ సాధ్యం కాదు**

తెలుగు జాతి ఉన్నంత వరకూ తెలుగువారి గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయే వ్యక్తి ఎన్టీఆర్. ఎన్టీఆర్ జయంతి తెలుగువారందరికీ పండుగ రోజు. సాధారణ ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించి...సినీ జీవితంతో పాటు రాజకీయాల్లోకి వచ్చి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ఎదిగారు. ఎన్టీఆర్ మళ్లీ పుడితే తప్ప ఆయన క్రమశిక్షణ, ఆయన ఖ్యాతి మరెవరికీ సాధ్యం కాదు. ఆయన ఎక్కడ ఉన్నా తెలుగువారి ఆత్మగౌరవం కోసమే జీవించారు. రైతుబిడ్డ నుంచి సినిమాల్లో శ్రీరామ, శ్రీకృష్ణ పాత్రల వరకూ, టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడిగా, ఉమ్మడి ఎపి ముఖ్యమంత్రిగా ఆయన చరిత్ర సృష్టించారు. ఎన్టీఆర్ పేరు తలుచుకుంటేనే పట్టుదల, ఆత్మవిశ్వాసం వస్తుంది. ఆయన పేరు తలచుకుని సంకల్పం చేస్తే చాలు దేనికీ తిరుగు ఉండదు. దేశ రాజకీయాల్లో ఆయన లాంటి నాయకుడు మరొకరు లేరు. ఆయన మొదట సబ్ రిజిస్ట్రార్‌గా ఉద్యోగంలో చేరి ఆ తర్వాత సినిమాల్లోకి వచ్చారు. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన స్థాపించిన ప్రాంతీయ పార్టీ అయిన తెలుగుదేశం దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించింది. కేంద్రంలో ప్రభుత్వాల ఏర్పాటులో ముఖ్య పాత్ర పోషిచింది అని సిఎం చంద్రబాబు అన్నారు.

**ప్రజల మనస్సుల్లో ఎన్టీఆర్‌ది చిరస్మరణీయ స్థానం..**

"ఎన్టీఆర్ పాలన రైతులకు అండ, మహిళలకు భరోసా, కార్మికులకు అభయం, యువతకు దిక్సూచి అయ్యింది. సమాజమే దేవాలయం...ప్రజలే దేవుళ్లు అనే నినాదాన్ని శాశ్వత విధానంగా ఎన్టీఆర్ మార్చారు. తెలుగుదేశం జెండా ఆడబిడ్డలకు అండ, రైతన్నలకు భరోసా, యువతకు విశ్వాసం. 1983లో రాజకీయాల్లో యువతకు ఎన్టీఆర్ అవకాశాలు కల్పించారు. మహిళలకు ఆస్తి హక్కు కల్పించారు. భవిష్యత్‌లో పార్టీకి సమర్థ నాయకత్వం ఉండేలా భవిష్యత్ కార్యాచరణ చేపడుతున్నాం. జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు లోకేష్ మహానాడు తొలిరోజున ప్రతిపాదించిన 33 శాతం రిజర్వేషన్‌ను మనమే ప్రారంభిద్దాం అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను కల్పించాలని కేంద్రాన్ని మరోమారు కోరదాం." అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అంతకు ముందు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాళులు అర్పించారు.ఎన్టీఆర్ విగ్రహానికి నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ సీనియర్ నేతలు, మంత్రులు, పొలిట్ బ్యూరో సభ్యులు. అంజలి ఘటించారు. ఇక మహానాడు రెండో రోజు 1875 క్లస్టర్ల నుంచి వర్చువల్‌గా 10 లక్షల మంది హాజరయ్యారు.

**కాలపురుషుడి సంతకం ఆవిష్కరణ**

మహానాడు వేదిక నుంచి కాలపురుషుడి సంతకం పేరిట రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించిన టిడిపి అధినేత, సిఎం చంద్రబాబుతో కలిసి పార్టీనేతలు ఆవిష్కరించారు.చంద్రబాబు జీవితాన్ని ఆవిష్కరిస్తూ రాసిన కాలపురుషుడి సంతకం పుస్తకాన్ని రూపొందించారు.చంద్రబాబు రాజకీయ ప్రస్తానంలో కీలకంశాలు ఈ పుస్తకంలో పొందుపరిచారు.పుస్తకావిష్కరణలో పలువురు కీలక నేతలు పాల్గొన్నారు.

# విజనరీ పాలనకు వచ్చాం

>> కాశాలు కల్పిస్తున్నామని రామ్మోహన్ నాయుడు వివరించారు.

ఆరోజు మూడు ముక్కలాట ఆడితే ఇవాళ ప్రజా రాజధాని అమరాతిని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఆ రోజు సంక్షోభం ఉంటే ఇవాళ ప్రజలకు సంక్షేమం అందుతోందని తెలిపారు.

చంద్రబాబుపై నమ్మకంతో దావోస్‌లో ఏపీకి భారీగా పెట్టుబడులు వచ్చాయన్నారు. ఏడాది పాలనలో ఐదేళ్ల విధ్వంస పాలనను తిప్పికొట్టి బ్రాండ్ ఏపీ రూపొందించారని పేర్కొన్నారు.

# మహానాడు సంచలన రికార్డు

>> నుంచి పార్టీలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. పదవికాల పరిమితిని తీసుకు వచ్చింది తామేనని ఈ సందర్భంగా నారా లోకేష్ గుర్తు చేశారు. ఎన్నికల గురించి కాదు.. సిద్ధాంతపరంగా తాము సంస్కరణలు తీసుకువస్తున్నామని చెప్పారు. గత మహానాడులో తాను ఆరు శాసనాలు గురించి చెప్పానని ఈ సందర్భంగా నారా లోకేష్ గుర్తు చేశారు. ఇప్పుడు 'నా తెలుగుదేశం.. నా బాధ్యత' అని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఎవరైనా తన ప్రసంగం ముందు నా తెలుగుదేశం.. నా బాధ్యత అని చెప్పాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. జెన్-జెడ్ ఏమిఆశిస్తుందో... ఆలోచించి అందుకు అనుగుణంగా తాము ముందుకు వెళ్లాల్సి ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. వైసీపీ అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్‌లాగా తాము ఏకపక్షంగా ఏకగ్రీవాలు చేసుకోమని చెప్పారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరిస్తామన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎన్నికలలో నామినేషన్ల పేపర్లు లాక్కుని ఎలా వ్యవహరించారనేది అందరం చూశామన్నారు. అందుకనే ఆయన ఏకగ్రీవాలు చేస్తే ఊరుకోమన్నారని చెబుతున్నారని తెలిపారు. నాడు ఆయన చేశాడు కాబట్టే నేడు భయపడుతున్నారంటూ జగన్ వైఖరిని ఈ సందర్భంగా లోకేష్ ఎండగట్టారు. డీఎస్సీ పరీక్షలు, నియామకాలు పూర్తయిన ఆరు నెలలు తర్వాత అందులో అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించడం ఏమిటని లోకేష్ సందేహం వ్యక్తం చేశారు. ఆయనకు ఇప్పుడు ట్యూబ్ లైట్ వెలిగినట్లుందంటూ వ్యంగ్యంగా అన్నారు. అప్పట్లోనే కోర్టులో డీఎస్సీపై జగన్ ఎన్నో కేసులు వేయించారని గుర్తు చేశారు. అన్ని పిటిషన్లను కోర్టు కొట్టివేసిందని.. కానీ మమ్మల్ని ఎక్కడా తప్పు పట్టలేదని లోకేష్ వివరించారు. ఈ అంశంపై దమ్ముంటే చర్చకు రావాలని జగన్‌కు తాను సవాల్‌విసిరానని లోకేష్ గుర్తుచేశారు. దీనిపై జగన్ స్పందిస్తే బాగుంటుందన్నారు. ఒక్క టీచర్ కానీ.. అధికారి కానీ డీఎస్సీపై ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు. డీఎస్సీపై నాకు కానీ, ఏ అధికారికి గానీ ఒక్క రూపాయి అయినా ఇచ్చినట్లు నిరూపించాలని జగన్ పార్టీలోని నేతలను ఈ సందర్భంగా లోకేశ్ డిమాండ్ చేశారు. లెవన్ టీమ్ కెప్టెన్‌కు దమ్ముంటే నిరూపించాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు లోకేశ్ సూటిగా సవాల్ విసిరారు.

# కాల్పుల విరమణ పొడిగింపు ముసాయిదా ఆమోదం

## శుద్ధిచేసిన యురేనియం నిల్వలపై చర్చకు యుఎస్ ఓకే

**వాషింగ్టన్, టెహ్రాన్, మే 28:** అమెరికా, ఇరాన్ 60 రోజుల కాల్పుల విరమణ పొడిగింపు కోసం ఒక ముసాయిదా ఒప్పందాన్ని అంగీకరించాయి, అయితే ఈ అవగాహన పత్రానికి ఇంకా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదం తెలపాల్సి ఉంది. కాల్పుల విరమణను పొడిగించడానికి మరియు ఇరాన్ అణు కార్యక్రమంపై చర్చలు ప్రారంభించడానికి ఇరు దేశాలు ఒక ఒప్పందానికి వచ్చాయని యాక్సియోస్ ఏజెన్సీ ఉటంకించింది. ఈ సంస్థ నివేదిక ప్రకారం, ఈ ఒప్పందానికి ఇరాన్ కూడా ఇంకా అంగీకరించలేదు. ఒప్పందం యొక్క ముసాయిదాపై కసరత్తు జరిగిందని మరియు మంగళవారం నాటికి చాలా వరకు ఆమోదించారని అయితే ఇరు పక్షాల ఉన్నత నాయకత్వం ఇంకా తమ ఆమోదం తెలపాల్సి ఉందని ఆ నివేదిక పేర్కొంది. ఒప్పందం వివరాల గురించి ట్రంప్‌కు తెలియజేసినప్పటికీ, ఆయన వెంటనే దానిపై సంతకం చేయలేదు మరియు దాని గురించి ఆలోచించడానికి నాకు రెండు రోజులు కావాలని చెప్పినట్లు ఒక అమెరికా అధికారిని ఉటంకిస్తూ యాక్సియోస్ నివేదించింది. అణు ఆయుధం, యురేనియం, హోర్ముజ్, ఇరాన్ చమురు వీటిపైనే చర్చలు కొలిక్కివచ్చినట్లు సమాచారం.

60 రోజుల ఈ అవగాహన ఒప్పందంలో హర్ముజ్ జలసంధి గుండా నౌకల స్వేచ్ఛా రాకపోకలు కూడా ఉంటాయి. ఈ వ్యూహాత్మక మార్గం గుండా వెళ్లే నౌకల నుండి ఇస్లామిక్ రిపబ్లిక్ సుంకాలు వసూలు చేయలేదు. ఆ జలసంధిలో ఎలాంటి వేధింపులు ఉండవని, అలాగే 30 రోజుల్లోగా ఆ జలమార్గం నుండి అన్ని మందుపాతరలను తొలగించాలని ఇరాన్‌ను ఆదేశించాల్సి ఉంటుందని ఒక అమెరికా అధికారి ఆ పత్రికకు తెలిపారు. అమెరికా నావికా దిగ్బంధనం విషయానికొస్తే, హోర్ముజ్ జలసంధి గుండా వాణిజ్య నౌకాయానం ఏ స్థాయిలో పునరుద్ధరించబడుతుందో, అందుకు సమాంతరంగా దిగ్బంధం ఎత్తివేస్తామని ఆ అమెరికా అధికారి చెప్పారు. ఫ్రేమ్‌వర్క్ ఒప్పందంలో ఆంక్షలు మరో ముఖ్యమైన అంశం కాగా, ఇరాన్ స్వేచ్ఛగా చమురును విక్రయించుకునేందుకు వీలుగా కొన్ని ఆంక్షల మినహాయింపులు ఇచ్చేందుకు అమెరికా సిద్ధంగా ఉంది. అణు ఆయుధాన్ని తయారు చేయబోమని ఇరాన్ ఇచ్చే హామీ కూడా ఈ ఒప్పందంలో ఉంటుందని నివేదిక పేర్కొంది. 60 రోజుల కాల్పుల విరమణ కాలంలో, ఇరాన్ వద్ద ఉన్న అత్యంత సుసంపన్నం చేసిన యురేనియంను వదులుకోవాలి, ఇరాన్ సుసంపన్నతకు సంబంధించి అనుసరించాల్సిన కార్యాచరణపై ఇరుపక్షాలు చర్చలు జరుపుతాయి. స్తంభింపజేసిన ఇరాన్ నిధులు, ఆంక్షలు అనే రెండు అంశాలపై చర్చల సందర్భంగా చర్చించడానికి అమెరికా కూడా కట్టుబడి ఉంది.

# ప్రజా పోరాటాలు ఉధృతం

>> కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, జల్లి విల్సన్, గుల్జార్ సింగ్ గోరియా, ఆవుల శేఖర్, ఆర్.వెంకట్రావు, ఎంఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన విప్లవ గేయాలు సభికులను ఆకట్టుకున్నాయి. అనంతరం జి రామ్ జి చట్టాన్ని రద్దు చేసి ప్రస్తుతం అమలులో ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం పేదల జీవనాధారాలపై పద్ధతిగా దాడులు చేస్తోందని విమర్శించారు. అధికారంలోకి రాకముందు పేదరికాన్ని నిర్మూలిస్తామని, కోట్లాది ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రధాని నరేంద్రమోడీ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే పనిలో పడ్డారని ఆరోపించారు. గ్రామీణ పేదలకు కనీస ఉపాధి భరోసా కల్పించే ఈ చట్టానికి ఏడాదికి భారీగా నిధులు కేటాయించాల్సి ఉండగా ఉద్దేశపూర్వకంగా అరకొర నిధులు కేటాయిస్తూ బలహీనపరుస్తున్నారని అన్నారు. 100 రోజుల పనికి హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు 50 రోజులకే పరిమితం చేస్తోందని, కూలీలకు రావాల్సిన వేతనాలను కూడా నెలల తరబడి చెల్లించడం లేదని విమర్శించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ పేదల జీవితాలతో కేంద్రం చెలగాటం ఆడుతోందని డి.రాజా మండిపడ్డారు. దళితులు, గిరిజనులు, మైనార్టీలపై దాడులు పెరుగుతున్నాయని, మరోవైపు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, వైద్యం, ఆరోగ్య సేవలు పేదలకు అందని ద్రాక్షలా మారిపోయాయని అన్నారు. ప్రజాస్వామ్య హక్కులను అణగదొక్కుతూ కేంద్ర ప్రభుత్వం నిరంకుశ ధోరణిలో వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు, ప్రజాస్వామ్య వాదులు ఐక్యంగా ముందుకు వచ్చి ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ దశాబ్దాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమన్నారు. దేశంలోని గ్రామీణ పేదలకు జీవనాధారంగా నిలిచిన ఈ చట్టాన్ని సమాధి చేయాలని కేంద్రం ప్రయత్నించడం దుర్మార్గమని విమర్శించారు. దేశంలో సుమారు 40 శాతం మంది ఈ చట్టం ద్వారా ఉపాధి పొందుతున్నారని, అలాంటి చట్టాన్ని ఎందుకు రద్దు చేయాలనుకుంటున్నారో కేంద్ర ప్రభుత్వం ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 6 నుంచి 15 వరకు దేశవ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకువస్తామని, సెప్టెంబర్ 15న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టి కేంద్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక ఇస్తామని కె.రామకృష్ణ ప్రకటించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలంటే ప్రజలంతా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య మాట్లాడుతూ జి రామ్ జి చట్టానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. గ్రామీణ పేదల జీవనోపాధిని దెబ్బతీసే ఈ చట్టంపై ప్రతి గ్రామానికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## వారం - వర్జ్యం

29-05-2026, అధికజ్యేష్ఠ శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మృగశిర కార్తె
త్రయోదశి ఉ.9.51, స్వాతి ఉ.10.38
వర్జ్యం : సా.4.52-సా.6.39
దు.ఉ.8.09-ఉ.9.01,2)మ.12.30-మ.1.22
శుభసమయం : ఉ.6.30-7.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** ఉద్యోగములో అనుకూల వాతావరణము ఏర్పడుతుంది. పెద్దల నుండి సలహాలు సూచనలను తీసుకుంటారు.

**వృషభం:** గ్రూప్ రాజకీయములకు దూరముగా ఉండుట మేలని గ్రహిస్తారు. పదవులు సంప్రాప్తిస్తాయి.

**మిథునం:** తప్పించు తిరుగువాడు ధన్యుడు సుమతీ అను దానిని కుటుంబ బాధ్యతలలో వర్తింప చేయరు. నూతన విద్యావకాశాలు.

**కర్కాటకం:** సోదరీ వర్గీయుల నుండి, సన్నిహితుల నుండి వినూత్న రీతిలో రాజీ యత్నములు వస్తాయి.వాహనాలు కొనుగోలు.

**సింహం:** ఆర్థిక సంబంధిత విషయముల మీద, మీ దృష్టిని కేంద్రీకరించ వలసి వస్తుంది. విద్యావకాశాలు కలవు.

**కన్య :** మంచితనం, కార్యదక్షత, నైతిక ధర్మం ఇవన్నీ బరువుగా పరిణమిస్తాయి. ఆరోగ్య నియమాలను పాటిస్తారు. వాహన సౌఖ్యం.

**తుల:** మీరు అనుకున్న పనిని సాధించి విజయమును, లబ్దిని పొందగలుగుతారు. ప్రజాకర్షణ ఏర్పడి ఉపయోగపడుతుంది.

**వృశ్చికం:** సమాజములో పలుకుబడి, గౌరవ ప్రతిష్ఠలు గల వ్యక్తుల సహకారము లభించుటవలన లాభము చేకూరుతుంది.

**ధనుస్సు:** ఆధ్యాత్మిక కార్యక్రమాలకు, శుభకార్యములకు, ధనము బాగా ఖర్చు చేయవలసి వస్తుంది. కొత్త పరిచయాలు.

**మకరం:** మీ గురించి చెడుగా ప్రచారము చేసే వ్యక్తులకు దూరము ఉండుట మంచిది. విలువైన సమాచారం అందుతుంది.

**కుంభం:** సంతానము యొక్క విద్యా విషయముల మీద మీ దృష్టిని కేంద్రీ కరిస్తారు. వివాదాలకు దూరంగా ఉండండి.

**మీనం:** గృహనిర్మాణము, భూమి కొనుగోలు మొదలైన విషయములు నెమ్మదిగా సానుకూల పడతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సిద్ధరామయ్య రాజీనామా

>> అనంతరం శాసనసభా పక్ష సమావేశం ఏర్పాటుచేసి డికెశివకుమార్‌ను శాసనసభా పక్షనేతగా ఎంపికచేసుకోవడం, ముఖ్య మంత్రి అభ్యర్థిగా హైకమాండ్ ఆదేశాలు జారీ చేయడం అన్నీజరిగిపోతాయి. అధిష్టానం సూచనలమేరకే తాను రాజీనామా చేసానని అందరూ హైకమాండ్ ఆదేశాలకే కట్టుబడి ఉంటామని సిద్ధరామయ్య తెలిపారు. రాష్ట్రప్రయోజనాలను ఆశించే వైదొలిగినట్లు తెలిపారు. ఏడుకోట్లమంది కర్ణాటక ప్రజలకు సేవచేసే అదృష్టం లభించిందని రాజ్యాంగమే మాధర్మం అని ప్రజలే మాకు దేవుళ్లు అంటూ సిద్ధరామయ్య ప్రకటించారు.

**జాతీయ రాజకీయాల్లోకి వెళ్లనే వెళ్లను**

జాతీయ రాజకీయాల్లోకి రావాలని, రాజ్యసభ ఎంపికగా వెళ్లాలని హైకమాండ్ సూచించిందని అయితే తాను సున్నితంగా తిరస్కరించానని సిద్ధరామయ్య చెప్పారు. జాతీయ రాజకీయాలపై ఆసక్తిలేదని, కానీ రాజకీయాలనుంచి మాత్రం వైదొలగబోనని, ప్రజలు ఐదేళ్లకాలానికి ఎన్నుకున్నారని, ఇంకా రెండేళ్లు మిగిలే ఉన్నాయని అప్పటివరకూ ఎమ్మెల్యేగానే కొనసాగుతానన్నారు. కాంగ్రెస్‌లో చేరినప్పటినుంచి నన్ను పార్టీ ఆదరించిందన్నారు. సిఎం అవుతానని ఊహించలేదని, అలాంటిది సిఎంగా, ప్రతిపక్షనేతగా రెండేసి పర్యాయాలు సేవలందించినట్లు గుర్తుచేసారు. మేనిఫెస్టోలో ఇచ్చిన 160 హామీల్లో 158 నెరవేర్చగలిగానని గుర్తుచేసారు.తొలి యేడాదిలోనే ఐదు గ్యారంటీలు అమలుచేసామన్నారు. తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకమని, పదవికోసం డబ్బుకోసం ఎప్పుడూ పాకులాడలేదని సిఎం సిద్ధరామయ్య పేర్కొన్నారు.

**బ్రేక్‌ఫాస్ట్‌మీట్‌లోనే డికెపేరు ప్రకటించిన సిద్ధరామయ్య**

ఢిల్లీనుంచి రాగానే ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌మీట్ ఏర్పాటుచేసిన సిద్ధరామయ్య ఆ సందర్భంలోనే ముఖ్యమంత్రిగా డికెశివకుమార్ బాధ్యతలు చేపడతారని ప్రకటించారు. సుదీర్ఘకాలంపాటు ముఖ్యమంత్రిగా పనిచేసానని ఎలాంటి స్వలాభాపేక్ష లేకుండా చిత్తశుద్ధితో తన బాధ్యతలు నిర్వర్తించానని, తనకు సహకరించిన కేబినెట్‌సభ్యులు ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్‌నేతలు అందరికీ సిఎం పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఢిల్లీకివెళ్లి కాంగ్రెస్‌నేతరాహుల్ గాంధీతో కూడా భేటీ అవుతున్నారు. శనివారంజరిగిన సీఎల్పీసమావేశంలోనే శివకుమార్ పేరు వెల్లడిస్తారని అందరూ చెపుతున్నారు. అయితే పార్టీపరంగాను, అధికారికంగాను శివకుమార్‌ప్రకటన వెల్లడి కావాల్సి ఉంది.

**30వ తేదీనే డికెప్రమాణ స్వీకారం**

ముఖ్యమంత్రి అభ్యర్థిగా హైకమాండ్ నేరుగాప్రకటించకపోయినప్పటికీ ఢిల్లీలో సిద్ధరామయ్య భేటీ తర్వాత డికెశివకుమార్‌పేరు ప్రకటిస్తారని చెపుతున్నారు. అలాగే సిద్ధరామయ్య వర్గానికి కేబినెట్‌లో సముచిత బెర్త్‌లు ఉండాలని ఆ వర్గం పట్టుబడుతోంది. అయితే ప్రాధాన్యతా క్రమంలోనే కేబినెట్ బెర్త్‌లు ఉంటాయని డికెవర్గం ఎమ్మెల్యేలు వాదిస్తున్నారు. అలాగే మరో ఇద్దరు డిప్యూటీ సిఎంలు ఉండాలని వారు దళిత, వెనుకబడిన వర్గాలకు చెందినవారై ఉండాలని కూడా సిద్ధరామయ్య ప్రతిపాదించారని అంచనా. వాటన్నింటిపైనా చర్చించేందుకే ఆయన ఢిల్లీ వెళ్లారని చెపుతున్నారు. మొత్తంగాచూస్తే ఏడాదిగా సాగుతున్న ఈ సిఎం వివాదం ఐదురాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత అందులోనూ కేరళ పరిస్థితి సద్దుమణగడంతో కర్ణాటకలో నాయకత్వ మార్పుపై పతాకస్థాయి రాజకీయాలు చోటుచేసుకున్నాయి. చివరకు డికెకు ట్రాక్ క్లియర్ కావడంతో ఆయన 30వ తేదీనే ప్రమాణస్వీకారం చేస్తారని ఆయనవర్గం సంబరాల్లో మునిగితేలుతోంది.

# సమస్యలు పరిష్కరిస్తాం

>> మానిటరింగ్ వంటి సాంకేతిక చర్యలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.జీఎం సోయా దిగుమతులు, ఫిష్ మీల్ లభ్యత, దిగుమతి లైసెన్సులు, ఎగుమతి పోటీతత్వం వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపనున్నట్లు వెల్లడించారు. ఆక్వా రైతుల సంక్షేమం, ఫీడ్ పరిశ్రమ స్థిరత్వం, ఎగుమతుల వృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుందని, అన్ని భాగస్వామ్యులు పరస్పర సహకారంతో ముందుకు రావాలని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, మత్స్యశాఖ కమిషనర్ రామ శంకర్ నాయక్, అధికారులు, ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ఆనం వెంకటరమరెడ్డి, ఏఐసీ సభ్యులు, ఏపీఎస్ఏడీఏ సభ్యులు, రైతు సంఘాలు, ఫీడ్ తయారీదారులు, ఎగుమతిదారుల సంఘాలు, పరిశ్రమ ప్రతినిధులు, ఇతర భాగస్వాములు పాల్గొన్నారు.

# విజయ సాయి విచారణ పూర్తి

>> విజయసాయిరెడ్డి రెండుసార్లు విచారణకు హాజరయ్యారు. కుంభకోణానికి సంబంధించి జరిగిన విధాన నిర్ణయాలు, రహస్య ఆర్థిక లావాదేవీకీలపై ఆయన్ను ప్రశ్నించినట్లు సమాచారం. బ్యాంకు లావాదేవీలు, విజయసాయి అందించిన వివరాలపై అధికారులు ఆరా తీసినట్లు తెలుస్తోంది.అయితే విజయసాయిరెడ్డి ఈ విచారణలో సైతం ఇడి సహకరించలేదని తెలుస్తోంది. తనను అనవసరం తరచు విచారణకు పిలిపించడం సరికాదని ఆయన వాదించారంటున్నారు. పిలిస్తే వస్తాను, ఇంత కన్నా నా దగ్గర అప్డేట్ ఏముంటదని ఆయన ఇడిని ప్రశ్నించారంటున్నారు. విచారణ అనంతరం విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడారు. కేసు దర్యాప్తులో భాగంగా గతంలో సీజ్ చేసిన మొబైల్ ఫోన్లలోని వివరాలను సేకరించారు. ఈ కేసుతో నాకు సంబంధం లేదు. నేను ఎవరి పేర్లూ చెప్పలేదు. మద్యం కుంభకోణానికి సంబంధించిన విషయాలన్నీ రాజ్ కెసిరెడ్డికి తెలుసని చెప్పారు. అని విజయసాయిరెడ్డి అన్నారు.

# ఉగ్రనరసింహం లోకేష్ దెబ్బకు గొడ్డలి పార్టీ పరార్

### - పొలిట్‌బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి



మహానాడులో ప్రసంగిస్తున్న గోరంట్ల

**విజయవాడ,మే28,ప్రభాతవార్తప్రతినిధి:**విజన్ 2020తో రాష్ట్ర గతిని, స్థితిని మార్చిన నాయకుడు చంద్రబాబు అని పొలిట్‌బ్యూరో సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఈ కార్యక్రమంలో 44 ఏళ్ల టీడీపీ ప్రస్థానంపై ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రసంగించారు.ఇంత ఎండల్లో మహానాడు సాధ్యమేనా అని అనుమానం కలిగిందని.. వర్చువల్‌గా 7.5 లక్షల మంది కలిసేలా టెక్నాలజీని వినియోగించి చూపించిన నేత లోకేశ్ అని కొనియాడారు. దేశానికే దిక్సూచిగా లోకేశ్ మారే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. పులి కడుపున పులే పుడుతుందని... పెద్ద పులి సాధువు... చిన్న పులి ఉగ్రనరసింహమన్నారు. ఈ ఉగ్రనరసింహం దెబ్బకు గొడ్డలి పార్టీ పరార్ అంటూ వ్యాఖ్యానించారు. తెలుగు జాతి ఐక్యత కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం ప్రధాన పాత్ర పోషిస్తున్న నేత లోకేశ్ అని తెలిపారు. మహిళలకు కేంద్రం ఇచ్చినా ఇవ్వకున్నా 33 శాతం రిజర్వేషన్లు ఇస్తామనడం అభినందనీయమన్నారు. కార్యకర్తలకు, నాయకులకు మనో ధైర్యం చంద్రబాబు, లోకేశ్ అని చెప్పారు. ఎన్టీఆర్.. కాంగ్రెస్‌ను మట్టి కరిపించారనే అక్కసుతో పద్మభూషణ్, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు, భారతరత్న ఇవ్వలేదని విమర్శించారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అన్న ఎన్టీఆర్‌కు భారతరత్న ఇచ్చేలా కృషి చేద్దామని గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. ఎన్టీఆర్ మాకు, మనకు ఆరాధ్య దైవం. రాజకీయాల్లోకి వద్దామని అనుకుంటున్నా అని ఎన్టీఆర్ హింట్ ఇచ్చేవారు. 1982 మార్చి 28న ఆదర్శ్ నగర్‌లో ప్రకటన చేశారు. పెద్ద పెద్ద వాళ్లు ఎవరు రాలేదు. సామాన్యులు మాత్రమే ఎన్టీఆర్‌కి అండగా నిలిచారు. పేదవాడు అంబలి ఇస్తే తాగేవాడు ఎన్టీఆర్. 7 నెలల పాటు తుఫాను, ఎండలు ఉన్నా ఎన్టీఆర్ పాదయాత్ర చేశారు. 9 నెలల్లో అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టించారు అని తెలిపారు. ఎన్టీఆర్ ఏ చిత్రం తీసినా 300 రోజులు ఆడేవని.. ఆ రోజుల్లోనే రాజకీయాల్లోకి వచ్చారని గోరంట్ల బుచ్చయ్య అన్నారు. సమస్యలు ఎదుర్కొని నీతివంతమైన పరిపాలన సాగించారన్నారు. నెల రోజుల్లో ఇందిరా గాంధీని ఎదిరించి అధికారంలోకి వచ్చిన నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. శ్రీశైలం ప్రాజెక్ట్‌ను సాగు, మంచినీరు ఇచ్చేవిధంగా తెలుగు గంగకు శ్రీకారం చుట్టారన్నారు.

మిగులు జలాల పేరుతో తెలుగు గంగను వైఎస్ఆర్ అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఎన్టీ రామారావుపై అవినీతి ఆరోపణలు చేసి కోర్టుకు రాకుండా వైఎస్ఆర్ తప్పుకున్నారని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ పెట్టిన పథకాలను దేశమే ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగిందని అన్నారు.

# ఎన్టీఆర్‌ది మరణం లేని జననం

### ఎన్టీఆర్ ఘాట్ వద్ద పురందేశ్వరి నివాళి

### 103వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో ఘనంగా నివాళులర్పించిన ఎన్టీఆర్ కుటుంబసభ్యులు, అభిమానులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 28:** టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సిఎం నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా ప్రముఖులు నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద దగ్గుబాటి దంపతులు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, వైసీపీ నేత లక్ష్మీపార్వతి తదితరులు ఎన్టీఆర్ సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి అంజలి ఘటించారు. ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు, సినీప్రముఖులు.. ఎన్టీఆర్‌కు నివాళి అర్పించారు. నారా భువనేశ్వరి, కుమారుడు నందమూరి రామకృష్ణ, మాజీమంత్రి పెద్దిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నర్సి రెడ్డి, సినీనటుడు మాగంటి రాజేంద్రప్రసాద్ ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులు అర్పించారు.

**ఎన్టీఆర్‌ది మరణం లేని జననం: పురందేశ్వరి**

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా దగ్గుబాటి వెంకటేశ్వరరావు, పురందేశ్వరి దంపతులు ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ.. ఎన్టీఆర్ విగ్రహాలు స్థాపించడం పరిపాటన్నారు. తెలుగువారు ఎక్కడున్నా.. అందరిపై ఎన్టీఆర్ ఆశీర్వాదం ఉంటుందన్నారు. ప్రజానాయకుడిగా.. రాజకీయాలంటే ప్రజాసేవ అని ఎన్టీఆర్ రుజువు చేశారని తెలిపారు. ఎన్టీఆర్‌ది మరణం లేని జననమని.. తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్ అని కొనియాడారు.

**మోత్కుపల్లి భావోద్వేగం..**

ఎన్టీఆర్‌ను గుర్తుచేసుకుని మోత్కుపల్లి నర్సింహులు భావోద్వేగానికి గురయ్యారు. ఎన్టీఆర్ లాంటి మనసున్న నాయకుడిని మళ్లీ చూడలే మన్నారు. ఎన్టీఆర్ మళ్లీ పుట్టాలని కోరుకుంటున్నానని.. బోగాల కోసం, డబ్బు కోసం ఎగబడే వాడు నాయకుడు కాదన్నారు. అర్ధ రూపాయి లేకున్నా.. ఎన్టీఆర్ వలనే నేను ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని చెప్పుకొచ్చారు. 'మాదిగ బిడ్డనైన నాకు.. తండ్రి మాదిరి దగ్గరుండి నా పెళ్లి చేశారు' అని గుర్తుచేసుకున్నారు. ఇప్పుడున్న నాయకులు దోపిడీతో కోట్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. మాదిగలను పైకితెచ్చిన నాయకుడు ఎన్టీఆర్ అని, సూర్యచంద్రులు ఉన్నంత వరకు ఎన్టీఆర్ పేరు ఉంటుందని వెల్లడించారు.

**ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో నిలిచే ఉన్నారు: లక్ష్మీపార్వతి**

ఎన్టీఆర్ చనిపోయినా ప్రజల గుండెల్లో ఇప్పటికీ నిలిచే ఉన్నారని లక్ష్మీపార్వతి అన్నారు. అలాంటి మహానుభావుడికి ఇల్లాలిగా ఉండటం తన అదృష్టమని చెప్పుకొచ్చారు. ఆయన ఆశయాల సాధన కోసం పనిచేస్తానని తెలిపారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా తెలుగు వారంతా ఆయన్ని స్మరించుకుంటున్నారన్నారు. కొందరు ఆయన పార్టీని ఆయన పేరును వాడుకుంటున్నా.. ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఇలాంటి వారు బతికున్నా చనిపోయినట్లే అని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అమీర్‌పేట్ మైత్రివనంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి.. ఎన్టీఆర్ ఆశయాల సాధన కోసం పనిచేయాలని కోరుతున్నట్లు తెలిపారు.



ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా గురువారం ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న నారా భువనేశ్వరి, కుమారుడు రామకృష్ణ తదితరులు

**ఎన్టీఆర్‌కు నాగం జనార్దన్ నివాళులు**

ఎన్టీఆర్‌కు మాజీమంత్రి నాగం జనార్దన్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లాయర్లు, డాక్టర్లు, మేధావులకు టికెట్ ఇచ్చి గెలిచి.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు ఎన్టీఆర్ అని అన్నారు. అవినీతి లేని పాలన.. పేదల సంక్షేమం కోసం పనిచేసిన ప్రభుత్వం ఎన్టీఆర్ ది అని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో, దేశంలో నేడు అవి నీతి పెరుగుతోందన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో అవినీతిపైన పోరాటం చేయాలని నిర్ణయించుకున్నట్లు

# రాష్ట్రాన్ని ఐటీ హబ్‌గా మార్చిన నాయకుడు చంద్రబాబు : హోం మంత్రిఅనిత

**విజయవాడ,మే27,ప్రభాతవార్తప్రతినిధి :**ఏపీని ఐటీ హబ్‌గా మార్చిన నాయకుడు చంద్రబాబు అని అనిత పేర్కొన్నారు. రూ.16 వేల కోట్ల లోటుబడ్జెట్‌తో ఏపీ నిర్మాణం ప్రారంభమైందన్నారు. దార్శనికత గల నాయకత్వంలో ఆరోజే అమరావతిని తెచ్చిపెట్టిందని తెలిపారు. 2014 నుంచి ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని వివరించారు. 2019 నుంచి 2024 వరకు విధ్వంస పాలన కొనసాగిందని ఆరోపించారు. ప్రజా వేదికను కూల్చి పరిపాలన ప్రారంభించారని విమర్శించారు. యువత గళం వినిపించేందుకు లోకేశ్ యువగళం చేపట్టారన్నారు. జగన్ మాదిరిగా గొడ్డళ్లు, కత్తులు చేతపెట్టి పాలన సాగించలేదని అనిత తెలిపారు. దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన నాయకుడిని రక్షించే యత్నం చేశారని ఆరోపించారు. అధికారంలో ఉన్నా లేకపోయినా పేదలకు సేవ చేశారన్నారు. సంక్షేమ పథకాలను ఇంటికి వెళ్లి అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కొనసాగాలని పేర్కొన్నారు.

మరో 1520 ఏళ్లు ఇదే ప్రభుత్వం కొనసాగాల్సిన

అవసరం ఉందని,ఇలాగే కొనసాగితే 2047 నాటికి ప్రపంచంలోనే ఏపీ మొదటి స్థానంలో ఉంటుందని వివరించారు.



### చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ సుభిక్షం

**టిడిపి జాతీయ అధికార ప్రతినిధి నర్సిరెడ్డి**

**విజయవాడ మే 28 ప్రభాతవార్త ప్రతినిధి:** చంద్రబాబు సమర్థవంతమైన నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని తెదేపా జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నిర్స రెడ్డి అన్నారు. తెలుగు జాతి కీర్తి కోసం ఆయన ఎంత ముందుకు వెళ్లినా ఆయన వెనుక నడవడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎంత ఎక్కువగాలి వస్తే గాలిపటం అంత పైకి ఎగురుతుంది. అలాగే ఎన్నో ఇబ్బందులు, అవరోధాలు ఎదుర్కొని ఎదిగిన నారా లోకేశ్ నాయకత్వంలో భవిష్యత్తులో పార్టీ మరింత రాటుదేలుతుందన్నారు. రాజకీయాల్లో పాత కాలపు క్షమించే ధోరణలు ఇప్పుడు ఉండవని, యవనాయకత్వంలో వ్యూహాలు చాలా పక్కాగా ఉంటాయని తెలిపారు.

# దేశచరిత్రలో ఎక్కడ జలం ఉంటే అక్కడ నాగరికతల అభివృద్ధి

### - జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు

**సచివాలయం,మే 28,ప్రభాతవార్త :** దేశ చరిత్రలో ఎక్కడ జలం ఉంటే అక్కడ అభివృద్ధి నాగరికత ఉంటుందని రాష్ట్ర జలాల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.గురువారం రెండో రోజు మహానాడు కార్యక్రమంలో భాగంగా జలవనరుల శాఖ పై ప్రతిపాదిస్తూ పల్లెల నుంచి పట్టణాల నుంచి..మహానగరాలుగా అభివృద్ధి చెందిన పరిస్థితికి తెలుగుదేశం పార్టీ కారణమని తెలిపారు.ఈ సత్యాన్ని గ్రహించే...ఆనాడు అన్న ఎన్టీఆర్ దగ్గర నుంచి నేటి చంద్రబాబు నాయుడు వరకు సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు.రాష్ట్ర ఇరిగేషన్ శాఖ గురించి మాట్లాడాల్సి వస్తే..తెలుగుదేశం పార్టీకి ముందు తెలుగుదేశం పార్టీ తర్వాత అనే విధంగా ఉంది.కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన నాటికి రాష్ట్ర ఇరిగేషన్ శాఖని గత ఐదేళ్ళ కాలంలో నీర్వీర్యం చేసి రూ.18వేల కోట్లు అప్పులు మిగిల్చి వారసత్వంగా ఇచ్చిన పరిస్థితి .హంద్రీ నీవా రాయలసీమ జీవనాడి అటువంటి హంద్రీనీవా ఐదేళ్ళ కాలంలో అడుగు లేదన్నారు.

### ఢిల్లీలోని ఏపి భవన్‌లో ఘనంగా ఎన్టీఆర్ జయంతి

**విజయవాడ మే 28 ప్రభాతవార్త ప్రతినిధి:**తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిన గొప్ప వ్యక్తి ఎన్టీఆర్ అని దిల్లీలోని ఏపీ భవన్ అధికారులు కొనియాడారు. ఏపీ భవన్ అంబేద్కర్ ఆడిటోరియంలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. సినిమా రంగంలోనే కాకుండా రాజకీయాల్లోనూ సరికొత్త ప్రభంజనం సృష్టించి తెలుగు జాతిని ఆత్మగౌరవాన్ని సరికొత్త ప్రభంజనం సృష్టించి తెలుగు జాతి ఖ్యాతిని ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెపిపన మహోన్నత నేత అని పేర్కొన్నారు.

పేదరికం లేని సమాజం కోసం రూ.2 కే కిలో బియ్యం, జనతా వస్త్రాలు, పక్కా గృహాల వంటి విప్లవాత్మకమైన, చరిత్రాత్మక పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు.

# మా జీవితాల్లో వెలుగులు నింపారు:ట్రాన్స్‌జెండర్ వర్షిణి

**విజయవాడ మే 28 ప్రభాతవార్త ప్రతినిధి:** స్వాతంత్ర్యం వచ్చాక ఏ ప్రభుత్వమూ ఏ రాజకీయ నాయకులు చేయని ఆలోచనలు కూటమిప్రభుత్వంలో చేసి ట్రాన్స్‌జెండర్ల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని ట్రాన్స్‌జెండర్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి వ్యక్తిగత సహాయకురాలు వర్షిణి చెప్పారు. ప్రత్యేకంగా సంక్షేమం బోర్డు ఏర్పాటు చేసిన అందులో ట్రాన్స్‌జెండర్‌ను నియమించడం ఎవరికీ సాధ్యం కాని గొప్ప ఆలోచవనని అభివర్ణించారు. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వంలో పింఛన్లు, ఇళ్లు వంటివి కల్పించి సమాజంలో తమకూ గుర్తింపు తీసుకొచ్చారి వివరించారు.

# ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ప్రధాని మోడీ నివాళి

**విజయవాడ,మే28,ప్రభాతవార్తప్రతినిధి:**ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నివాళి అర్పించారు. పేద, అణగారిన వర్గాలకు గౌరవం తీసుకురావడమే లక్ష్యంగా ప్రజా సంక్షేమం, సుపరిపాలన పట్ల ఆయనకున్న అంకిత భావం నేటికీ ప్రజల హృదయాల్లో శాశ్వత స్ఫూర్తిగా నిలిచిందన్నారు. చిత్ర పరిశ్రమకు ఆయన అందించిన సేవలు తరతరాలకు గుర్తుంటా యన్నారు. ఎన్టీఆర్ జీవితం, ఆశయాలు అసంఖ్యాకమైన వ్యక్తులకు అపారమైన స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని కొనిడాయారు. చంద్రబాబు నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ప్రజల కోసం ఆయన కలలను సాకారం చేయ డానికి కట్టుబడి ఉందని "ఎక్స్"

# మహాపురుషుడు నందమూరి తారక రామారావు

### 'ఎక్స్' వేదికగా ఎన్టీఆర్‌కు చంద్రబాబు నివాళి

**విజయవాడ,మే 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నివాళులర్పించారు. కృషి ఉంటే మనుషులు ఋషులౌతారు, మహాపురుషులౌతారు అనే మాటకు నిలువెత్తు నిదర్శనం అన్న ఎన్టీఆర్ అని "ఎక్స్" వేదికగా చంద్రబాబు కొనియాడారు.1923 మే 28న కృష్ణా జిల్లా నిమ్మకూరులో జన్మించిన ఆయన తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన కారణజన్ముడన్నారు. సినీ వినీలాకాశంలో రాముడుగా, కృష్ణుడుగా చెరగని ముద్ర వేసిన ఆయన రాజకీయ రంగంలో ధృవతారగా వెలిగారని తెలిపారు. తెలుగు ప్రజల జీవితాల్లో పెను మార్పులు తెచ్చిన ఆధునిక సంఘ సంస్కర్త ఎన్టీఆర్ అన్నారు. ఆ యుగ పురుషుడికి చంద్రబాబు శ్రద్ధాంజలి ఘటించారు.

**తాతా మీరే తెలుగు ప్రజల కీర్తి : మంత్రి నారా లోకేశ్**

తెలుగుజాతి ఆత్మగౌరవంగా తెలుగుదేశం పార్టీ పతాకాన్ని ఎగురవేశారని మంత్రి లోకేశ్ అన్నారు. అణగారిన వర్గాలకు అండగా పసుపు జెండాని నిలబెట్టారని తెలిపారు. మహిళా సాధికారతకు బాటలు వేశారన్నారు. ప్రజల కోసం ప్రగతి కోసం తెలుగుదేశం పార్టీని అంకితం చేశారని లోకేశ్ గుర్తుచేశారు. సంక్షేమానికి చిరునామా ఎన్టీఆర్ అన్నారు. అన్నా అంటే నేనున్నానంటూ ఆదుకున్నారని గుర్తుచేశారు. కోట్లాది హృదయాల్లో కొలువైన మరణంలేని మహా మనిషి ఎన్టీఆర్‌కు లోకేశ్ జోహార్లు తెలిపారు. తాతా మీరే తెలుగు ప్రజల కీర్తి మీరే తమకు నిత్యనూతన స్ఫూర్తి అంటూ లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావుకు డి.సిఎంపవన్ కల్యాణ్ నివాళి

**విజయవాడ,మే28, ప్రభాతవార్తప్రతినిధి:**మాజీ సీఎం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ (శ్ఛ్హ్ర్ఫ్హ్ఫ్హ) ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం ఓ పోస్టు చేసారు.కథానాయకుడిగా ప్రేక్షకుల నీరాజనాలు అందుకుని రాజకీయ జీవితంలోకి వచ్చి ప్రజాపక్షం వహించిన దివంగత నేత ఎన్టీరామారావు గారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా అందించిన సేవలు మరువలేనివి. ఎన్టీ రామారావు గారు జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తున్నాను. రూ.2లకే కిలోబియ్యం పథకం ద్వారా పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో పని చేశారు. ఆ స్ఫూర్తితోనే కూటమి ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను నిర్వహిస్తోంద్ఠి అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# ఆకాశమే హద్దుగా టిడిపి కార్యకర్తలు ఎదిగే పరిస్థితి వస్తుంది : సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే28, ప్రభాతవార్తప్రతినిధి:** వర్చువల్ మహానాడు అదరగొట్టిందని ఇది సరికొత్త అనుభవమని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు,ఏపీ సీఎం చంద్రబాబు చెప్పారు.వర్చువల్ మహానాడుకు 16.75 లక్షల మంది రావడం కొత్త అనుభవమని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ మహానాడు సరికొత్త చరిత్ర సృష్టించిందన్నారు. ప్రపంచంలోనే హైబ్రిడ్ కాన్ఫరెన్స్ ఎలా పెట్టాలో మహానాడు చూపిందని వివరించారు. ఇదో పెద్ద ప్రయోగమని 1875 క్లస్టర్లు, 12 దేశాల ప్రజలు ఆన్‌లైన్‌లోకి వచ్చారని తెలిపారు. రికార్డు సృష్టించడం, తిరగరాయడం, దాన్ని బద్దలుకొట్టడం టీడీపీకే సాధ్యమని స్పష్టంచేశారు. వర్చువల్ మహానాడు ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిందని చంద్రబాబు తెలిపారు. ప్రతి మహానాడులో తీర్మానాలపై జోక్యం చేసుకునేవాడినని పేర్కొన్నారు. కానీ ఈసారి ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని మాత్రమే తీర్మానం చేశానని చెప్పారు. ప్రతి తీర్మానంపై 23 నెలల పాలనను విశ్లేషించారన్నారు. పార్టీ ఏం సాధించింది? భవిష్యత్తులో ఏం సాధిస్తుందని చెప్పారని వివరించారు. కార్యకర్తే అధినేత అనేది ఈ మహానాడులో అడుగడుగునా కనిపించిందని వెల్లడించారు. రామ్మోహన్ బాగా చదువుకున్నారని, రాజకీయాలు కూడా బాగా చేస్తున్నారని అభినందించారు. రామ్మోహన్ మూడోసారి ఎంపీ అయ్యారని, నాలుగోసారి కూడా ఎంపీ అవుతారని చంద్రబాబు జోస్యం చెప్పారు. అనిత టీచర్ నుంచి హోంమంత్రి వరకు అంచెలంచెలుగా ఎదిగారని తెలిపారు. ఆకాశమే హద్దుగా కార్యకర్తలు ఎదిగే పరిస్థితి వస్తుందన్నారు. యువ నాయకులు ఒకరికొకరు పోటీ పడుతున్నారని, మిమ్మల్ని చూసిన తర్వాత తాను కూడా పోటీ పడాల్సి వస్తుందని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

# కృష్ణదేవరాయల రాజనీతిని ఆచరణలో పెట్టిన మహానేత ఎన్టీఆర్ : డాక్టర్ మేడసాని మోహన్

**తిరుమల,మే 28ప్రభాతవార్తప్రతినిధి:** సాహిత్యం, సంస్కృతి, ప్రజాపాలనకు ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని, కృష్ణదేవరాయుల రాజనీతిని తన పాలనలో ఆచరణలో పెట్టిన మహానేత నందమూరి తారక రామారావు అని హెచ్‌డిపిపి సెక్రటరీ డాక్టర్ మేడసాని మోహన్ కొనియాడారు. గురువారం తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో టిటిడి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మేడసాని మోహన్ మాట్లాడుతూ, "ఆముక్తమాల్యద"లోని రాజధర్మ సారాన్ని ఎన్టీఆర్ తన పాలనలో అమలు చేశారని తెలిపారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, నిస్వార్థ పాలన అందించిన దూరదృష్టి నాయకుడిగా ఎన్టీఆర్ నిలిచారన్నారు. తెలుగు సాహిత్యకారులు, కళాకారులను ఆయన విశేషంగా ప్రోత్సహించారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ దైవ పాత్రలను పోషించేముందు ఎన్టీఆర్ ఆ పాత్రలో పూర్తిగా లీనమయ్యేవారని, అదే ఆయన నటనా వైశిష్ట్యమని వివరించారు. నాటకాలలో దైవత్వ పాత్రలు పోషించే కళాకారులు అదే పందాను అనుసరించారన్నారు. పద్మశ్రీ శోభారాజ్ మాట్లాడుతూ, హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై అన్నమయ్య విగ్రహ స్థాపనకు ఎన్టీఆర్ వెంటనే స్పందించి ఆ కలను సాకారం చేశారని గుర్తు చేశారు. అంతకుముందు ఎన్టీఆర్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఇఒ.ఎ. ఆనందరాజు, శ్వేతా ఇంఛార్జీ డైరెక్టర్ సువర్ణమ్మ, అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ లత తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ,ఎస్టీ చట్టాన్ని దుర్వినియోగంచేసిన గత ప్రభుత్వం

### - టిడిపి కార్యకర్త నిరంజన్

**సచివాలయం,మే 28,ప్రభాత వార్త :** ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని గత జగన్ ప్రభుత్వం విపరీతంగా దుర్వినియోగం చేసిందని టిడిపి సీనియర్ కార్యకర్త ఈ.నిరంజన్ తెలిపారు.రెండోరోజు మహానాడు కార్యక్రమంలో భాగంగా మాట్లాడుతూ ...పులివెందులలో నాగమ్మ అనే ఒక దళిత మహిళ హత్య జరిగితే,వారి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వెళ్ళిన టిడిపి దళిత నాయకులపైనే ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు గత ప్రభుత్వం పెట్టిందని తెలిపారు.రాజధాని కోసం భూమిలిచ్చిన ఎస్సీ,ఎస్టీ రైతులకు సైతం బేడీలు వేసి,వారిపైనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసులు పెట్టింది వైసీపి ప్రభుత్వం.కరోనా సమయంలో కేవలం మాస్క్ అడిగిన పాపానికి దళిత డాక్టర్ సుధాకర్‌ను మరణించే వరకు వేధించిన గత ప్రభుత్వ పద్ధతి చూస్తేనే...దళితులపై వారి విధానం ఎంటో అర్థం అవుతుంది. దళిత డ్రైవర్‌ను హత్య చేసి,డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును మీ ప్రభుత్వం సత్కరించిన తీరును చూస్తే దళిత ప్రజల మానప్రాణాలు మీ దృష్టిలో ఎంత చులకనో తెలుస్తుంది.దళితులకు ఇతర కులాలకు మధ్య అంతరాలను పెంచి పోషించిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదే.ఏ వర్గానికి సమస్య లేకుండా ఎస్సీ వర్గీకరణను చేసి దళిత వర్గానికి సాంఘీయ న్యాయం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది.దళిత సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడం కోసం జస్టిస్ పున్నయ్య కమీషన్ వేసి,ఆ కమీషన్ సూచించిన 42సిఫార్సులను అమలు పరిచి దళిత అభివృద్ధికి పాటుపడిన గొప్ప నాయకుడు చంద్రబాబు మాత్రమే అన్నారు.

# విద్యుత్ ప్రమాదాలకు దూరంగా ఉండండి :

### ఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

**తిరుపతి, మే 29 ప్రభాతవార్తప్రతినిధి:** బలమైన గాలి, వర్షం కురిసే సందర్భాల్లో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా వినియోగదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి గురువారం కోరారు. బలమైన గాలి, వర్షం కారణంగా సంస్థ పరిధిలో అక్కడక్కడా విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, విద్యుత్తు లైన్లు తెగిపోవడం లాంటి సంఘటనలు జరిగాయన్నారు. ఇటువంటి సంఘటనలు జరిగిన సందర్భాల్లో వినియోగదారులు తెగిపడిన విద్యుత్ తీగలను తాకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బలమైన గాలి, వర్షం కురిసే సందర్భాల్లో వినియోగదారులు విద్యుత్ తీగల కింద, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దగ్గరగా నిలబడవద్దని సూచించారు. తమ ప్రాంతంలో ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, లైన్లు తెగిపోవడం లాంటి సంఘటనలను గుర్తించినట్లయితే వినియోగదారులు వెంటనే సమీపంలోని విద్యుత్ శాఖ అధికారులకు గానీ లేదా సిబ్బందికి గానీ సమాచారాన్ని అందించాలని సూచించారు. అదేవిధంగా విద్యుత్ బిల్లుపై ముద్రించబడిన తమ ప్రాంత అసిస్టెంట్ ఇంజనీర్ మొబైల్ నంబరుకు గానీ ,విద్యుత్ శాఖ టోల్‌ఫ్రీ నంబర్లు: 1912 ,1800 425 155333కు కాల్ చేసి సమాచారాన్ని తెలియజేయవచ్చన్నారు.



ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టిడిపి ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్

# మహానాడులో సత్తా చాటిన తల్లీ, కొడుకులు

### - రాష్ట్రంలో రాప్తాడుకు 5వ స్థానం, ధర్మవరానికి 8వ స్థానం

**అనంతపురం, మే 28 ప్రభాతవార్త బ్యూరో** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వర్చువల్ మహానాడులో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ సత్తా చాటారు. ప్రతి క్లస్టర్ పరిధిలో వేలాది మంది కార్యకర్తలు మహానాడుకు హాజరు కావడంతో రాయలసీమలోనే రాప్తాడు, ధర్మవరం నియోజవర్గాలు టాప్ ప్లేస్‌లో నిలిచాయి. రెండు రోజుల్లో కలిపి వేల మంది కార్యకర్తలు రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాలనుంచి మహానాడులో పాల్గొన్నారు. దీంతో రాప్తాడుకు రాష్ట్రంలో 5వ స్థానం దక్కింది. రాయలసీమలో టాప్ ప్లేస్‌లో నిలిచింది. రాష్ట్రంలోని 18వందలకు పైగా ఉన్న క్లస్టర్లలో రామగిరి 10వ క్లస్టర్ 7వ స్థానం దక్కించుకోవడం విశేషం. ఇక ధర్మవరం నియోజకవర్గం నుంచి కూడా దాదాపు అదే స్థాయిలో కార్యకర్తలు హాజరయ్యారు. రెండు రోజుల్లో వేల మంది హాజరుతో 8వ స్థానంలో నిలిచారు. కేంద్ర పార్టీ కార్యాలయంలో జరిగిన మహానాడు వేదికగా ఈ వివరాలను మంత్రి పయ్యావుల కేశవ్ చదివి వినిపించారు. ఇలా రెండు నియోజకవర్గాలు అగ్రస్థానంలో నిలవడంపై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ హర్షం వ్యక్తం చేశారు.

దాదాపు పది రోజుల నుంచి మహానాడుకు సంబంధించిన ఏర్పాట్లు చేశామన్నారు.

# మహానాడు చరిత్రలో తెలుగుదేశం పార్టీ సరికొత్త అధ్యాయం

**విజయవాడ, మే 28,ప్రభాతవార్తప్రతి నిధి :**హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తున్న మహానాడు చరిత్రలో తెలుగుదేశం పార్టీ సరికొత్త అధ్యాయం చేర్చింది. ఖర్చు తగ్గించే పొదుపు చర్యల్లో భాగంగా టీడీపీ అధిష్ఠానం తొలిసారి ప్రవేశపెట్టిన హైబ్రిడ్ వర్చువల్ విధానం మొదటిరోజు అద్భుతంగా సాగింది. దేశంలోనే ఇంత భారీస్థాయిలో వర్చువల్ సదస్సు జరుపుకున్న తొలి ప్రాంతీయ పార్టీగా టీడీపీ రికార్డు సృష్టించింది. యాప్ ద్వారా డిజిటల్ అటెండెన్స్ నమోదు చేయగా హాజరు శాతంలో నూజివీడు నియోజకవర్గం 10 క్లస్టర్లలో 9,991 మందితో నూరు శాతం హాజరుతో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో నెల్లూరు జిల్లా కోవూరు, గోపాలపురం, కందుకూరు, ప్రొద్దుటూరు నియోజకవర్గాలు నిలవగా అధినేత చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం 7,310 మందితో నూరు శాతం హాజరుతో టాప్10లో నిలిచి ప్రత్యేకతను చాటుకుంది. నేడు రెండో రోజు మహానాడు సమావేశాలకు భారీగా జనం తరలివచ్చారు. అదేవిధంగా నేడు ఎన్టీఆర్ జయంతి కావడంతో సమావేశాలకు భారీ ఏర్పాట్లు చేశారు. పొదుపు చర్యల్లో భాగంగా తొలిసారి వర్చువల్ విధానంలో మహానాడును నిర్వహిస్తున్నారు.

# జగన్.. ఈసారి మీకు ఆ ఛాన్స్ ఇవ్వం - అచ్చెన్నాయుడు

**విజయవాడ మే 28 ప్రభాతవార్త ప్రతినిధి:** జగన్ హయాంలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. గత ప్రభుత్వ నిర్వాకంతో ఉన్నవాటినీ వెళ్లగొట్టారని విమర్శించారు. తెదేపా మహానాయుడలో ఆయన మాట్లాడారు. వైకాపా హయాంలో అన్న క్యాంటీన్లు తొలగించారు. పేదలు రూ.5కే కడుపునిండా తినే పథకాన్ని ఎత్తివేయొద్దని శాసనసభలో కోరినా వినిపించుకోలేదు. ఏ రాష్ట్రానికైనా పరిశ్రమల ద్వారానే ఆదాయం వస్తుంది. ఆ ఆదాయాన్ని పేదల సంక్షేమానికి ఖర్చు చేయొచ్చు. రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్ సీఎం చంద్రబాబు. 24 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో రూ.24 అలక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. అమరావతి నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. పోలవరం ప్రాజెక్టును గాడిన పెట్టాం. ప్రజలు, ప్రాంతాల మధ్య జగన్ తగవులు పెట్టి 3 రాజధానులన్నారు. మూడు ప్రాంతాల్లోనూ వైకాపాకు ప్రజలు కుర్రుకాల్చి వాతపెట్టారు. 2014-19 మధ్య తెదేపా అధికారంలో ఉండగా జరిగిన అభివృద్ధి సంక్షేమం గతంలో ఎప్పుడూ జరగలేదు. కానీ మనం చేసింది. చెప్పుకోలేదు. వైకాపా అబద్ధాలను ప్రజలు నమ్మడంతో 2019లో మనకు నష్టం జరిగింది. జగన్ ఈసారి మీకు ఈ చాన్స్ ఇవ్వం. చేసిన పనులు ప్రజలకు చెపిప వారిని చౌతన్యపరిచి ఈ రాష్ట్రంలో వైకాపాను పాతాళానికి పాతిపెడతాం అని అచ్చెన్నాయుడు అన్నారు.

వార్త

చక్కగా ఆలోచించడం, మితంగా మాట్లాడటం, మితంగా తినడం అలవర్చుకోవాలి.

-ఆర్. షోకాల్డ్

# విస్తరిస్తున్న విషసంస్కృతి!

ఆటపాటల్లో వైద్యం, విద్య, సాంకేతిక రంగాల్లో దేశ యువత ఎంతో కీర్తిప్రతిష్టలు సంపాదించి ప్రపంచ పటంలో భారత్‌ను ఉన్నతస్థానంలో నిలబెట్టుతున్నదని ఒకపక్క సంతోషిస్తుంటే మరొకపక్క అనైతిక కార్యక్రమాలకు, మాదకద్రవ్యాల రవాణా, వినియోగం, వ్యాపారాలకు దేశాన్ని అడ్డాగా మారుస్తున్నారనే ఆవేదన వ్యక్తమవుతున్నది. ఇటీవల దేశవ్యాప్తంగా పట్టుబడుతున్న మాదకద్రవ్యాల విక్రయాలు, అక్రమ మద్యం సరఫరాతో పెరుగుతున్న నేరాలు దేశ ప్రతిష్టను మంటకల్పుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతున్నది. అందులోనూ పట్టుబడుతున్న భారీస్థాయి మాదకద్రవ్యాలు, రవాణాలో కొందరు యువత భాగస్వామ్యం కావడం విస్మయం కలిగిస్తున్నది. ఈ వ్యాపారంలో కీలకపాత్ర వహిస్తున్న నైజీరియన్‌లతోపాటు దేశానికి చెందిన యువతీయువకుల పేర్లు వెలుగులోకి వస్తున్నాయి. అయితే కొన్ని సందర్భాల్లో సాక్ష్యాధారాలు లేకపోవడంతో పోలీసులు కూడా వెల్లడించలేకపోతున్నారు. మానవ సమాజాన్ని కాటేస్తున్న ఈ మాదకద్రవ్యాల వ్యాపారం దేశవ్యాప్తంగా చాపకింద నీరులా విస్తరిస్తున్న విషయాన్ని ఏనాడో గుర్తించారు. అందుకోసం పకడ్బందీ వ్యూహాలతో ఆ రక్కసిని మట్టుపెట్టేందుకు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ఆశించిన ఫలితాలు దక్కడం లేదు. మరొకపక్క తెలుగు రాష్ట్రాల్లో గంజాయి వంటి మత్తుపదార్థాల సాగు భారీగా జరుగుతున్నట్లు ప్రచారానికి పట్టుబడుతున్న సంఘటనలు బలం చేకూరుస్తున్నాయి. ఇక కొకైన్, బ్రౌన్‌షుగర్, చెర్రీస్ వంటి మాదకద్రవ్యాల వినియోగం అదుపులేకుండాపోతున్నది. గతంలో ఎక్కడో మూలనో, సందుబొందుల్లో ఎంతో రహస్యంగా ఈవ్యాపారం జరిగేది. మాదకద్రవ్యాలు విక్రయించేవారు కానీ, వాడకందారులు కానీ పోలీసులంటే హడలెత్తిపోయేవారు. పట్టుబడితే జీవితకాలంజైలులోనే ముగిసిపోతుందని భయపడేవారు. రాను రాను పోలీసులన్నా, ఎక్సైజ్ అధికారులన్నా భయభక్తులు సన్నగిల్లడం, చట్టంలోని లొసుగులతో తప్పించుకోవడం సులభం అనే భావన పెరిగిపోవడంతో క్రమేణా ఒక వ్యూహం ప్రకారం వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. అందులోనూ బాగా లాభసాటిగా ఉండడంతో యువతను ఎరవేసి ఇందులోకి ప్రవేశపెడుతున్నారు. సమాజంపై ఇంతటి తీవ్ర ప్రభావం చూపుతున్న ఈ మాదకద్రవ్యాల వినియోగాన్ని, వ్యాపారాన్ని నిరోధించడంలో అధికారగణం ఆశించిన ఫలితాలు సాధించలేకపోతున్నది. దీనికి మద్యం కూడా తోడవుతున్నది. కానీ ప్రభుత్వాలకు మద్యాదాయం మహాప్రసాదంగా మారిపోయింది. యేడాదియేడాదికి ఆదాయాన్ని పెంచుకుంటూపోతున్నారు. సమాజం ఏమైనా, ప్రజారోగ్యం ఏమైనా తమకేమన్నట్లు సంపాదనే లక్ష్యంగా ప్రభుత్వాలు దిగజారిపోతున్నాయి. మద్యం వ్యాపారుల మధ్య పోటీ పెట్టి రుసుము పెంచుకుంటున్నారు. ఒకప్పుడు పది, పన్నెండువేలు ఉన్న ఆదాయం నేడు అరవై వేల కోట్లకుపైగా చేరుకున్నది. దీంతో పెట్టిన పెట్టుబడిని తిరిగి రాబట్టుకునేందుకు కొందరు వ్యాపారులు నక్షత్ర హోటళ్లు, క్లబ్‌లు, పబ్ యజమానులు వినియోగదారులను ఆకర్షించేందుకు రకరకాల పద్ధతులను అవలంబిస్తున్నారు. అందులో భాగంగా ఎక్కువ కిక్ ఇచ్చేందుకు సిగరెట్లలో మాదకద్రవ్యాలను నింపి అందిస్తున్నారు. దీనికితోడు దేశంలోని కొన్ని నగరాల నుండే కాక రష్యా, ఉజ్బికిస్థాన్ తదితర దేశాల నుంచి అందమైన యువతులను తీసుకొచ్చి నాట్యం పేరుతో అర్థనగ్నంగా చిందులు వేయిస్తున్నారు. ఇంకొకపక్క ఫామ్ హౌస్‌ల పేరుతో నడుస్తున్న అసాంఘిక కార్యక్రమాలు పెరిగిపోతున్నాయి. అప్పుడప్పుడు పట్టుబడినా నామమాత్రపు కేసులతోనే ముగించేస్తున్నారు. మద్యం, మాదకద్రవ్యాల మత్తులో వారేం చేస్తున్నారో వారికే తెలియకుండాపోతున్నది. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక మెడికల్ కాలేజీలో విద్యార్థుల మధ్య ఏర్పడిన వివాదం ఎంతటి తీవ్రమైన పరిస్థితులకు దారితీస్తుందో ఆవేదన కలగక తప్పదు. మెడిసిన్ లాంటి ఎంతో పవిత్రమైన బాధ్యత కలిగిన విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్న వీడియోలను టీవీలో చూసిన వారంతా విస్తుపోతున్నారు. అక్కడే కాదు ఇటీవల కాలంలో తరచుగా అలాంటిసంఘటనలు జరుగుతున్నాయి. విద్యార్థులు పట్టుబడిన సందర్భాలు కూడా ఎన్నో ఉన్నాయి. అసలు నక్షత్రాల హోటళ్లలో, క్లబ్‌ల్లో, పబ్‌ల్లోజరిగే కార్యక్రమాల్లో పాల్గొనడం ఒక స్టేటస్ సింబల్‌గా మారుస్తున్నారు. అదే నాగరికత అని భావించి అందులో మునిగి తేలుతున్నారు. పండుగల సందర్భంగా కూడా కొందరు పబ్ యజమానులు ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక కార్యక్రమాల్లో ప్రదర్శిస్తున్న నృత్యాలు, వెకిలిచేష్టలు విషసంస్కృతికి పరాకాష్ఠగా చెప్పొచ్చు. మొత్తంమీద ఇదే మనసంస్కృతిగా భావించే దరదృష్టపు రోజులు దాపురించాయి. నగరాల్లోనే కాదు, పట్టణాలు దాటి క్రమేపీ జిల్లాలు, మండలాలు, చివరకు గ్రామాలకు కూడా పాశ్చాత్య సంస్కృతి ప్రభావం విస్తరిస్తున్నది. గ్రామీణజనజీవన స్రవంతిలో భాసిల్లుతున్న మన సంస్కృతి సంప్రదాయాలు నాగరికత వెల్లువలో కొట్టుకుపోతున్నాయి. వాటి స్థానంలో డిస్కో, క్యాబరే, క్లబ్, రికార్డు డాన్సులు ప్రత్యక్షమవుతున్నాయి. ఇందులో మాదకద్రవ్యాలు చోటు చేసుకోవడంతోయువత బలైపోతున్నది. దీనితోపాటు లైంగిక నేరాలు పెరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా జరుగుతున్న హత్యల్లో లైంగిక నేరాల్లో నిందితుల్లో అధిక శాతం మత్తులో ఉన్నట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి. ఈ విషసంస్కృతిని రూపుమాపేందుకు ప్రభుత్వంతోపాటు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు నడుంకట్టాలి. ప్రజల భాగస్వామ్యమే మన సంస్కృతి పరిరక్షణకు ఏకైక మార్గం.



సుఖశాంతులనేవి ఒకరికి మీరు ఇచ్చే వాటిపై ఆధారపడి ఉంటాయి. అంతేకాని వారి నుంచి మీరు పుచ్చుకునే వాటిపై కాదు.

అరిస్టాటిల్



అందరిలోనూ శక్తి సామర్థ్యాలు ఎంతో కొంత ఉంటాయి. వాటిని వినియోగించుకో వడంలోనే అసలు సమస్య ఉంటుంది.

బెంజిమెన్ ఫ్రాంక్లిన్

## ప్రజావాక్కు

### సేవా తత్పరత కలిగిన వారిని నియమించాలి

ఇటీవల వెలుగు చూసిన రెండు సంఘటనలు బ్యాంకింగ్ వ్యవస్థలోని కఠిన నిబంధనలు గిరిజనులు పేదవారి పట్ల ఎంత శాపంగా మారాయో తెలియజేస్తున్నాయి. ఒడిషాలో ఒక ఆదివాసి తన మరణించిన అక్క బ్యాంకు ఖాతాలోని సొమ్ము కోసం బ్యాంకుకు వెళితే అధికారులు చెప్పి నపత్రాలు తన వద్దలేవని ఆ ఆదివాసి చెప్పినా, బ్యాంకు అధికారులుచనిపోయినట్లుఋజువుకావాలనటంతో గత్యంతరం లేక సమాధిని తవ్వి అస్థిపంజరాన్ని తీసుకుని బ్యాంకు అధికారుల ముందు ఉంచాడు. చత్తీస్‌ఘడ్‌లోని మరో సంఘటనలో తొంబై ఏళ్ళ తన అత్తగారి ఐదు వందల పింఛన్ నాలుగు నెలలుగా ఆగిపోవటంతో, కోడలు అత్తగారిని వీపున వేసుకుని రెండు కిలోమీటర్లకు పైగా నడుచుకుంటూ బ్యాంకుకు వెళ్ళింది. ఇంకా వెలుగు చూడని ఇటువంటి సంఘటనలు ఎన్ని ఉన్నాయో ఎవరికి తెలుసు. సేవారంగ సంస్థలలో మానవత్వం చూపలేని మరమనిషితరహాలో పనిచేసే ఉద్యోగుల స్థానంలో సేవా తత్పరత, మంచితనం ఉన్న వారినే నియమించాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### సర్వేకు సహకరించండి

ఉభయ రాష్ట్రాల్లో బిసి కులాలకు చెందిన వారు 50 శాతం కన్నా ఎక్కువ ఉన్నట్లు నివేదికలు చెప్తున్నాయి. సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఎన్నోఅంశాలపై కోరిన సర్వే జిల్లాల వారీగా ప్రతీ అంశం కచ్చితంగా ఇవ్వడం యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ముఖోద్దేశ్యం. దీని ప్రతిపాదన నిర్ణయించే భవిష్యత్ ప్రయోజనాలు సంబంధిత కుటుంబాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి మూలం. పాలన రంగంలోనూ మేధావులు వచ్చే అవకాశం ఉంటుంది. దీని ప్రత్యేకత దృష్ట్యా జిల్లాల కలెక్టర్లువారి అనుబంధఅధికార్లకు ఇచ్చే మార్గదర్శకాలు సత్ఫలితాలను ఇస్తుంది. ప్రజలు సర్వేకు సహకారం ఇవ్వాలి.

- బొల్లోజు మేఘానాదం, విశాఖపట్నం

### హీరోలు దేవుళ్లు కాదు

సినిమాల్లో హీరోలు రైటర్ రాసిన డైలాగులని డైరెక్టర్ ఎలా చెప్పమంటే అలా చెబుతాడు. డైరెక్టర్ ఎలా చెబితే అలా నటిస్తాడు. ఈ విధంగా సినిమాల్లో ఎన్నో వేషాలు వేస్తారు. రకరకాల పాత్రలు ధరిస్తాడు. కోట్లు సంపాదించి ఆ ధనంతో సినిమా టాకీసులు కడతారు. స్థిర, చరాస్తులకి యజమానులు అవుతారు.

- మిథునం, హైదరాబాద్

### ఆక్వా రంగాన్ని ఆదుకోవాలి

ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలిచిన ఆక్వారంగాన్ని ఆదుకోవడం అత్యవసరంగా మారింది. దేశ విదేశీ మార్పిడి ఆదాయంలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ రంగం ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో రొయ్యలు, చేపల ధరలు పతనం కావడం, రవాణా ఖర్చులు విపరీతంగా పెరగడం వల్ల రైతులు కోట్లలో నష్టపోతున్నారు. దీనికి తోడు నాణ్యమైన మేత, మందుల ధరలు నియంత్రణ లేకుండా పెరిగిపోవడం సాగు వ్యయాన్ని భారంగా మార్చింది. విద్యుత్ రాయితీల కోత, నాణ్యమైన విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల నిర్వహణ ఖర్చులు మరింత పెరిగాయి. ఆక్వా ప్రాసెసింగ్ కంపెనీలు, మధ్యవర్తుల సిండికేట్ వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదు. వ్యాధుల విజృంభణవల్ల పంటనష్టం జరిగి పెట్టుబడులుకూడా రాక రైతులుఅప్పులఊబిలో కూరుకుపోతున్నారు. ఈరంగాన్ని రక్షించడానికి ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అభ్యర్థులకు న్యాయం చేయాలి

దేశవ్యాప్తంగా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వారి సివిల్స్ ప్రిలిమ్స్ఎగ్జామ్ నిర్వహిస్తున్నందువలన అదే తారీఖు నాడు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వారు కొన్ని ఉద్యోగాలకు ఎగ్జామ్ నిర్వహించారు. రెండింటికి అప్లై చేసిన కొంతమంది అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వారిని ఎగ్జామ్ డేట్ మార్చమని అభ్యర్థించారు. కానీ అలా కుదరదని ఒక నోటిఫికేషన్ ఇస్తూ ఎగ్జాం నిర్వహించేశారు. హైకోర్టు జాబ్ కోసం అప్లై చేసిన అభ్యర్థులకు పర్సనల్గా మెసేజ్ గాని మెయిల్ గాని హైకోర్టు నోటిఫికేషన్ వారి నుండి ఏమీ రాలేదు. అందువల్ల చాలా మంది ఆ ఎగ్జామ్ రాయకుండా మిస్ అయ్యారు. ఇది ఎవరితో మొరపెట్టుకోవాలో అర్థం కావడం లేదు. కాబట్టి ఉద్యోగానికి అప్లై చేసిన అభ్యర్థులకు న్యాయం చేయాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### మానవతా దృక్పథం చూపించాలి

ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు కనీస వైద్య సదుపాయాలు అందించాలి. రోగులకు అందించే ఆహారంలో నాణ్యత లేకపోవడం, మంచినీరు, ఫ్యాన్లు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్న రోగులు. సిబ్బంది అదిచేశాం, ఇదిచేశాం అంటూ లంచం అడగడం వంటివి చాలనే ఉన్నాయి. అధికారులు వారంలో కనీసం రెండు రోజులైనా విచ్చేసి రోగుల సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కరించాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

# ప్రభుత్వరంగ పటిష్టతే భవితకు బాట

**ప్రజలు ప్రభుత్వ వ్యవస్థలను వినియోగిస్తే ఆ వ్యవస్థలు కూడా మరింత బలపడతాయి. వినియోగం పెరిగినకొద్దీ ప్రభుత్వాలు కూడా నాణ్యత పెంచడానికి మరింత శ్రద్ధ చూపుతాయి. ప్రజలు ప్రభుత్వ వ్యవస్థలను నిర్లక్ష్యం చేసి పూర్తిగా ప్రైవేటు రంగంపై ఆధారపడితే భవిష్యత్తులో ఖర్చుల భారాన్ని భరించడం కష్టమవుతుంది. ఒక దేశ ఆర్థిక బలం కేవలం ప్రభుత్వ సంపదతో కాదు ప్రజల పొదుపు సామర్థ్యంతో కూడా నిర్ణయించబడుతుంది. మన దేశ భవిష్యత్తు ప్రజా వ్యవస్థల బలపాటుపైనే ఆధారపడి ఉంది. కాబట్టి ప్రతి కుటుంబం ప్రైవేటు ఖర్చులపై ఆలోచించి సాధ్యమైనంతవరకు ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలి. ఇదే నిజమైన పొదుపు, ఇదే కుటుంబ ఆర్థిక భద్రతకు మార్గం, ఇదే సమాజ అభివృద్ధికి బలమైన పునాది.**

తరిగోపుల నారాయణస్వామి

దేశం యుద్ధ భయాలు, ఆర్థిక ఒత్తిళ్లు, ప్రపంచ మార్కెట్ అనిశ్చితులు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం వంటి సవాళ్లను ఎదుర్కొంటున్న ఈ సమయంలో దేశ ప్రధాన నాయకులు ప్రజలకు పొదుపు అలవాటు చేసుకోవాలని పిలుపునివ్వడం అత్యంత సముచితమైన విషయం. అయితే పొదుపు అనేది కేవలం ఖర్చులను తగ్గించడం ద్వారానే కాదు ప్రజల కోసం ఇప్పటికే ఏర్పాటైన ప్రభుత్వ వ్యవస్థలను సక్రమంగా వినియోగించుకోవడం ద్వారానూ సాధ్యమవుతుందనే విషయాన్ని సమాజం లోతుగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. నేడు అనేక కుటుంబాలు తమ ఆదాయంలో అధిక భాగాన్ని ప్రైవేటు విద్య, ప్రైవేటు వైద్యం, ప్రైవేటు రవాణా, ప్రైవేటు సేవల మీద ఖర్చు చేస్తూ అప్పుల పాలవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు మెరుగైన ఉపాధ్యాయులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ విద్యా సదుపాయాలు కలిగి ఉన్నప్పటికీ చాలా మంది తల్లిదండ్రులు ప్రతిష్ట కోసం ప్రైవేటు పాఠశాలల వైపు పరుగులు తీస్తున్నారు. దీనివల్ల నెలకు వేల రూపాయల ఫీజులు చెల్లించాల్సి రావడం మాత్రమే కాకుండా కుటుంబ పొదుపు కూడా క్రమంగా క్షీణిస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రులు నైపుణ్యం కలిగిన వైద్యులతో, ఉచిత మందులతో, అనేక పరీక్షల సౌకర్యాలతో ప్రజలకు సేవలందిస్తున్నప్పటికీ కొంతమంది చిన్న చిన్న వ్యాధులకే ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి భారీ బిల్లులు చెల్లిస్తున్నారు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు ఉన్నప్పటికీ వాటి వినియోగం పట్ల ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం వల్ల అనవసర ఆర్థిక భారాలు పెరుగుతున్నాయి. ప్రభుత్వ బస్సులు తక్కువ ఖర్చుతో సురక్షిత ప్రయాణం కల్పిస్తున్నప్పటికీ ప్రతీ కుటుంబం వేరువేరు వాహనాలు కొనుగోలు చేయడం వల్ల ఇంధన వ్యయం, రుణ భారం, నిర్వహణ ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రభుత్వ గ్రంథాలయాలను వినియోగించకుండా ఖరీదైన కోచింగ్ కేంద్రాలు, పుస్తకాలపై వేల రూపాయలు ఖర్చు చేయడం కూడా కుటుంబ ఆర్థిక స్థితిని బలహీన పరుస్తోంది, ప్రభుత్వ ధాన్య పంపిణీ వ్యవస్థ ద్వారా తక్కువ ధరలకు లభించే నిత్యావసరాలను వినియోగించుకుంటే కుటుంబ వ్యయం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ప్రభుత్వ వ్యవసాయ సలహా కేంద్రాలను వినియోగిస్తే రైతులు ప్రైవేటు దళారులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. ప్రభుత్వ విత్తన కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు పొందడం వల్ల రైతులకు ఖర్చులు తగ్గడమే కాకుండా దిగుబడులు కూడా మెరుగుపడతాయి. ప్రభుత్వ పశువైద్య సేవలను వినియోగిస్తే పశుసంవర్ధక రైతులు అనవసర ప్రైవేటు ఖర్చులను నివారించగలరు. ప్రభుత్వ పాల ఉత్పత్తి సంఘాలలో చేరడం ద్వారా చిన్న రైతులకు స్థిరమైన ఆదాయం లభిస్తుంది. ప్రభుత్వ ఐటీఐలు పాలిటెక్నిక్ కళాశాలలు తక్కువ ఖర్చుతో నైపుణ్య విద్య అందిస్తున్నప్పటికీ వాటి ప్రాధాన్యతను చాలామంది గుర్తించడం లేదు. ప్రభుత్వ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు గ్రామీణ పేద విద్యార్థులకు గొప్ప అవకాశాలు కల్పిస్తున్నాయి. ప్రభుత్వ బ్యాంకుల్లో తక్కువ వడ్డీ రుణాలు లభిస్తున్నప్పటికీ కొందరు అధిక వడ్డీతో ప్రైవేటు అప్పులు తీసుకుని ఆర్థిక ఇబ్బందుల్లో పడుతున్నారు, పోస్టాఫీసు పొదుపు పథకాలు సురక్షితమైన పెట్టుబడి మార్గాలుగా ఉన్నప్పటికీ ప్రజల్లో వాటి పట్ల అవగాహన తక్కువగా ఉంది. ప్రభుత్వ బీమా పథకాలను వినియోగిస్తే కుటుంబాలకు భవిష్యత్



భద్రత లభిస్తుంది. ప్రభుత్వ ఉపాధి హామీ పథకాలుగ్రామీణ కుటుంబాలకు కనీస ఆదాయ భరోసా ఇస్తున్నాయి. ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలు యువతకు ఉపాధి అవకాశాలను పెంచుతున్నాయి. ప్రభుత్వ మహిళా సంఘాల ద్వారా మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయగలుగుతున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని రైతు బజార్లలో కొనుగోళ్లు చేస్తే మధ్యవర్తుల దోపిడీ తగ్గి వినియోగదారులకు న్యాయమైన ధరలు లభిస్తాయి. ప్రభుత్వ నీటి సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడం ద్వారా కుటుంబాలు ఖరీదైన ప్రైవేటు నీటి సరఫరాలపై ఆధారపడకుండా ఉండగలవు. ప్రభుత్వ పారిశుధ్య సేవలను సమర్థంగా వినియోగిస్తే ఆరోగ్య ఖర్చులు కూడా తగ్గుతాయి. ప్రభుత్వ విద్యుత్ పథకాల ద్వారా తక్కువ ఖర్చుతో విద్యుత్ వినియోగం సాధ్యమవుతుంది. ప్రభుత్వ డిజిటల్ సేవలను ఉపయోగిస్తే మధ్యవర్తుల ద్వారా జరిగే అదనపు ఖర్చులు తగ్గుతాయి. ప్రభుత్వ ఉద్యోగ మార్గదర్శక కేంద్రాలు నిరుద్యోగ యువతకు సరైన సమాచారం అందించగలవు. ప్రభుత్వ క్రీడా మైదానాలు, వ్యాయామ కేంద్రాలను వినియోగిస్తే ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమవుతుంది. ప్రభుత్వ పార్కులు ప్రజా వినోద కేంద్రాలు కుటుంబాలకు తక్కువ ఖర్చుతో విశ్రాంతి కల్పిస్తాయి. ప్రభుత్వ గృహ పథకాలు పేద మధ్యతరగతి కుటుంబాలకు భవిష్యత్ భద్రతను కల్పిస్తున్నాయి. ప్రభుత్వ సబ్సిడీ గ్యాస్ పథకాలు కుటుంబ వ్యయాన్ని తగ్గిస్తున్నాయి. ప్రభుత్వ పౌర సరఫరా వ్యవస్థ ప్రజల ఆర్థిక స్థిరత్వానికి ఒక భరోసాగా నిలుస్తోంది. ప్రజలు తమపిల్లల భవిష్యత్తు కోసం పోటీ పేరుతో అధికఫీజులు చెల్లించడం కన్నా నాణ్యమైన ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలి. అనారోగ్యం వచ్చినప్పుడు చిన్నసమస్యలకే ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రులకు పరుగులు తీయకుండా సమీప ప్రభుత్వ వైద్యశాలలను వినియోగించాలి. ప్రతి కుటుంబం కనీసం ఒక ప్రయాణాన్ని ప్రభుత్వ రవాణా ద్వారా చేయాలని సంకల్పిస్తే దేశ ఇంధన వినియోగం కూడా తగ్గుతుంది. ప్రజలు సామాజిక ప్రతిష్ట కోసం అధిక ఖర్చులు చేసే అలవాటును తగ్గించుకోవాలి. వివాహాలు శుభకార్యాలలో అనవసర ఆడంబరాలు తగ్గిస్తే అనేక కుటుంబాలు అప్పుల భారాన్ని తప్పించుకోగలవు. ప్రభుత్వ చేపల పెంపక పథకాలు మత్స్యకారులకు ఆదాయ మార్గాలను విస్తరిస్తున్నాయి. ప్రభుత్వ అటవీ శాఖ పథకాల ద్వారా గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ప్రభుత్వ సహకార సంఘాలను బలోపేతం చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుంది. ప్రభుత్వ మార్కెట్ యార్డులను వినియోగిస్తే రైతులకు సరైన ధర లభిస్తుంది. ప్రజలు ప్రైవేటు అప్పులకంటే సహకార బ్యాంకులను ఆశ్రయించడం మంచిది. ప్రభుత్వ బస్సులు రైళ్ల వినియోగం పెరిగితే రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గే అవకాశం ఉంది. ప్రతి పౌరుడు పన్నులు చెల్లించడం మాత్రమే కాకుండా ప్రభుత్వ సేవలను గౌరవంగా వినియోగించుకోవాలి. ప్రజా వ్యవస్థలను వినియోగించని సమాజం ఎప్పటికీ ఆర్థికంగా బలపడలేదనే చరిత్రను మనం గుర్తుంచుకోవాలి. ఒక కుటుంబం ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ రవాణా, ప్రభుత్వ బ్యాంకు, ప్రభుత్వ పథకాల వినియోగం ద్వారా సంవత్సరానికి వేల రూపాయలు పొదుపు చేసుకోగలదు. ప్రజలు ప్రభుత్వ వ్యవస్థలను వినియోగిస్తే ఆ వ్యవస్థలు కూడా మరింత బలపడతాయి. వినియోగం పెరిగినకొద్దీ ప్రభుత్వాలు కూడా నాణ్యత పెంచడానికి మరింత శ్రద్ధ చూపుతాయి. ప్రజలు ప్రభుత్వ వ్యవస్థలను నిర్లక్ష్యం చేసి పూర్తిగా ప్రైవేటు రంగంపై ఆధారపడితే భవిష్యత్తులో ఖర్చుల భారాన్ని భరించడం కష్టమవుతుంది. ఒక దేశ ఆర్థిక బలం కేవలం ప్రభుత్వ సంపదతో కాదు ప్రజల పొదుపు సామర్థ్యంతో కూడా నిర్ణయించబడుతుంది. మన దేశ భవిష్యత్తు ప్రజా వ్యవస్థల బలపాటుపైనే ఆధారపడి ఉంది. కాబట్టి ప్రతి కుటుంబం ప్రైవేటు ఖర్చులపై ఆలోచించి సాధ్యమైనంతవరకు ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలి. ఇదే నిజమైన పొదుపు, ఇదే కుటుంబ ఆర్థిక భద్రతకు మార్గం, ఇదే సమాజ అభివృద్ధికి బలమైన పునాది. ●

# వ్యంగ్యం ఒక శక్తివంతమైన ఆయుధమే..

తిప్పర్తి శ్రీనివాస్

భారత ప్రజాస్వామ్యంలో వ్యంగ్యం ఎప్పుడూ ఒక శక్తివంతమైన ఆయుధంగా నిలిచింది. అధికార వ్యవస్థల లోపాలను ప్రశ్నించేందుకు, ప్రజల ఆవేదనను వ్యక్తీకరించేందుకు వ్యంగ్య రూపాలు ఎన్నో సందర్భాల్లో ముందుకు వచ్చాయి. ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' కూడా అలాంటి ఒక సామాజిక రాజకీయ ప్రతిస్పందనగానే కనిపిస్తోంది. ఒక సాధారణ వ్యాఖ్యతో మొదలైన ఈ పరిణామం, కేవలం వినోదం లేదా ట్రోలింగ్ స్థాయిలో ఆగిపోకుండా, వ్యవస్థలపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తికి ప్రతీకగా మారింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేసినట్లు ప్రచారంలోకి వచ్చిన 'బొద్దింక' వ్యాఖ్యల నేపథ్యంలో సోషల్ మీడియాలో ఏర్పడిన ఈ వ్యంగ్య ఉద్యమం వేగంగా ప్రజల్లోకి చేరింది. 'కాక్రోచ్ జనతా పార్టీ' పేరుతో ఏర్పడిన ఆన్‌లైన్ సమూహం, తాము రాజకీయ పార్టీ కాదని చెప్పుకుంటూనే, వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించడం తమ లక్ష్యమని ప్రకటించడం గమనార్హం. ప్రజాస్వామ్యంలో విమర్శ హక్కు ఎంత ముఖ్యమో, ఇప్పుడు డిజిటల్ వేదికలు ఎంత వేగంగా ప్రజాభిప్రాయాన్ని నిర్మిస్తున్నాయో ఈ పరిణామం మరోసారి స్పష్టం చేసింది. ఇది కేవలం ఒక మీమ్ కల్చర్ కాదు. ప్రజల్లో పేరుకుపోతున్న అసహనం, నిరాశ, రాజకీయ వ్యవస్థలపై పెరుగుతున్న అనుమానాలకు ఇది ప్రతిబింబం. ఉద్యోగాలు, ధరల పెరుగుదల, సామాజిక అసమానతలు, రాజకీయ నైతికతల పతనం వంటి అంశాలపై యువతలో అసంతృప్తి పెరుగుతున్న తరుణంలో, 'కాక్రోచ్ జనతా పార్టీ' ఒక వినూత్న నిరసన రూపంగా అవతరించింది. సాంప్రదాయ రాజకీయ పార్టీలకు భిన్నంగా, వ్యంగ్యాన్ని ఆయుధంగా చేసుకుని ప్రజల్లో చైతన్యం తీసుకురావాలనే ప్రయత్నం ఇందులో కనిపిస్తోంది. ఈ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టో కూడా సామాజిక మాధ్యమాల్లో విస్తృత చర్చకు దారితీసింది. 'అవినీతి చేయగల సామర్థ్యం ఉన్నవారికి మాత్రమే సభ్యత్వం' ప్రజల సమస్యలు వినకపోవడం ప్రధాన అర్హత, సెల్ఫీలు ఎక్కువగా తీసుకునే నాయకులకు ప్రాధాన్యం' వంటి వ్యంగ్య వ్యాఖ్యలతో రూపొందించిన ఈ మేనిఫెస్టో, వాస్తవ రాజకీయ వ్యవస్థలపై ఒక తీవ్రమైన విమర్శగా మారింది. నవ్వుపుట్టించే మాటల వెనుక, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల్లో ఉన్న నిరాశ దాగి ఉంది. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, కేవలం 96 గంటల్లోనే ఈ వేదికకు 55 లక్షల మందికి పైగా ఫాలోవర్లు రావడం. ఇది సాధారణ సోషల్ మీడియా ట్రెండ్‌గా తీసుకోవడానికి చాలా పెద్ద సంఖ్య. ముఖ్యంగా యువత, మధ్యతరగతి, రాజకీయాలపై విసుగుతో ఉన్నవర్గాలు ఈ ఉద్యమానికి మద్దతు తెలుపుతున్నట్లు కనిపిస్తోంది. ప్రజలు సంప్రదాయ రాజకీయాలకు ప్రత్యామ్నాయ భావవ్యక్తీకరణ మార్గాలను వెతుకుతున్నారనే సంకేతమిది. 'కాక్రోచ్'కు పోటీగా 'పారాసైట్ పార్టీ' వంటి పేర్లతో మరో వ్యంగ్య వేదికలు కూడా పుట్టుకొస్తుండటం, ఈ ధోరణి ఒక పెద్ద డిజిటల్ సామాజిక ఉద్యమంగా మారే అవకాశాలను సూచిస్తోంది. ఇక్కడ అసలు ప్రశ్న ఏమిటంటే ప్రజలు ఎందుకు ఇలాంటి వ్యంగ్య రాజకీయాల వైపు ఆకర్షితులవుతున్నారు? సమాధానం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రజల ఆశలను నెరవేర్చడంలో విఫలమవుతోందనే భావన పెరుగుతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు, పాలనలో కనిపించే అవినీతి, ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం ఇవన్నీ కలిసి ప్రజల్లో అసంతృప్తిని పెంచుతున్నాయి. అయితే ఈ పరిణామాన్ని పూర్తిగా సానుకూలంగా మాత్రమే చూడలేం. వ్యంగ్యం ఒక శక్తివంతమైన ఆయుధమే అయినా, అది బాధ్యతతో కూడి ఉండాలి. సోషల్ మీడియా ఉద్యమాలు వేగంగా ప్రజాదరణ పొందినా, అవి సమాజాన్ని నిర్మాణాత్మక దిశగా నడిపించాలంటే స్పష్టమైన దృక్పథం అవసరం. కేవలం ట్రోలింగ్, అపహాస్యం, వ్యక్తిగత విమర్శలతో పరిమితమైతే, అది ప్రజాస్వామ్య చర్చ స్థాయిని దిగజార్చే ప్రమాదం ఉంది. వ్యంగ్యం ప్రజాస్వామ్యానికి అవసరం. కానీ అది ప్రజల్లో చైతన్యం పెంచాలి గానీ, నిరాశను మాత్రమే పెంచకూడదు. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు, పాలకులు, సంస్థలు ఒక విషయాన్ని గమనించాలి. ప్రజలు ఇప్పుడు కేవలం ఓటర్లు మాత్రమే కాదు, వారు ప్రశ్నించే పౌరులు. సోషల్‌మీడియా ద్వారా తక్షణ ప్రతిస్పందన ఇవ్వగలిగే శక్తి ఇప్పుడు సాధారణ ప్రజల చేతుల్లో ఉంది. అందుకే ప్రజల భావోద్వేగాలను, ఆవేదనలను తక్కువ అంచనా వేయలేం. 'కాక్రోచ్ జనతా పార్టీ' వంటి ఉద్యమాలు ఒక్కరోజులో పుట్టవు. అవి ప్రజల్లో పేరుకుపోయిన అసంతృప్తికి ప్రతిఫలాలు. ప్రజాస్వామ్యంలో వ్యతిరేక స్వరాలు బలంగా వినిపించడం ఆరోగ్యకరమైన లక్షణం. కానీ ఆ స్వరాలు సృజనాత్మక మార్గంలో ముందుకు సాగాలి. వ్యంగ్యం ఒక హెచ్చరికలా పని చేయాలి. వ్యవస్థను సరిదిద్దే దిశగా నడిపించాలి. ఈ ట్రెండ్‌ను కేవలం సోషల్ మీడియా వినోదంగా తీసిపారేయకుండా, దాని వెనుక దాగి ఉన్న ప్రజా భావోద్వేగాన్ని అర్థం చేసుకోవడం అవసరం. 'కాక్రోచ్ జనతా పార్టీ' అనే వ్యంగ్య ఉద్యమం, వాస్తవానికి భారత ప్రజాస్వామ్యానికి ఒక అద్దం పట్టింది. ప్రజలు నవ్వుతున్నారు, మీమ్స్ చేస్తున్నారు, వ్యంగ్య పోస్టులు పెడుతున్నారు. కానీ ఆ నవ్వుల వెనుక ఒక తీవ్రమైన ప్రశ్న ఉంది. ప్రజల కోసం ఉన్న వ్యవస్థ నిజంగా ప్రజల మాట వింటోందా?' ఇదే ప్రశ్నకు సమాధానం కనుగొనగలిగితేనే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. ●

# యువతకు ఉపాధి భరోసా సరైన పరిష్కారం

ఫిరోజ్ ఖాన్

నేడు ప్రపంచం ఒక నిశ్శబ్ద 'డెమోగ్రాఫిక్ వింటర్'ను ఎదుర్కొంటోంది. 2026 మే నెలలో అంతర్జాతీయ జనాభా నివేదికల ప్రకారం, అభివృద్ధి చెందిన ప్రపంచంలో సంతానోత్పత్తి రేటు చారిత్రక కనిష్ట స్థాయికి పడిపోయింది. జపాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఫిబ్రవరి 2026లో విడుదల చేసిన డేటా ప్రకారం, ఆ దేశంలో జనన రేటు1.2కి పడిపోగా, 65ఏళ్ల పైబడిన వారి సంఖ్య మొత్తం జనాభాలో 30శాతానికి చేరింది. అదేవిధంగా, యూరోపియన్ యూనియన్ గణాంక విభాగం మార్చి 2026లో ప్రచురించిన నివేదికలో, ఇటలీ, గ్రీస్ దేశాల్లో మరణాల సంఖ్య జననాల కంటే ఎక్కువగా ఉన్నట్లు ధృవీకరించింది. జనాభా స్థిరీకరణకు అవసరమైన 2.1 సంతానోత్పత్తి రేటును ఏ అభివృద్ధి చెందిన దేశం కూడా అందుకోలేకపోవడం, దీర్ఘకాలిక జనాభా సమతుల్యతపై ఆందోళనలు పెంచుతోంది. ఐక్యరాజ్యసమితి జనాభా విభాగం 2025 చివర్లో విడుదల చేసిన అంచనాల ప్రకారం, ప్రపంచ జనాభా 2080 ప్రాంతంలో గరిష్టస్థాయికి చేరుకున్న తర్వాత క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశముందని పేర్కొంది. ఒకప్పుడు అధిక జనాభానే అతిపెద్ద సవాలుగా భావించిన దేశాలు, ఇప్పుడు జనాభా కొరతతో ఆర్థిక వ్యవస్థలను ఎలా నిలబెట్టుకోవాలనే ఆందోళనలో పడటం గమనార్హం. జనాభా పతనాన్ని అడ్డుకోవడానికి ప్రపంచ దేశాలు కోట్లాది డాలర్లను వెచ్చిస్తున్నా ఫలితాలు మాత్రం శూన్యం. సౌత్ కొరియా పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. 2006 నుండి 2025 మధ్యకాలంలో ప్రభుత్వం జనాభా పెంపు కోసం దాదాపు 220 బిలియన్ డాలర్లు ఖర్చు చేసినప్పటికీ, ఏప్రిల్ 2026 నాటికి అక్కడ సంతానోత్పత్తి రేటు 0.96కి పడిపోయింది. సింగపూర్ ప్రభుత్వం కూడా జనవరి 2026లో తన'బేబీ బోనస్ స్కీమ్'ను సవరించి, నగదు సాయాన్ని పెంచింది. అయితే, జీవన వ్యయం, పనిజీవిత సమతుల్యత లోపించడం వల్ల ఈ ప్రోత్సాహకాలు తాత్కాలిక ఊరటనే ఇస్తున్నాయని 'వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్' మే 2026 విశ్లేషణ స్పష్టం చేస్తోంది. చైనా పరిస్థితి కూడా భిన్నంగా లేదు. వరుసగా మూడో ఏడాది అక్కడ జనాభా తగ్గుదల నమోదైంది. ఫ్రాన్స్, స్వీడన్ వంటి దేశాలు చెల్లింపు ప్రసూతి సెలవులు, తక్కువ ఖర్చుతో బాలల సంరక్షణ కేంద్రాలు వంటి సమగ్ర



విధానాలతో కొంత మెరుగైన పరిస్థితిని కొనసాగిస్తున్నాయి. దీనివల్ల కేవలం నగదు సాయం కంటే, స్థిరమైన సామాజిక భద్రత, సమగ్ర మద్దతు వ్యవస్థలే అత్యంత కీలకమని స్పష్టమవుతోంది. జనాభా క్షీణత కేవలం సంఖ్యల సమస్య మాత్రమే కాదు, ఇది ఆర్థిక వ్యవస్థలపై తీవ్రమైన ఒత్తిడిని పెంచుతోంది. 'పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తన 2026 నివేదికలో పేర్కొన్నట్లుగా, వృద్ధుల సంఖ్య పెరిగి, పనిచేసే యువత తగ్గడం వల్ల పెన్షన్ల భారం దేశాల బడ్జెట్‌లను అతలాకుతలం చేస్తోంది. హంగేరి ప్రభుత్వం 2026లో తల్లులకు ఆదాయపు పన్ను నుంచి పూర్తి మినహాయింపునిస్తూ తీసు కొచ్చిన సంస్కరణలు నైతిక చర్చకు దారితీశాయి. ఒకవైపు అభివృద్ధిని ఆశిస్తూనే, మరోవైపు మహిళల వ్యక్తిగత స్వేచ్ఛను, కెరీర్‌ను నియంత్రించడం సరైనదేనా? అని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ, ప్రపంచ బ్యాంక్ అధ్యయనాల ప్రకారం, యువ జనాభా తగ్గుదల దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధిని మందగింపజేస్తుంది. ఇప్పటికే జపాన్, జర్మనీ వంటి దేశాలు రోబోటిక్స్, ఆటోమేషన్‌పై భారీగా ఆధారపడుతున్నాయి. తక్కువ జనాభా వల్ల కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయని పర్యావరణవేత్తలు భావించినా, వినియోగ శక్తి తగ్గిపోతే ఆర్థిక చక్రం నెమ్మదిస్తుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. 'ది లాస్ట్ జనరేషన్?' అని మనం ఆందోళన చెందుతున్న తరుణంలో, కేవలం నగదు ప్రోత్సాహకాలు పరిష్కారం కావని చరిత్ర నిరూపిస్తోంది. 2026 మే నాటి తాజా విశ్లేషణల ప్రకారం, జనాభా సమస్యను అధిగమించాలంటే ఆశ్రయించదగిన విద్యా వ్యవస్థ, నాణ్యమైన ఆరోగ్య సదుపాయాలు, యువతకు ఉపాధి భరోసా కల్పించడం అత్యంతకీలకం. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు జనాభా సమతుల్యత కోసం తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రపంచ దేశాల వైఫల్యాల నుంచి నేర్చుకున్న గుణపాఠాలను ప్రతిబింబించేలా ఉండాలి. సుస్థిరమైన భవిష్యత్తు కోసం, పారదర్శకమైన విధానాలు, మానవ వనరుల పట్ల గౌరవం ఉన్నప్పుడే ఈసంక్షోభం నుంచి గట్టెక్కగలం. మనిషి ప్రాధాన్యతలు మారనంత వరకు, ఏ ప్రభుత్వ పథకమైనా కేవలం కాగితాలకే పరిమితమవుతుంది. అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక వృద్ధేనా? లేక భవిష్యత్ తరాలను నిర్మించే సామాజిక నమ్మకమా?'అన్నప్రశ్నకు సమాధానం వెతకాలి. యువత జీవించడానికి, కుటుంబాలను నిర్మించడానికి అనుకూలమైన సమాజాన్ని సృష్టించడమే ప్రభుత్వాల ప్రధాన బాధ్యత, లేదంటే సామాజిక బంధాలు బలహీనపడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ఇరాన్‌పై మళ్లీ విరుచుకుపడిన అమెరికా



## హర్మూజ్ తీరప్రాంతంలో నిఘా వ్యవస్థల కూల్చివేత

## గల్ఫ్‌లోని అమెరికా సైనికస్థావరాలపై ఇరాన్ ఐఆర్జీసీ మెరుపుదాడులు

### హర్మూజ్ ఏ ఒక్కరి సొంతం కాదు..అంతర్జాతీయ ఆస్తి: ట్రంప్

**టెహ్రాన్, వాషింగ్టన్, మే 28:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరాయి. ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నప్పటికీ, అమెరికా సైన్యం ఇరాన్‌లోని ఓ కీలక సైనిక స్థావరంపై ముందస్తు వైమానిక దాడులు నిర్వహించింది. ఈ చర్యతో ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. హర్మూజ్ జల సంధిలో అమెరికా దళాలు, వాణిజ్య నౌకలపై ఇరాన్ డ్రోన్లతో దాడులకు ప్లాన్ చేస్తోందన్న ఇంటెలిజెన్స్ సమాచారంతో ఈ చర్య తీసుకున్నట్లు అమెరికా రక్షణ శాఖ తెలిపింది. బందర్ అబ్బాస్ సమీపంలోని మిలిటరీ కంట్రోల్ సైట్‌పై ఈ దాడులు జరిగాయి. నిఘా కోసం పంపిన నాలుగు ఇరాన్ డ్రోన్లను కూడా విజయవంతంగా కూల్చివేసినట్లు ప్రకటించింది. హర్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా దళాలు దాడులు చేశాయి. ఇది జరిగిన కాసేపటికే బందర్ అబ్బాస్ పోర్టు వద్ద కూడా పలుమార్లు పేలుడు శబ్దాలు వినిపించాయి. ఈ దాడులను ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ట్ దురాక్రమణ చర్యగా అభివర్ణించింది. అమెరికా పదేపదే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తుందని ఇరాన్ ఆరోపించింది. ఇలాంటి దురాక్రమణలు కొనసాగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఈ దాడులు ఆత్మరక్షణలో భాగమేనని, కాల్పుల విరమణను కాపాడటానికే ఈ చర్య తీసుకున్నామని అమెరికా చెబుతోంది. వాషింగ్టన్ ఉద్దేశపూర్వకంగానే శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని ఇరాన్ తీవ్రంగా ఆరోపించింది. మరోవైపు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దౌత్యపరంగా కూడా ఒత్తిడి పెంచుతున్నారు. హర్మూజ్ జలసంధి నిర్వహణపై ఇరాన్‌ఒమన్ ప్రతిపాదనను ఆయన తిరస్కరించారు. అంతర్జాతీయ జలమార్గంపై ఏ ఒక్క దేశం ఆధిపత్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. సౌదీ అరేబియా, ఖతార్ వంటి గల్ఫ్ దేశాలు ఇజ్రాయెల్‌తో సంబంధాలు మెరుగుపరుచుకునే అబ్రహం ఒప్పందాల్లో చేరాలని ఆయన కోరుతున్నారు.

**హర్మూజ్ ఏ ఒక్కరి సొంతం కాదు..ట్రంప్**

వ్యూహాత్మకమైన హర్మూజ్ జలసంధిపై నియంత్రణ సాధించాలని చూస్తున్న ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఆ జలసంధి ఏ ఒక్క దేశానికీ చెందదని, అది అంతర్జాతీయ జలభాగమని, దానిని అందరికీ అందుబాటులో ఉంచుతామని స్పష్టం చేశారు. వైట్‌హౌస్‌లో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ అణు కార్యక్రమంపై చర్చలు జరుగుతున్నప్పటికీ, ఈ రవాణా మార్గాన్ని మూసివేయాలని చూస్తే సహించేది లేదని తేల్చి చెప్పారు.

ఇటీవల అమెరికా చేపట్టిన ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీతో పాటు కఠినమైన ఆర్థిక ఆంక్షల కారణంగా ఇరాన్ సైనిక, ఆర్థిక వ్యవస్థలు పూర్తిగా దెబ్బతిన్నాయని ట్రంప్ పేర్కొన్నారు. మా దెబ్బకు వారి రక్షణ వ్యవస్థ కుప్పకూలింది. అందుకే దిగివచ్చి చర్చలకు కూర్చున్నారు. ప్రస్తుతం ఇరాన్‌లో 250 శాతం ద్రవ్యోల్బణం ఉంది, వారి కరెన్సీకి విలువ లేకుండా పోయింది" అని ట్రంప్ వివరించారు.



# 5 లక్షల మంది రష్యా సైనికులు మృతి

## నాలుగేళ్లుగా సాగుతున్న ఉక్రెయిన్ వార్

**మాస్కో, మే 28:** రష్యా-ఉక్రెయిన్ మధ్య నాలుగేళ్లుగా కొనసాగుతోన్న యుద్ధం ఎప్పటికి ముగుస్తుందో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో కొన్ని సంచలన గణాంకాలు వెలుగులోకి వచ్చాయి. 2022 నుంచి జరుగుతోన్న ఈ ఘర్షణల్లో రష్యాకు సైనిక పరంగా భారీ నష్టం వాటిల్లినట్లు కనిపిస్తోంది. ఈ పోరులో 5 లక్షల మంది మాస్కో సైనికులు ప్రాణాలు కోల్పోయారని బ్రిటన్ నిఘా వర్గాలు అంచనా వేశాయి. మరోవైపు.. యుద్ధం ప్రారంభమైన దగ్గరనుంచి తాము 55 వేల మంది సైనికులను కోల్పోయినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఈ ఫిబ్రవరి వెల్లడించారు. ఇరువైపులా ప్రాణనష్టం భారీగానే ఉన్నా.. రెండు దేశాలు వాస్తవ లెక్కలను వెల్లడించట్లేదనే ఆరోపణలున్నాయి.

గత నాలుగేళ్లుగా డాన్‌బాస్ ప్రాంతంలోని ఉక్రెయిన్ స్థావరాలపై దాడుల కోసం రష్యా తన సైనికులను దశలవారీగా మోహరించింది. కొత్తగా చేరిన సైనికులు, జైళ్ల నుంచి నియమించుకున్న వారు ఈ ఘర్షణల్లో పాల్గొన్నారు. వారికి సరైన శిక్షణ లేకపోవడం.. యుద్ధరంగంలో భారీగా ప్రాణ నష్టానికి దారి తీస్తున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు, అమెరికా, దాని మిత్రదేశాలు సరఫరా చేసే క్షిపణి వ్యవస్థలు, ఫిరంగి, అధునాతన డ్రోన్లను ఉక్రెయిన్ ఉపయోగిస్తోంది. కమాండ్ పోస్టులు, సైనిక సమూహాలు లక్ష్యంగా జెలెన్స్కీ సైన్యం చేస్తోంది. దాంతో ఈ నష్టం మరింత పెరిగిందనే అంచనాలున్నాయి. ఈ దాడులను ఎదుర్కొనేలా రష్యా సుశిక్షితులైన సైనికులను నియమించుకో లేకపోతుందని, విధుల్లో ఉన్నవారిని కాపాడుకొనేలా ఎలాంటి రక్షణ కవచాలను సమీకరించుకోలేకపోతుందని యుకె నిఘా వర్గాలు అంచనా వేశాయి. ఈ కారణాలే రష్యాను దెబ్బతీస్తున్నట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

## అమెరికా స్థావరాలపై ఇరాన్ ప్రతీకార దాడులు

**టెహ్రాన్, మే 28:** పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓవైపు శాంతి ఒప్పందంపై చర్చలు కొనసాగుతుంగానే.. అమెరికా-ఇరాన్ మధ్య భీకర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. హార్మూజ్ సమీపంలో అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్ క్షిపణలు ప్రయోగించింది. అగ్రరాజ్య సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేపట్టింది. హార్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా దళాలు దాడులు చేశాయి. ఇది జరిగిన కాసేపటికే బందర్ అబ్బాస్ పోర్టు వద్ద కూడా పలుమార్లు పేలుడు శబ్దాలు వినిపించాయి. ఈ దాడులను ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జిసి) దురాక్రమణ చర్యగా అభివర్ణించింది. అమెరికా పదే పదే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తుందని ఇరాన్ ఆరోపించింది. ఇలాంటి దురాక్రమణలు కొనసాగితే.. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. అంతేగాక, తాజా దాడులకు ప్రతీకారంగా గల్ఫ్ దేశాల్లోని అమెరికా బేస్‌లను తాము లక్ష్యంగా చేసుకున్నట్లు ఐఆర్‌జిసి తెలిపింది. కానీ, అది ఎక్కడ స్థావరం అనే విషయాన్ని వెల్లడించలేదు. అయితే తమ గగనతలంపైకి క్షిపణులు, డ్రోన్లు దూసుకొచ్చాయని కువైట్ దళాలు పేర్కొన్నాయి. వాటిని సమర్థవంతంగా అడ్డుకున్నట్లు వెల్లడించాయి.

## గొర్రెల కాపరి పోస్టుకు 700 మంది దరఖాస్తు

### నివ్వెరపోయిన చైనా వ్యవసాయ క్షేత్ర యజమాని

**బీజింగ్, మే 28:** మంగోలియాకు దక్షిణాన ఉన్న మారుమూల, కఠినమైన గడ్డి మైదానాలలో పనిచేయడానికి గొర్రెల కాపరుల కోసం ఇచ్చిన ఉద్యోగ ప్రకటన వైరల్ కావడం చూసి చైనా వ్యవసాయ క్షేత్ర యజమాని జువో జియా వోయాంగ్ ఆశ్చర్యపోయాడు. మంగోలియా సరిహద్దు ప్రాంతంలో గొర్రెలు కాయడానికి ఇద్దరు వ్యక్తులు కావాలని అతను చిన్న ప్రకటన ఇచ్చాడు. రెండు పోస్టుల కోసం 700 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. షాంఘై, చోంగ్‌కింగ్ వంటి నగరాలలోని వైట్ కాలర్ ఉద్యోగులతో పాటు చైనాలోని వివిధ ఫ్యాక్టరీల కార్మికులు, విశ్వవిద్యాలయ పట్టభద్రులు కూడా దరఖాస్తు చేసుకున్నవారిలో ఉన్నారు. ఈ ఉద్యోగానికి ప్రకటించిన వేతనం రూ.1 లక్షా 10 వేల రూపాయలు. చైనా ప్రైవేటు కంపెనీల సగటు వేతనం సుమారు రూ.70 వేల కంటే ఇది చాలా ఎక్కువ. ఈ గొర్రెల కాపరికి పెద్ద మొత్తంలో వేతనంతో పాటు ఉచిత వసతి, ఉచిత గ్రాసరీ అందజేస్తారు. ఇది చైనా జాబ్ మార్కెట్‌లోని క్లిష్ట పరిస్థితులకు నిదర్శనమని చెబుతున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో పదోవంతు మంది అప్పుడే విశ్వవిద్యాలయ విద్యను పూర్తి చేసినవారు ఉన్నట్లు చెప్పారు. మరికొందరు అప్పుల్లో కూరుకుపోయినవారు ఉన్నారని పేర్కొన్నారు. ఈ ఉద్యోగం చేయడం అనుకున్నంత సులభం కాదు. వేసవిలో 4 వేల 900 ఎకరాల విస్తీర్ణంలో 3 వేల గొర్రెలను మేపాల్సి ఉంటుంది. శీతాకాలంలో మైనస్ 30 డిగ్రీలచలిలో వాటిని క్లీన్‌చేస్తూ అక్కడే ఉండాలి.

# కెనడాలో భారతీయ విద్యార్థిని దారుణ హత్య



**టొరంటో, మే 28:** కెనడాలో భారతీయ విద్యార్థిని దారుణ హత్యకు గురైంది. మృతురాలిని విధి మేఘగా గుర్తించారు. దుండగులు విధి మేఘను దారుణంగా పొడిచి చంపారు. ఆమె మృతదేహం అమెరికా-కెనడా సరిహద్దులో లభ్యమైంది. గుజరాత్‌లోని ఆనంద్ జిల్లా, బొర్సాద్ ప్రాంతానికి చెందిన విధి మేఘ (22) అనే యువతి కెనడాలో చదువుకుంటోంది. తన ఖర్చుల కోసం అక్కడ పని చేస్తోంది కూడా. త్వరలో కెనడాలో శాశ్వత నివాసం కోసం దరఖాస్తు చేసుకునేందుకు కూడా సిద్ధమైంది. ఈ క్రమంలో ఈ నెల 15 నుంచి ఆమె కనిపించకుండా పోయింది. దీనిపై కుటుంబ సభ్యులు, ఆమె సన్నిహితులు అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసులు ఆమె కోసం సెర్చింగ్ మొదలుపెట్టారు. విధి మేఘ కోసం వెతుకుతుండగా కెనడాలోని నయాగరా ప్రాంతంలో, కెనడా-అమెరికా సరిహద్దులో ఆమె మృతదేహం లభ్యమైంది. ఆమెను పొడిచి చంపినట్లు పోలీసులు తెలిపారు.

ఒంటిపై కత్తిపోట్లు ఉన్నాయి. దీంతో విధి మేఘ మృతిపై పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. విచారణ కొనసాగుతోందని, త్వరలోనే నిందితుల్ని పట్టుకుంటామని కెనడా పోలీసులు తెలిపారు. ఇటీవలి కాలంలో కెనడాలో భారతీయులపై దాడులు జరుగుతుండటంతోపాటు హత్యకు కూడా గురవుతున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో శివాంక్ అవస్థి అనే 20 ఏళ్ల భారతీయ వైద్య విద్యార్థిని టొరంటోలో కాల్చి చంపారు. 2025 ఏప్రిల్‌లో హర్‌సిమ్రత్ రంధావా అనే 21 ఏళ్ల భారతీయ విద్యార్థి కూడా హత్యకు గురయ్యారు. రెండు గ్రూపులు కాల్పులు జరుపుకోగా, ఈ ఘటనలో హర్‌సిమ్రత్ ప్రాణాలు కోల్పోయారు. 2024 డిసెంబర్‌లో కూడా హర్షదీప్ సింగ్ అంటాల్ కూడా హత్యకు గురయ్యాడు. భారతీయులు హత్యకు గురవుతుండటంతో కెనడాలోని భారతీయుల్లో ఆందోళన పెరిగింది.

# కర్ణాటకలో పూర్తి పదవీకాలం సిఎంగా ఉన్నది ముగ్గురే



**బెంగళూరు, మే 28:** కర్ణాటకలో సిఎం మార్పుపై కొన్ని నెలలుగా వచ్చిన కథనాలు నిజమయ్యాయి. 2023లో ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన సిద్ధరామయ్య ఇప్పుడు ఆ కుర్చీని వదులుకోవాల్సి వచ్చింది. ఎన్నికల ఫలితాల అనంతరం పార్టీ ఇచ్చిన మాట ప్రకారం డికె కొత్త సిఎంగా బాధ్యతలు స్వీకరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయనే ఖరారయితే ఆయన పదవిలో రెండేళ్లు మాత్రమే ఉంటారు. అసలు కర్ణాటకలో పూర్తి పదవీకాలం సిఎం సీటులో కొనసాగడం ఒక ఘనత అనే చెప్పవచ్చు. 1956 నుంచి ఆ క్రెడిట్ సాధించింది ముగ్గురంటే ముగ్గురే. కాంగ్రెస్ నేత ఎస్. నిజలింగప్ప రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1956లో ఏడాదికిపైగా ఆ పదవిలో ఉన్న ఆయన 1962లో మరోసారి ఆ బాధ్యతలు స్వీకరించారు. 1968 వరకు అంటే ఐదేళ్ల 345 రోజులు అధికారంలో కొనసాగారు. అదే పార్టీకి చెందిన డి.దేవరాజ్ ఉర్స్ 1972 నుంచి 1977 వరకు, తర్వాత సిద్ధరామయ్య 2013 నుంచి 2018 వరకు పూర్తికాలం ముఖ్యమంత్రులుగా కొనసాగారు.

అయితే 1973 వరకు మైసూరు రాష్ట్రంగానే ఉండేది. అనంతరం కర్ణాటకగా పేరు మార్చారు. ఇదిలా ఉంటే కర్ణాటకలో అతి తక్కువ కాలం పనిచేసిన ముఖ్యమంత్రులూ ఉన్నారు. ఏ పార్టీకి పూర్తి మెజార్టీ రాని సందర్భాల్లో ఎన్నికల అనంతరం పొత్తులు కుదిరినా అవి నిలబడలేదు. దాంతో ప్రభుత్వాలు కూలిన సందర్భాలున్నాయి. బిఎస్ యడియూరప్ప 2007లో కేవలం వారం రోజులే సిఎం పదవిలో ఉన్నారు. బిజెపి, జెడిఎస్ కూటమిలో సయోధ్య లేక ప్రభుత్వం కూలిపోయింది. వీరేంద్ర పాటిల్ రాజీనామా చేయడంతో 1971లో కొన్ని వారాలపాటు ఎస్ఆర్ కాంతి ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వహించారు. కాంగ్రెస్, జెడిఎస్ నేతృత్వం కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో ధరమ్‌సింగ్ ముఖ్యమంత్రి అయ్యారు.

యేడాదిపైగా ఆ కుర్చీలో కొనసాగినా కూటమిలోని వైరుధ్యాలతో ఆ ప్రయాణం సవ్యంగా సాగలేదు. దాంతో ఆయన 2006లో పదవిని కోల్పోయారు. పార్టీలో అంతర్గత రాజకీయాల కారణంగా బిజెపి సదానందగౌడను పక్కనపెట్టడంతో 2012లో జగదీశ్ శెట్టర్ ముఖ్యమంత్రి అయ్యారు. 305 రోజులు పదవిలో ఉన్నారు. తర్వాత అసెంబ్లీ గడువు ముగిసింది.

## భార్యనచ్చలేదని 50 వేలకు అమ్మేసిన భర్త

### బయ్యర్లతోపాటు ఏడుగురిని అరెస్టుచేసిన పోలీసులు

**బనస్కాంత, మే 28:** గుజరాత్‌లో అత్యంత దారుణంగా భార్య నచ్చలేదనే కారణంతో కట్టుకున్న భర్తే ఆమెను రూ.50 వేలకు అమ్మేశాడు. ఈకేసులో బాధితురాలి భర్త నిఖేష్‌భాయ్ పటేల్‌తో పాటు మొత్తం ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. బనస్కాంత జిల్లాలో జరిగిన ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈనెల 11న నిందితుడు నిఖేష్ పటేల్ తన భార్య కనిపించడం లేదని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రెండు రోజుల తర్వాత నిఖేష్ కూడా అదృశ్యం కావడంతో అతడి తండ్రి మరో ఫిర్యాదు చేశారు. ఈ వరుస పరిణామాలు పోలీసులకు అనుమానం కలిగించాయి.

దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో లోతైన దర్యాప్తు చేపట్టారు. టెక్నికల్ సర్వైలెన్స్, మానవ వనరుల ద్వారా సమాచారం సేకరించిన పోలీసులు నిఖేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు. తన భార్య ప్రవర్తన నచ్చకపోవడంతో, ఆమెను వదిలించుకోవాలనే ఉద్దేశంతోనే స్నేహితులైన సంజయ్ ఠాకూర్, అశోక్ ఠాకూర్, సచిన్ దర్బార్‌ల సహాయంతో అమ్మేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుల చెర నుంచి బాధితురాలిని పోలీసులు సురక్షితంగా కాపాడారు. తనను అమ్మేసిన తర్వాత ఒకచోట బంధించి, నిరంతరం లైంగిక దాడి చేశారని బాధితురాలు తన వాంగ్మూలంలో పేర్కొంది.

తన బంగారు ఆభరణాలను లాక్కొని అమ్మేశారని తెలిపింది. ఈ కేసులో పోలీసులు హ్యూమన్ ట్రాఫికింగ్, మోసం, నేరపూరిత కుట్ర వంటి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడు నిఖేష్ పటేల్‌కు ఇదివరకే పెళ్లయిందని, ఇతర మహిళలను లోబరుచుకోవడం, కిడ్నాప్ చేయడం వంటి నేర చరిత్ర ఉందని పోలీసులు గుర్తించారు. ఈ కోణంలో కూడా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## నాలుగు రాష్ట్రాలకు బిజెపి చీఫ్‌ల నియామకం

**న్యూఢిల్లీ, మే 28:** పశ్చిమ బెంగాల్, అసోం, పుదుచ్చేరిలో బిజెపిజెండా ఎగరేసిన కాషాయ పార్టీ ఇప్పుడు మిగతా రాష్ట్రాలపై ఫోకస్ చేసింది. పార్టీ సంస్థాగత బలోపేతంపై కీలక నిర్ణయం తీసుకుంది. నాలుగు రాష్ట్రాలకు కొత్త అధ్యక్షుల్ని నియమిస్తూ గురువారం బిజెపి జాతీయాధ్యక్షుడు నితిన్ నబిన్ ఆదేశాలు జారీ చేశారు. నాలుగు రాష్ట్రాలకు వేర్వేరు నోటిఫికేషన్ల ద్వారా కొత్త అధ్యక్షుల్ని నియమిస్తున్నట్లు వెల్లడించారు. దీని ప్రకారం ఢిల్లీ బిజెపి అధ్యక్షుడిగా హర్ష్ మల్హోత్రాను, పంజాబ్ బిజెపి అధ్యక్షుడిగా కేవల్ సింగ్ ధిల్లాన్‌ను, హరియానా బిజెపి అధ్యక్షురాలిగా అర్చనా గుప్తాను, త్రిపుర బిజెపి అధ్యక్షుడిగా అభిషేక్ దేవ్‌రాయ్‌ను నియమించారు. ఇంతకుముందు ఢిల్లీకి అధ్యక్షుడిగా వీరేంద్ర సచ్‌దేవా, పంజాబ్ అధ్యక్షుడిగా సునీల్ ఝకార్, హరియాణా అధ్యక్షుడిగా మోహన్ లాల్ బదోలి, త్రిపుర అధ్యక్షుడిగా రజీబ్ భట్టాచార్జీ ఉండేవారు. వీరి స్థానంలో కొత్తవారిని నియమిస్తూ బిజెపి నిర్ణయం తీసుకుంది. పంజాబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన కేవల్ సింగ్ ధిల్లాన్ గతంలో ఎమ్మెల్యేగా పనిచేశారు. అంతకుముందు కాంగ్రెస్‌లో ఉండేవారు. తర్వాత పార్టీకి రాజీనామా చేసి బిజెపిలో చేరారు.

అలాగే, పంజాబ్ మాజీ సిఎం కెప్టెన్ అమరీందర్ సింగ్‌కు సన్నిహితుడు. ఢిల్లీ బిజెపి అధ్యక్షుడిగా నియామకమైన హర్ష్ మల్హోత్రా తొలిసారి ఎంపీగా గెలిచారు. ఆయన పార్టీ కోసం చాలా శ్రమించారు. కేంద్ర మంత్రిగా కొనసాగుతున్నారు. హరియాణా అధ్యక్షురాలిగా ఎన్నికైన అర్చనా గుప్తా రాష్ట్ర జనరల్ సెక్రెటరీగా పని చేస్తున్నారు. ఆమెకు ఈసారి అధ్యక్షురాలిగా ప్రమోషన్ లభించింది. త్రిపురలో అత్యంత కీలక నియోజకవర్గమైన మతార్బారి నుంచి పోటీ చేసి గెలిచారు. ఆయనకు తాజాగా అధ్యక్షుడిగా పదవి దక్కింది.

## దేశ రహస్యాలు చేరవేస్తున్న యువకుడి అరెస్టు

**న్యూఢిల్లీ, మే 28:** పాకిస్థాన్‌కు చెందిన ఇంటర్‌సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) పన్నిన హనీట్రాప్ వలలో చిక్కుకుని, దేశ భద్రతకు సంబంధించిన కీలక సమాచారాన్ని చేరవేస్తున్న ఓ యువకుడిని జమ్మూ పోలీసులు అరెస్ట్ చేశారు. జమ్మూ ప్రాంతంలోని మక్వాల్ గ్రామానికి చెందిన 23 ఏళ్ల కరణ్, చదువు మధ్యలోనే ఆపేశాడు. కొన్ని నెలల క్రితం స్నాప్‌చాట్‌లో ఓ యువతి అతనికి పరిచయమైంది. తాను పంజాబ్‌లో పనిచేస్తున్న బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) సైనికురాలినని నమ్మబలికింది.

తరచూ చాటింగ్, అసభ్యకరమైన వీడియో కాల్స్‌తో కరణ్‌ను పూర్తిగా తనవైపు తిప్పుకుంది. కరణ్ తన అధీనంలోకి వచ్చాడని నిర్ధారించుకున్న తర్వాత, ఆ ఐఎస్ఐ ఏజెంట్ అసలు నాటకానికి తెరతీసింది. తనకు రాజౌరిలోని సుందర్‌బని సెక్టార్‌కు బదిలీ అయిందని, అక్కడ మొబైల్ సిగ్నల్ సరిగ్గా ఉండదని చెప్పింది. అందువల్ల తన కుటుంబ సభ్యుల్లో ఒకరి వాట్సాప్ వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఒటిపి) పంపమని కోరింది. ఆమె మాటలను గుడ్డిగా నమ్మిన కరణ్, ఏమాత్రం అనుమానించకుండా తన తల్లి వాట్సాప్ ఒటిపిని ఆమెతో పంచుకున్నాడు. దీంతో ఆ వాట్సాప్ అకౌంట్ యాక్సెస్ పాక్ హ్యాండ్లర్‌కు చిక్కింది. ఆ తర్వాత జమ్మూ ప్రాంతంలోని ఆర్మీ బంకర్లు, రక్షణ శాఖకు చెందిన కీలక నిర్మాణాలు, ఫ్లైఓవర్లకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు పంపాలని కరణ్‌ను ఆదేశించింది. అతను పంపిన మొదటి బ్యాచ్ చిత్రాలకు బదులుగా, అతని బ్యాంకు ఖాతాలో రూ.2వేలు జమ చేసింది. మరిన్ని ఫొటోలు, వీడియోలు పంపాలని ఆమె ఒత్తిడి చేయడంతో మిలిటరీ ఇంటెలిజెన్స్ (ఎంఐ) వర్గాలకు అనుమానం వచ్చింది. దీంతో ఎంఐ అధికారులు కరణ్‌పై రహస్యంగా నిఘా పెట్టారు. అతను గూఢచర్య కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని నిర్ధారించుకున్నాక, జమ్మూ పోలీసులను అప్రమత్తం చేశారు. ఆర్మీ, పోలీసుల సంయుక్త బృందం మక్వాల్ గ్రామంలో కరణ్‌ను అరెస్ట్ చేసింది. అతని మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, సోషల్ మీడియా ఖాతాలను, డిజిటల్ లావాదేవీలను పరిశీలిస్తున్నారు. విచారణలో తాను సున్నితమైన సమాచారాన్ని పంచుకున్నట్లు కరణ్ అంగీకరించినట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సంక్షిప్తంగా..

### విమానం రెండుసార్లు ల్యాండింగ్ విఫలం

**బొగోటా, మే 28:** కొలంబియాలోని ఓ విమానానికి అనూహ్య పరిస్థితి ఎదురైంది. పర్వత శిఖరాల్లో ఉన్న విమానాశ్రయం వద్ద ల్యాండింగ్ సమయంలో వాతావరణం అనుకూలించకపోవడంతో రెండుసార్లు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పైలట్ అప్రమత్తతతో విమానానికి ప్రమాదం తప్పింది. ఇందుకు సంబంధించిన విడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ విమానం కొలంబియాలోని బొగోటా నుంచి పాస్టోలోని విమానాశ్రయానికి బయల్దేరింది. ఈ ఎయిర్‌పోర్టు సముద్ర మట్టానికి దాదాపు 6 వేల అడుగుల ఎత్తులో ఉంది. దట్టమైన పొగమంచు, బలమైన గాలులు వీయడంతో పైలట్ తొలుత విమానాన్ని ల్యాండింగ్ చేయడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. రెండోసారి ప్రయత్నించినా కుదరలేదు. దీంతో అందులోని ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళనలకు గురయ్యారు.

### భారత్ మామిడిపై జపాన్ నిషేధం



**టోక్యో,మే 28:** భారత మామిడి ఎగుమతిదారులకు జపాన్ ప్రభుత్వం షాకిచ్చింది. ఈ సీజన్‌కుగాను భారత మామిడి పండ్ల దిగుమతులను పూర్తిగా నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. భారత్‌లోని క్రిమిసంహారక కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు సరిగా లేవని జపాన్ తనిఖీ బృందం గుర్తించింది. ఈ పరిణామంతో మామిడి ఎగుమతిదారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని రెహ్మాన్‌పూర్‌లో ఉన్న ఒక ప్లాంట్‌లో వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ ప్రక్రియలో లోపాలు ఉన్నట్లు జపాన్ అధికారులు గుర్తించారు. పండ్లను తెగుళ్ళ, కీటకాల నుంచి రక్షించడానికి ఈ ప్రక్రియ చాలా కీలకం. ఈ నేపథ్యంలో మార్చి 2 తర్వాత జారీ చేసిన భారతీయ సర్టిఫికెట్లతో వచ్చే మామిడి షిప్‌మెంట్‌లను అంగీకరించబోమని జపాన్‌కు చెందిన యొకోహామా ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ స్పష్టంచేసింది.

### బీహార్‌లో పడవ ప్రమాదం.. ఏడుగురు గల్లంతు

**పాట్నా, మే 28:** బీహార్‌లో ఘోర పడవ ప్రమాదం జరిగింది. గంగా నదిలో పడవ బోల్తా పడి పలువురు గల్లంతయ్యారు. పాట్నా జిల్లా, బార్హ్ సబ్ డివిజన్ పరిధిలోని ఉమానాథ్ ఘాట్ వద్ద గంగా నదిలో గురువారం జరిగింది. స్థానిక అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం గంగా నదిలో 14 మంది ప్రయాణికులతో వెళ్తున్న చిన్న పడవ బోల్తా పడింది. నీటి ప్రవాహం, గాలి, అలల ధాటికి పడవ బోల్తా పడింది. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ పడవ బోల్తా పడటంతో అక్కడే ఉన్నవారు ఇతర చిన్న పడవల ద్వారా కొందరిని రక్షించారు. ఏడుగురు గల్లంతయ్యారు. నదిలో గల్లంతైన వారికోసం స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్డీఆర్ఎఫ్) బృందం గాలింపు చర్యలు చేపట్టింది.

### టిఎంసి మాజీ ఎంపి డా.శంతనుసేన్ రాజీనామా



**కోల్‌కత్తా, మే 28:** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం మమతా బెనర్జీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నాయకులు వరుసగా రాజీనామా చేస్తున్నారు. తాజాగా సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ ఎంపీ డాక్టర్ శంతను సేన్ పార్టీ జాతీయ అధికార ప్రతి నిధి పదవికి రాజీనామా చేశారు. నిన్న కకోలీ దస్తీదార్ ఘోష్ పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు అన్ని పదవులకు రాజీనామా చేశారు. ఈ రాజీనామా మరుసటి రోజే శంతను సేన్ షాకిచ్చారు. 2024 నాటి ఆర్జీకర్ హత్యాచార కేసు, పార్టీపై వస్తున్న నిరంతర అవినీతి ఆరోపణలతో తాను తీవ్ర మనస్తాపం చెంది ఈ నిర్ణయం తీసుకున్నానని శంతను సేన్ పేర్కొన్నారు.

### తృణమూల్ ఎంపి కకోలిఘోష్ పార్టీ పదవులకు రాజీనామా

**కోల్‌కతా, మే 28:** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన తృణమూల్ కాంగ్రెస్‌లో కలకలం రేగింది. ఆ పార్టీలోని అన్ని కీలక పదవులకు సీనియర్ ఎంపి కకోలిఘోష్ దస్తీదార్ రాజీనామా చేశారు. అంతేకాదు పార్టీలో పలు అవకతవకలు చోటుచేసుకున్నాయని పేర్కొంటూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సహచర ఎంపి కల్యాణ్ బెనర్జీపై తీవ్ర ఆరోపణలు చేశారు. తనను తృణమూల్ మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలి పదవి సహా అన్ని పదవుల నుంచి తప్పించాలని కోరుతూ ఆమె పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు సుబ్రత్ బక్షీకి లేఖ రాశారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ

## ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

**- రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ**

**తిరుపతి,మే 28ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుజాతి గౌరవాన్ని చాటి చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని, ఆయనకు భారతరత్న అవార్డు ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ సూచించారు. ఎన్టీఆర్103వ జయంతి సందర్భంగా తిరుపతిలోని ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన జయంతి సందర్భంగా పాలాభిషేకం చేసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్ వర్మ మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు అటు సినీ రంగంలో రాజకీయ రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని నిలుపుకోవడం జరిగిందని గుర్తు చేశారు. తిరుపతి మహానగరంలో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని వివరించారు. వాటిలో ప్రధానంగా సిమ్స్, బర్డ్స్, పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం, అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని వివరించారు. తెలుగుదేశం పార్టీ పరిశీలకు రాలు పర్వీన్ తాజ్ ప్రజలకు విస్తృతంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. తెలుగు జాతిలో చిరస్థాయిగా ఎన్టీఆర్ నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి సుగుణమ్మ, తాతయ్య గుంట గంగమ్మ గుడి చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్,మహిళా అధ్యక్షురాలు బ్యాంకు శాంతమ్మ, తెలుగుదేశం పార్టీ నాయకులు బుల్లెట్ రమణ, రూపేష్ కుమార్, రాము, మన్నెం శ్రీనివాసులు పాల్గొన్నారు.



## విశ్వవిఖ్యాత ఎన్టీఆర్‌కు రాయలసీమ రంగస్థలి ఘన నివాళులు

**తిరుపతి,మే 28ప్రభాతవార్తప్రతినిధి:** స్వర్గీయ ఎన్టీఆర్‌జయంతిపురస్కరించుకుని గురువారం తిరుపతి ప్రధాన తపాలా కార్యా లయం వద్ద ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ చిత్ర పటానికి కళాకారులు, అభిమానులు పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు జాతి గర్వకారణమైన ఎన్టీఆర్ కేవలం సినీ నటుడే కాకుండా ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానుభావుడని కొనియాడారు. పురాణ పాత్రలకు ప్రాణం పోసిన మహానటుడిగా, తెలుగు సంస్కృతి వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన కళాతపస్విగా ఎన్టీఆర్ చిరస్మరణీయులని పేర్కొన్నారు.శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, కర్ణుడు వంటి పాత్రల్లో ఎన్టీఆర్ నటన ప్రేక్షకులను భక్తి భావంలో ముంచెత్తింది. ఆయన సంభాషణ శైలి, వ్యక్తిత్వం, ప్రజల పట్ల చూపిన సేవా భావం నేటి తరానికి ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో రంగస్థలి కళాకారులు చెన్నూరు సుబ్రహ్మణ్యం, ఎం గురునాథ నాయుడు, మిట్టపల్లి బ్రహ్మానంద రెడ్డి, డీఎంకే గణేష్ రాయల్, సాంబోల హరినాథ్, సుబ్రహ్మణ్యం రెడ్డి, కే ఎన్ రాజా, బ్రహ్మానంద రెడ్డి, కస్పా పద్మనాభం, మాజీ కౌన్సిలర్ జనార్దన్ రెడ్డి, లోక ప్రభాకర్ నాయుడు, పురోహితుడుసురేష్ స్వామి, పొన్నాల జేజిరెడ్డి, ముని కృష్ణయ్య, ఆర్ ఎం ఎస్ భాస్కర్, చంద్రబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**తిరుపతి శాప్ స్పోర్ట్స్ అకాడమీ - 2026**

## రైఫిల్ షూటింగ్, లాన్ టెన్నిస్ రాష్ట్ర స్థాయి ఎంపికలు

**తిరుపతి క్రీడ, మే 28 ప్రభాతవార్త** తిరుపతి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో శాప్ స్పోర్ట్స్ అకాడమీ – 2026 రైఫిల్ షూటింగ్, లాన్ టెన్నిస్ రాష్ట్ర స్థాయి ఎంపికల ఈ రోజు శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఘనంగా ప్రారంభమైనాయి. 15 సంవత్సరాల నుంచి 19 వరకు గల బాలబాలికలు రైఫిల్ షూటింగ్, లాన్ టెన్నిస్ రాష్ట్ర స్థాయి ఎంపికల నిర్వహించారు. ఈ ఎంపికలకు క్రీడాకారులు, శిక్షకులు, సిబ్బంది, తల్లితండ్రులు కలిపి సుమారు 100 మంది పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికేనా క్రీడాకారులు ఎంపికైన అభ్యర్థులకు క్రీడా సదుపాయాలు కల్పించబడును. రాష్ట్ర స్థాయిలో ఎపికేనా క్రీడాకారులు కారుల వివరాలు త్వరలో తెలియజేసామన్నారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎన్. శశిధర్ మాట్లాడుతూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులు గుర్తించి,

వారి నైపుణ్యాలను మెరుగుపరచడం ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేయడం ఈ టోర్నమెంట్ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.

# ఎన్టీఆర్ ఆశయ సాధనకు సైనికుల్లా పనిచేస్తాం

**- తిరుపతి పార్లమెంట్ 11క్లస్టర్ లో ఎన్టీఆర్ జయంతి**



**తిరుపతి,మే 28ప్రభాతవార్తప్రతినిధి:** బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన మహనీయుడు స్వర్గీయ ఎన్టీరామారావు అని రాష్ట్రకార్యదర్శి వి.పుష్పావతియాదవ్, తుడచైర్మన్, టిడిపి పార్లమెంట్ కార్యదర్శి సి.దివాకర్‌రెడ్డి తెలిపారు. కిలో 2 రూపాయలకి బియ్యం పథకాన్ని కూడా ప్రవేశ పెట్టిన ఘనత ఆయనదేనన్నారు. ఎన్టీ రామారావు రాజకీయ పార్టీ పెట్టి తొమ్మిది నెలల్లోనే ముఖ్యమంత్రి అవ్వడం జరిగిందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ మహానాడు వర్చువల్ ద్వారా 7. 50 కోట్లమంది ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని వివరించారు. తిరుపతిలోని 11వ క్లస్టర్‌లో పుష్పావతియాదవ్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వర్చువల్ మహానాడు రెండవ రోజు గురువారం కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. మధ్యాహ్నం ఆమె అన్నదానం చేపట్టారు. తొలుత పసుపురంగులో కేక్‌కట్‌చేసి పంచిపెట్టారు. వర్చువల్ మహానాడులో తుడా చైర్మన్ సి.దివాకర్ రెడ్డి ఈ మహానాడు వేదికగా మహిళా నాయకులు, కార్యకర్తలు తమ ఐక్యతను చాటారు. విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని క్లస్టర్ మహిళలతో కలిసి ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. క్లస్టర్ 11 పరిధిలోని మహిళా నాయకురాళ్లు, స్థానిక టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు, మరియు నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

# అల్లాహ్ ఆదేశాల్ని అమలు చేసారు.. చిరస్థాయిగా నిలిచారు

**- కల సందేశాన్ని అమలుకు పూనుకున్న ప్రవక్త - బక్రీద్ ప్రార్థనల్లో మత గురువుల బోధ**



ఈదుల గుంట ఈద్‌గాహ్ వద్ద నమాజు సందర్భంగా హాజరైన భక్తులు

**శ్రీకాళహస్తి,మే 28 ప్రభాతవార్త** గురువారం బక్రీద్ పండగ సందర్భంగా ఈదుల్ అజ్‌హా ప్రార్థనల్ని భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. ప్రవక్తల త్యాగనిరతి మార్గదర్శకం కావాలి: గురువారం శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ఈదుల గుంట ఈద్‌గాహ్‌లో హాఫీజే ఖుర్‌ఆన్ రేహాన్ సాహెబ్ బక్రీద్ పండగ ప్రాధాన్యత గురించి వివరించారు. నియోజకవర్గంలోని వేలాది మంది ముస్లిం సొదరులు ఇక్కడ హాజరై అల్లాహ్ ఎదుట మోకరిల్లి ప్రార్థించారు.ఈ సందర్భంగా రేహాన్ మహనీయులు,ప్రవక్తల త్యాగనిరతి భావి తరాలకు మార్గ దర్శకం కావాలన్నదే అల్లాహ్ సందే శం అని వివరించారు. ప్రవక్తల సత్యసంధతను వివరిస్తూ అల్లాహ్ ఆదేశాల్ని అమలు చేయటం ఒకటైతే కలలో వచ్చిన సందేశాన్ని తూచ తప్పక భావితరాల హృదయాలో చిరస్థాయిగా నిలిచారు. ఇబ్రహీం ఖలీలుల్లా సొల్లె అలా సొల్లం. ముఖ్యంగా బక్రీద్ అంటే 'ఖుర్బాని' అని అర్థంగా వివరించారు. స్తోమత ఉండి కూడా ఖుర్బానీ ఇవ్వని వారి జీవితం నిరర్థకమన్నారు. 'దైవాజ్ఞతో కన్నబిడ్డను బలిదానం ఇవ్వటానికి కూడా వెనుకాడని మహనీయుని జ్ఞాపకార్థం జరుపుకునే పండగే బక్రీద్ అని వివరించారు. అలాంటి మహనీ యుల సంతతి నేడు ఎలా ఉందో మనం ఆత్మ పరిశీలన చేసుకొవాలని సూచించారు. ఆర్థిక స్థో మత కల్గిన వారు హాజ్ చేయాలి: ఆర్థిక స్థోమత కల్గిన వారు 'హాజ్' చేయాలని అలాగే ఖుర్బానీ ఇవ్వాలని దివ్యఖుర్ ఆన్ సూచిస్తుందని అయితే ఎందరు ఆచరిస్తున్నారో ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. ధర్మాన్ని మనం కాపాడితే దైవం మనల్ని కాపాడుతాడని గ్రహించాలన్నారు. మతం మంచిని నేర్పుతుందని అయితే దాన్ని వక్రమార్గాన్ని నడుపుటకు కొన్ని దుష్టశక్తులు పాటుపడుతున్నాయన్నారు. ఈమాయాజాలాన్ని విడనాడి దైవ మార్గంలో పయనించాలన్నారు. . ఏర్పాట్లను కమిటి అధ్యక్షులు హాజీ బియస్ అక్రమ్‌సాహెబ్, ఖలీలుల్లా హుసేని,అంజద్ బాషా,ఉమర్ తాజుద్దీన్, వారి సహచరులు పర్య వేక్షించారు. భక్తి శ్రద్దలతో ప్రార్థనలు: శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో పండగల్ని హిందూ ముస్లింలు కలసి జరుపు కోవటం ఆనవాయితి. ఈ నేపథ్యంలోముస్లింల బక్రీద్ పండగ సందర్భంగా పలువురు స్నేహితులు ఈద్‌గాహ్‌ల వద్ద హాజరై శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తును పర్యవేక్షించగా మున్సిపాలిటి శానిటేషన్‌ను పర్యవేక్షించారు.

# పెట్రోల్, గ్యాస్ భారం - కేంద్ర నిరంకుశ విధానాలపై జూన్ 9న రాష్ట్ర వ్యాప్త రాస్తారోకోలు

**విజయవాడ,మే 28,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో నిరంకుశ చర్యలు, పౌరహక్కులు, ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు.గురువారం సిపిఎం రాష్ట్ర రాష్ట్ర కార్యాలయంలో వామపక్ష పార్టీల సమావేశం జరిగింది. సిపిఐఎంఎల్ నాయకులు జాస్తి కిషోర్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు హరినాథ్‌రెడ్డి, సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, పొలారి, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు హరినాథ్, ఎంసిపిఐయు నాయకులు గణేష్ పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొనలేకపోయిన ఆరఎస్‌పి, ఫార్వార్డ్ బ్లాక్, న్యూడెమొక్రసీ, ఎస్‌యుసిఐ(సి) నాయకులు సమావేశ నిర్ణయాలకు మద్దతు ప్రకటించారు.అనంతరం బాలోత్సవ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో నిరంకుశ చర్యలు, పౌరహక్కులు, ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని తెలిపారు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్ ధరలను ఇప్పటికి నాలుగుసార్లు పెంచడాన్ని సమావేశం తీవ్రంగా ఖండించినట్లు తెలిపారు. మరలా ధరలను పెంచుతున్నట్లు వచ్చిన వార్తల పట్ల సమావేశం ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి వ్యతిరేకంగా జూన్ 1 నుండి ఏడోతేదీ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం కరపత్రాల పంపిణీ, సమావేశాలు, సదస్సుల రూపంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కేజీ బేసిన్ గ్యాస్ సాధన కోసం పాశర్లపూడి ప్రాంతంలో వామపక్షాలు జూన్ మొదటివారంలో పర్యటిస్తాయని వివరించారు. కేంద్రం పెట్రోలు ధరలను రోజువారీ లెక్కన పెంచుతోందని, దీనివల్ల రోజువారీ ఉపాధిపై ప్రభావం పడుతోందని, రోజువారీ కూలీలు, చిన్న ఉద్యోగులు, తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు.కేరళం మాజీ సిఎం పినరయి విజయన్‌పై దాడి వెనుక కేంద్రం కుట్ర ఉందని శ్రీనివాసరావు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలను జేబు సంస్థలుగా మార్చి ప్రతిపక్ష నేతలపై దాడులకు ఉసిగొల్పుతున్నారని, ప్రజలు దీన్ని చూస్తూ ఊరుకోరని తెలిపారు. కేంద్రం యువత విషయంలో వ్యవహరిస్తున్న విధానాలపై ఆగ్రహంతో వ్యంగ్యాస్త్రంగా ప్రారంభమైన కాక్రోచ్ జనతాపార్టీ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోందని తెలిపారు. ప్రజల్లో అసంతృప్తి ఏజెండాగా ముందుకు వచ్చిందని తెలిపారు. దీన్ని సహించలేని కేంద్రం ఒకవైపు కాక్రోచ్ జనతాపార్టీ ఎక్స్ ఖాతాలను బ్లాక్ చేయించి మరోవైపు దీన్నుండి దృష్టి మళ్లించడానికే విజయన్ ఇంటిపై దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యువతను చూసి ప్రభుత్వం ఎంత భయపడుతుందో దీన్ని బట్టే అర్థం అవుతుందని పేర్కొన్నారు. అవినీతిపరులు బిజెపిలో చేరితే పునీతులు: సిపిఐ నాయకులు హరినాథ్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా అవినీతిపరులని ముద్రలు వేసిన బిజెపి వారి పార్టీలో చేరగానే పునీతులు అన్నట్లు ముఖ్యమంత్రి పదవులు కట్టబెడుతోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు పి.హరినాథ్‌రెడ్డి అన్నారు. ప్రస్తుత బెంగాల్, అస్సాం సిఎం ఇద్దరూ గతంలో అవినీతి కేసుల్లో ఉన్నారని, బిజెపిలో చేరగానే నిజాయితీ పరులంటూ సర్టిఫికెట్లు ఇచ్చేస్తున్నారని వివరించారు. మరోవైపు ప్రతిపక్ష పార్టీల నాయకులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని వివరించారు

# ఈశాన్య రాష్ట్రాల ప్రగతికి, మోడీ ప్రభుత్వం కట్టుబడి ఉంది

**కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ**

**విజయవాడ,మే 28,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మూడు రోజుల ఈశాన్య రాష్ట్రాల అధికారిక పర్యటన విజయవంతంగా ముగిసింది. పర్యటనలో భాగంగా మొదటి రోజు అస్సాంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన తదుపరి రెండు రోజుల పాటు మేఘాలయ రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతతో ఈశాన్య రాష్ట్రాల సమగ్ర ప్రగతి కోసం సౌత్ వెస్ట్ ఖాసీ హిల్స్ జిల్లాలో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ విస్తృతంగా పర్యటించారు. వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అనంతరం ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామీణ ఉపాధి హామీ (నరేగా) పనులు, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కార్యక్రమాల ద్వారా క్షేత్రస్థాయిలో మహిళా సాధికారత ఏ విధంగా సాగుతుందో ఉన్నతాధికారులతో కలిసి సమగ్రంగా సమీక్షించారు. గ్రామీణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి, ప్రగతిని వేగవంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ అధికారులకు స్పష్టం చేశారు. మేఘాలయ అధికారిక పర్యటనలో భాగంగా మావ్రాంగ్లాంగ్ లోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన వాహ్రిలాంగ్ వ్యూ పాయింట్ ను శ్రీనివాస వర్మ సందర్శించారు. అద్భుతమైన ప్రకృతి సౌందర్యం, కనువిందు చేసే జలపాతాలు, ఆహ్లాదకరమైన ప్రకృతి దృశ్యాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని ఆయన పేర్కొన్నారు. సుస్థిర ఎకోటూరిజం అభివృద్ధికి మేఘాలయ ఒక ప్రధాన గమ్యస్థానంగా మారేందుకు ఇక్కడ అపారమైన అవకాశాలు ఉన్నాయని, పర్యాటక రంగం అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఇక్కడ పర్యాటక మౌలిక వసతులను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి, స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించి సాధికారత వైపు నడిపించడానికి తద్వారా ఈశాన్య ప్రాంతాన్ని ప్రపంచ పర్యాటక పటంలో సగర్వంగా నిలపడానికి ఎన్డీఏ (విదీతి) ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.గత ప్రభుత్వాల హయాంలో భౌగోళిక పరిస్థితుల నెపంతో ఈశాన్య రాష్ట్రాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని, కానీ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈశాన్య రాష్ట్రాల రూపురేఖలు మారిపోయాయని గుర్తుచేశారు. ఒకప్పుడు వెనుకబాటుతనానికి గురైన ఈశాన్య భారతం, నేడు ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో దేశ ప్రగతికి ఒక నూతన గ్రోత్ ఇంజిన్‌గా ఆవిర్భవించిందని ఆయన అన్నారు. ఈశాన్య రాష్ట్రాల సర్వతోముఖాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం విరివిగా నిధులను మంజూరు చేస్తోందని, కేంద్ర నిధులను సద్వినియోగం చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం మరింత వేగంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# జాతీయ రహదారుల టెండర్లలో అధికారుల అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి కేంద్ర మంత్రికి బిజెపినేత విష్ణువర్ధన్ రెడ్డి ఫిర్యాదు

**శ్రీ సత్యసాయి జిల్లా, మే 28, ప్రభాతవార్త ప్రతినిధి** శ్రీ సత్యసాయి జిల్లాలో జాతీయ రహదారుల నిర్వహణకు సంబంధించిన టెండర్లలో అధికారులు కుమ్మక్కై అవినీతికి పాల్పడినట్లు బీజేపీ సీనియర్ నేత ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం ఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో పాటు, ఆ శాఖ కార్యదర్శి వి. ఉమాశంకర్ కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలియజేశారు. కేంద్ర రోడ్డు రవాణా శాఖ జారీ చేసిన ఖిషార్ట్ టర్మ్ మెయింటెనెన్స్ఖి టెండర్లలో అధికారులు కుమ్మక్కై పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ టెండర్ ద్వారా ఎన్ హెచ్42, ఎన్ హెచ్340 పరిధిలోని సత్యసాయి జిల్లా ప్రాంతాల్లో పలు రహదారులు, ఆర్‌ఓబీ నిర్వహణ పనులు చేపట్టాల్సి ఉందన్నారు. అయితే టెండర్ ప్రక్రియలో పాల్గొన్న నిర్మాణ సంస్థలు సిండికేట్ గా మారి అధికారుల సహకారంతో టెండర్ విలువను కృత్రిమంగా పెంచేందుకు కల్పిత బిడ్లు దాఖలు చేశాయని విష్ణువర్ధన్ రెడ్డి ఆరోపించారు. రూ. 10.69 కోట్ల టెండర్లలో భారీ అవినీతి, టెండర్ రిగ్గింగ్, రోడ్డు అంచనాల్లో అవకతవకలు జరిగాయన్నారు. కొంతమంది బిడ్డర్లను కావాలనే సాంకేతిక కారణాలతో అనర్హులుగా ప్రకటించి, చివరకు తాము అనుకున్న సంస్థలకే టెండర్ దక్కేలా కుట్ర పన్నారని పేర్కొన్నారు. త్వరలోనే ఈ టెండర్ల బిడ్డింగ్ ఓపెన్ చేయాల్సి ఉందని, ఈ వ్యవహారంలో సంబంధిత సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ ఈ) కూడా కుమ్మక్కయ్యారని ఆయన ఆరోపించారు. ప్రజాధనాన్ని రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని, ఎం ఓ ఆర్ టి హెచ్ కార్యదర్శిని కోరడం జరిగిందన్నారు.

# తిరుమల సమాచారం

## ధ్వజారోహణంతో ప్రారంభమైన నారాయణవనం బ్రహ్మోత్సవాలు



**తిరుమల,మే 28ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి జిల్లా నారాయణవనంలోని పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ధ్వజారోహణ మహోత్సవంతో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 7.30 నుండి 9 గంటల మధ్య శుభ మిధున లగ్నంలో వైఖానసాగమోక్తంగా ధ్వజారోహణ ఘట్టాన్ని ఘనంగా నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద విశేష పూజలు, భేరితాడనం, ధ్వజపటం, ఆస్థానం వంటి కైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఉదయం 10 నుండి 11 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, వివిధ పండ్లరసాలతో అభిషేకాలు నిర్వహించి విశేషారాధనలు చేపట్టారు. సాయంత్రం ఊంజల్‌సేవ భక్తులను ఆధ్యాత్మికానందంలో ముంచెత్తగా, రాత్రి 7 గంటల నుండి 9 గంటల వరకు పెద్దశేష వాహనసేవ వైభవంగా జరిగింది.బ్రహ్మోత్సవాల్లో ప్రధాన వాహన సేవలుగా రాత్రి పెద్దశేష వాహనంనిర్వహించారు. నేడు చిన్నశేష వాహనం, హంస వాహనం, జూన్ 4వ తేదీ రాత్రి 8.30 గంటలకు నిర్వహించే స్వామివారి కల్యాణోత్సవానికి టిటిడి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. విచ్చేసే భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం, ప్రసాదాల పంపిణీకి ప్రత్యేక చర్యలు చేపట్టారు.

## హనుమంత వాహనంపై గోవిందరాజస్వామి దివ్య విహారం



**తిరుమల,మే 28ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలో గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో గురువారం ఉదయం 7 గంటలకు గోవిందరాజస్వామి హనుమంత వాహనంపై దివ్యమంగళ స్వరూపంతో భక్తులకు దర్శనమిచ్చి అభయప్రదానం చేశారు.భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ వాహనసేవ అత్యంత వైభవంగా జరిగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి గోవింద నామస్మరణతో స్వామివారిని దర్శించుకుని పరవశించారు. త్రేతాయుగంలో శ్రీరాముడికి పరమభక్తుడిగా వెలుగొందిన హనుమంతుడు భక్తి, శక్తి, శరణాగతికి ప్రతీకగా నిలిచాడు. బుద్ధి, బలం, ధైర్యం, ఆరోగ్యం, నిర్భయత్వం, వాక్పటిమ హనుమత్స్మరణతో సిద్ధిస్తాయని పురాణాలు వివరిస్తున్నాయి. అందుకే స్వామివారు హనుమంత వాహనంపై విహరిస్తూ భక్తులకు శరణాగతి మహిమను చాటిచెప్పారు. అనంతరం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామికి స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు వసంతోత్సవం శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం స్వామివారు బంగారు తిరుచ్చిపై నాలుగు మాడ వీధుల్లో విహరించారు.

## తిరుమల ఆలయంపై హనుమంతుని రూపంలో మేఘమాల



**తిరుమల, మే 28ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగంలో సాక్షాత్తు కలియుగవైకుంఠంగా విరాజిల్లుతున్న తిరుమల శ్రీవారి ఆలయంపై అద్భుతమైన దృశ్యం కనువిందుచేసింది. ఎప్పుడో త్రాతాయుగంలో శ్రీరాముడి ఆజ్ఞమేరకు హనుమంతుడు సంజీవని పర్వతం ఎత్తుకొచ్చిన రీతిలో గురువారం వేకువజామున సుప్రభాతవేళ ఆకాశంలో ఆలయంపై మేఘమాల అదేరీతిలో ప్రత్యక్షమవ్వడం భక్తులను నివ్వెరపరచింది. ఈ అద్భుత దృశ్యాన్ని భక్తులు తమ సెల్‌ఫోన్‌లలో చిత్రీకరించి భక్తికి తన్మయత్వం చెందారు. నిజంగా కలియుగవైకుంఠంలో ఇదో దేవుని శక్తికి నిదర్శనమని భక్తులు కొనియాడారు.

## 12లక్షలమంది భక్తులు తలనీలాలు సమర్పణ

**- మే నెలలోనే అత్యధికంగా భక్తులు మొక్కులు చెల్లింపు**




**తిరుమల,మే 28ప్రభాతవార్తప్రతినిధి:** పుణ్యక్షేత్రం తిరుమలకు వస్తున్న భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా స్వామివారికి సమర్పించుకుంటున్న కానుకల్లో తలనీలాలు ఇవ్వడం మరింత విశ్వాసంతో కూడుకుంది. అసలే వేసవి సెలవులు ఆపై విపరీతమైన భక్తుల రద్దీ కొనసాగుతుండటంతో శ్రీవారి దర్శనాలతోబాటు తలనీలాలు సమర్పించుకున్న భక్తులు కూడా అధికంగానే ఉన్నారు. ఈ వేసవిలో 27రోజులకు గాను 12 లక్షల మంది పైగా భక్తులు తలనీలాలు సమర్పించుకోవడం విశేషం. టిటిడిలో ఈ రికార్డులు "నల్ల బంగారం"తిరగరాసింది. కల్యాణకట్టల్లో నిరంతరాయంగా క్షురకులు సేవలు అందిస్తున్నారు. కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామికి తలనీలాలు సమర్పించే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూ రికార్డు స్థాయికి చేరుకుంటోంది. ఈ "నల్ల బంగారాన్ని" గత సంవత్సరాల కంటే ఈ ఏడాది మే నెలలో అత్యధికంగా సమర్పించడం విశేషం. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టిటిడి పటిష్ట ఏర్పాట్లు చేపట్టి, నిరంతరాయంగా సేవలు అందిస్తోంది. ఈ ఏడాది మే నెలలో 27వ తేది వరకు 12,43,063 మంది భక్తులు తలనీలాలు సమర్పించడం విశేషం. గత ఏడాది 2024 మే నెలలో మొత్తం 10,65,729 మంది భక్తులు తలనీలాలు సమర్పించగా, 2025 మే నెలలో 10,18,370 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. ఇటీవల వేసవి సెలవులు, వారాంతపు రద్దీ కారణంగా తిరుమలలో భక్తుల రాక భారీగా పెరిగింది. మే 18 నుండి 23 వరకు వరుసగా ఆరు రోజుల పాటు ప్రతిరోజూ 50 వేలకుపైగా భక్తులు తలనీలాలు సమర్పించారు. ముఖ్యంగా మే 23వ తేదీన ఒక్కరోజే 57,580 మంది భక్తులు తలనీలాలు సమర్పించడం జరిగింది.

## జూన్ 4 నుండి ఆన్‌లైన్‌లో వస్త్రాలు ఇ వేలం



**తిరుమల,మే 28ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారి ఆలయంతో బాటు టిటిడి ఇతర అనుబంధ ఆలయాలకు భక్తులు కానుకగా సమర్పించిన వస్త్రాలు ఇ వేలం నిర్వహించనున్నారు. ఆలయాలకు భక్తులు సమర్పించుకున్న కొత్తవి / ఉపయోగించినవి / పాక్షికంగా దెబ్బతిన్నవి 147 లాట్ల వస్త్రాలు ,న్యూఆర్ట్‌సిల్క్‌చీరలు,సిల్క్ శారీలు జూన్ 4నుండి 6వతేదీ వరకు టిటిడి ఆన్‌లైన్‌లో ఇఎఐడి ఎన్ఒఎస్ 25918నుండి 25923 ఇ వేలం వేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఈ కొనుగోలు పోర్టల్ లో రిజిస్టర్ అయిన ఆసక్తి కల్గిన బిడ్డర్లు వస్త్రాల ఆన్‌లైన్‌లో పాల్గొనడానికి అర్హులు. స్థానిక జనరల్ మేనేజర్ (వేలములు) / ఎఇఒ(వేలములు), టిటిడి, హరేకృష్ణ మార్గ్ , తిరుపతిలో 0877 -2264429 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించాల్సి ఉంటుంది.

## కొనసాగుతున్న రద్దీ - శ్రీవారి సర్వదర్శనానికి 24గంటలు



**తిరుమల,మే 28ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో ఇష్టదైవమ్ శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. బుధవారం రాత్రివరకు 89,403 మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. కానుకల ద్వారా హుండీ ఆదాయం 4.99 కోట్ల రూపాయలు లభించింది. సర్వదర్శనానికి 24గంటల సమయం కంపార్ట్‌మెంట్లు నిండి క్యూ లైన్లు బయటకు చేరాయి. తిరుమల కొండభక్తులతో కిటకిటలాడుతోంది. వేసవి సెలవుల కారణంగా తిరుమలకు భక్తులు పోటెత్తడంతో రద్దీ కొనసాగుతోంది. తిరుమలకు వచ్చే భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదాన్ని 2.52 లక్షల మంది స్వీకరించారు. భక్తుల రద్దీ కారణంగా సర్వదర్శనం కోసం వేచి ఉండే సమయం గణనీయంగా ఉంది. టోకెన్లు లేని సర్వదర్శనం కోసం కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. దీంతో క్యూ లైన్లు బయట కృష్ణ తేజ గెస్ట్ హౌస్ వరకు విస్తరించాయి.

# నెల్లూరు హైవేపై ఘోర ప్రమాదం

## - బోల్తా పడిన టూరిస్ట్ బస్ - పలువురికి తీవ్ర గాయాలు

**నెల్లూరు క్రైం, మే 28, ప్రభాతవార్త** నెల్లూరు నగర పరిధిలో గురువారం ఒక ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చింతారెడ్డిపాళెం క్రాస్ రోడ్డు సమీపంలోని కలకత్తాచెన్నై జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న ఒక టూరిస్ట్ బస్సు ప్రమాదవశాత్తూ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఏలూరు నుంచి నాగపట్నం వెళ్తుండగా ప్రమాదం సేకరించిన సమాచారం మేరకు ఈ బస్సు పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు నుండి తమిళనాడులోని నాగపట్నం వైపు వెళ్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 45 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో 39 మంది వరకు ఈ ప్రమాదంలో గాయపడినట్లు సమాచారం. ఒక్కసారిగా బస్సు బోల్తా పడటంతో లోపల ఉన్న ప్రయాణికులు భయాందోళనలతో కేకలు వేశారు. ప్రమాదం జరిగిన వెంటనేస్థానిక ప్రజలు స్పందించి, క్షతగాత్రులను బస్సులోంచి బయటకు తీసేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను వేగవంతం చేశారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదానికి గల పూర్తి కారణాలు, డ్రైవర్ నిద్రమత్తే కారణమా లేదా సాంకేతిక లోపమా అనే విషయాలపై నార్త్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. బస్సు ప్రమాద విషయం తెలుసుకున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గాయపడి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. గాయపడిన వారు పశ్చిమగోదావరి జిల్లా దెందులూరు

నియోజకవర్గానికి చెందినవారు కావడంతో అక్కడ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో ఫోన్లో మాట్లాడి వీరి పరిస్థితి వివరించారు.

వారికి దగ్గరుండి వైద్యసాహం అందజేసి క్షేమంగా పంపిస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.



# పోలీసుల తనిఖీల్లో 30 కేజీలకు పైగా గంజాయి స్వాధీనం

## రెండు వేర్వేరు కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్ట్ వాహనం, మొబైల్ ఫోన్లు సీజ్

**ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా), మే 28 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణాపై ఇచ్ఛాపురం పట్టణ మరియు రూరల్ పోలీసులు గురువారం నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి మొత్తం 30.680 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.చిన్నం నాయుడు కేసు వివరాలు వెల్లడించారు. 28వ తేదీ సాయంత్రం 4.00 గంటల సమయంలో ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ పరిసరాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఇచ్ఛాపురం పట్టణ పోలీసు ఎస్.ఐ ఎం.ముకుందరావు, అనుమానాస్పదంగా సంచరిస్తున్న రాహుల్ విష్ణు ఇంగ్లే అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, అతని వద్ద నుండి 22.250 కేజీల గంజాయి మరియు ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితుడు మహారాష్ట్ర రాష్ట్రం జల్నా ప్రాంతానికి చెందినవాడని, ఒడిశా రాష్ట్రానికి చెందిన గంజాయి వ్యాపారులతో సంబంధాలు పెట్టుకొని బరంపురం - ఇచ్ఛాపురం మార్గంలో గంజాయిని తరలిస్తూ మహారాష్ట్రకు రవాణా చేస్తున్నట్లు వెల్లడించాడు. రైల్వే మార్గం ద్వారా గంజాయిని తరలించే క్రమంలో ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ వద్ద పోలీసులకు చిక్కినట్లు తెలిసింది. అలాగే 28వ తేదీ మధ్యాహ్నం 3.00 గంటల సమయంలో ఇచ్ఛాపురం మండలం ఎం.తోటూరు జంక్షన్ సమీపంలోని రైల్వే క్రాసింగ్ గేటు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న ఇచ్ఛాపురం రూరల్ పోలీసు ఎస్.ఐ ఆర్.జనార్ధనరావు, లికు బెహరా అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, అతని వద్ద నుండి 8.430 కేజీల గంజాయి, ఒక మొబైల్ ఫోన్ మరియు హోండా యాక్టివా స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితుడు తన అన్నయ్య గౌర బెహరాతో కలిసి ఒడిశా రాష్ట్రం ఖందమాల్ ప్రాంతం నుండి గంజాయిని తీసుకొచ్చి, రైల్వే మార్గం ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు వెల్లడించాడు. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు గంజాయిని తరలించే క్రమంలో పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది. జిల్లాలో గంజాయి అక్రమ రవాణా,

మత్తు పదార్థాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా పోలీసు శాఖ, ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగిస్తుందని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాలు మేరకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ప్రజలు అనుమానాస్పద వ్యక్తులు లేదా గంజాయి అక్రమ రవాణాపై సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు.

# మాజీ సిఎం పిఎ కెఎన్‌ఆర్‌ను విచారిస్తున్న సిట్

**విజయవాడ,మే 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో సంచలనం సృష్టిస్తున్న మద్యం కుంభకోణం కేసులో ఎప్పటికప్పుడు కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ కేసులో భాగంగా మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసిన కేఎన్‌ఆర్‌ను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. దీంతో ఆయన గురువారం విచారణకు హాజరయ్యారు. ఆయనను నిన్న కూడా సిట్ అధికారులు తొమ్మిదిగంటల పాటు విచారించినట్లు సమాచారం. ఈ విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. మద్యం కుంభకోణంలో భారీస్థాయిలో అక్రమాలు జరిగినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో లిక్కర్ ముఠా, వైసీపీ అధినేత మధ్య కెఎన్‌ఆర్ కీలక వారధిగా వ్యవహరించారని సిట్ అధికారులు చెబుతున్నారు. ఈ విషయంపై అధికారులు సమగ్రంగా విచారిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, కీలక వ్యక్తులతో సంబంధాలు, అనుమానాస్పద ఒప్పందాలపై సిట్ అధికారులు కేఎన్‌ఆర్‌ను ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. రెండోరోజు విచారణలో కూడా పలు కీలక అంశాలపై అధికారులు సమాధానాలు రాబడుతున్నట్లు తెలుస్తోంది. ఇవాళ సాయంత్రం వరకు విచారణ కొనసాగనుంది. అనంతరం ఆయనను అరెస్ట్ చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఈ విషయం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఈ మద్యం కుంభకోణం కేసు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పరస్పర ఆరోపణలు కొనసాగు తున్నాయి. ఈ కేసులో మరికొంతమంది కీలక వ్యక్తుల పేర్లు బయటకు వచ్చే అవకాశముందని సిట్ అధికారులు చెబుతున్నారు. సిట్ దర్యాప్తు వేగవంతం కావడంతో రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠత నెలకొంది.

# మహానాడు వేదికగా సిఎం చంద్రబాబు అబద్ధాల జాతర

## :వైఎస్సార్సీ అధికార ప్రతినిధి కామరాజ్ హరీష్

## - సొంత అజెండా శూన్యం, జగన్ పై ఏడ్వడమే పని

విజయవాడ,మే28,ప్రభాతతెలుగుదేశం పార్టీ పసుపు పండుగ"మహానాడు కాస్తా, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారిపై అడ్డగోలుగా నూరిపోసే విష ప్రచార వేదికగా మారిపోయిందని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధి కామరాజ్ హరీష్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం నాడు మీడియాకు విడుదల చేసిన ఓ పత్రిక ప్రకటనలో చంద్రబాబు, లోకేష్‌ల వైఖరిపై ఆయన నిప్పులు చెరిగారు. మహానాడులో తమ పార్టీ సంస్థాగత బలం గురించి మాట్లాడుకునే దమ్ములేక, ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు కేవలం "జగన్నామస్మరణ" చేయడమే పరమావధిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. వైఎస్ జగన్ గారి పేరు ఎత్తకుండా, ఆయనపై ఏడవకుండా చంద్రబాబుకు ముద్ద దిగడం లేదని హరీష్ కుమార్ ఎద్దేవా చేశారు. సూపర్ 6 ఒక పచ్చి మోసం - రెండేళ్ల బాబు పాలన దారుణ వైఫల్యం! ఎన్నికల నాడు అధికార దాహంతో ప్రజలకు అడ్డగోలు హామీలిచ్చి, నేడు రెండేళ్లు గడుస్తున్నా ఆ "సూపర్ 6" వాగ్దానాలను తుంగలో తొక్కారని హరీష్ కుమార్ మండిపడ్డారు. మహిళలకు నెలకు రూ. 1500 ఏమయ్యాయి? ఉచిత సిలిండర్లు, నిరుద్యోగ భృతి హామీలు ఏ కడలిలో కలిశాయి? ఇలాంటి ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా, నిస్సిగ్గుగా రెండేళ్లు పూర్తి చేసుకున్న చంద్రబాబు నాయుడుకు పేద ప్రజల కష్టాలు, కన్నీళ్లు పట్టవా అని నిలదీశారు. నమ్మి ఓట్లేసిన ప్రజలను దగా చేసినందుకు చంద్రబాబు, లోకేష్‌లు రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణచెప్పాలని డిమాండ్ చేశారు.

# అధికారులు తమ సామర్థ్యాలను మెరుగుపరచుకోవాలి : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా



**విజయవాడ, మే 28, ప్రభాతవార్త :** మారుతున్న కాలానికి అనుగుణంగా అధికారులు ఎప్పటికప్పుడు తమ సామర్థ్యాలను మెరుగుపరచుకోవాల్సి ఉందని ఎన్‌టిఆర్ కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా సూచించారు. ప్రభుత్వ సేవల్లో నాణ్యత పెంపు, సమర్ధవంతమైన పరిపాలన లక్ష్యంగా అధికారులు, సిబ్బందికి ప్రత్యేక సామర్థ్య నిర్మాణ సెషన్‌లు నిర్వహిస్తున్నారు. ఈమేరకు విజయవాడలోని కలెక్టరేట్ ఆవరణలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గురువారం స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల అమలు, కార్యనిర్వహణలో సమన్వయం, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాలపై శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. సిబ్బందిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించటంతోపాటు, బాధ్యతాయుత పనితీరు, డిజిటల్ సిల్క్స్‌ను పెంపొందించటం ఈశిక్షణ ముఖ్యఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో సైకాలజిస్టులు డాక్టర్ జి.శంకరరావు, డాక్టర్ టిఎస్.రావు, బి.నవితశ్రీ, వై.జ్యోతికృష్ణ తదితరులు పాల్గొన్నారు. +ఎన్‌టిఆర్ కీర్తిప్రతిష్టలు అజరామరం : తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహానేత మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి.రామారావు కీర్తిప్రతిష్టలు అజరామరమని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ జయంతి సందర్భంగా గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఎన్‌టిఆర్ వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఎన్‌టిఆర్ జిల్లాలో ఇళ్ళ జాబితా, ఇళ్ళగణన కార్యక్రమం సజావుగా సాగుతుందని కలెక్టర్ లక్ష్మీశా సంతృప్తి వ్యక్తం చేసారు. గురువారం విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో ఇళ్ళగణన కార్యక్రమాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలిచ్చారు. జిల్లాలో ప్రయివేటు రంగంలోనూ పారిశ్రామికవాడల అభివృద్ధికి చొరవ చూపిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశా తెలిపారు. పారిశ్రామికవేత్తలకు అనువైన స్థలాన్ని కేటాయించేందుకు జాయింట్ వెంచర్ విధానంలో ప్రభుత్వం ప్రయివేటు భూయజమానులతో కలసి పారిశ్రామివాడలు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రయివేటు రంగంలోని భూయజమానులతో కలిసి జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసి ప్రభుత్వం డెవలపర్‌గా వ్యవహరించి ఆభూమిలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించి పారిశ్రామికవాడగా అభివృద్ధి చేస్తామన్నారు.

# లేబూరులో కిడ్నాప్ కలకలం

## - నలుగురు చిన్నారుల అపహరణకు యత్నం

## - ఐదుగురు మహిళా కిడ్నాపర్లు గుర్తింపు

**ఇందుకూరుపేట (నెల్లూరు), మే 28, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం లేబూరు గ్రామంలో గురువారం భారీ కలకం రేగింది. గ్రామానికి చెందిన నలుగురు చిన్నారులను ఒక మహిళా ముఠా అపహరించేందుకు (కిడ్నాప్) యత్నించడం తీవ్ర సంచలనంగా మారింది. స్థానికులు సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఘటన వివరాల్లోకి వెళ్తే.. గురువారం రోజున లేబూరు గ్రామంలో నలుగురు చిన్నారులు ఆడుకుంటుండగా, ఐదుగురు గుర్తు తెలియని మహిళలు వారి వద్దకు చేరి అపహరించేందుకు ప్రయత్నించారు. చిన్నారుల కదలికలపై, ఆ మహిళల ప్రవర్తనపై అనుమానం వచ్చిన స్థానికులు తక్షణమే అప్రమత్తమయ్యారు. కిడ్నాపర్ల ప్లాన్‌ను తిప్పికొట్టి, చిన్నారులను వారి చొరవతో సురక్షితంగా రక్షించారు. చిన్నారులను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించిన ఐదుగురు మహిళా నిందితులపై ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్తులు, వారికి అక్కడికక్కడే దేహశుద్ధి చేశారు. అనంతరం ఈ ఘటనపై ఇందుకూరుపేట పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోగా, గ్రామస్తులు నిందితులను పోలీసులకు అప్పగించారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయని పోలీసులు తెలిపారు. పట్టుబడిన ఐదుగురు మహిళాకిడ్నాపర్లలో ఇద్దరిపై ఇప్పటికే పాత కిడ్నాప్ కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. ఈ ముఠా వెనుక ఉన్న అసలు సూత్రదారులు ఎవరు..? చిన్నారులను ఎక్కడికి తరలించేందుకు ప్లాన్ చేశారు..? అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ఘటనతో లేబూరు గ్రామ ప్రజలు ఒక్క సారిగా భయాందోళనకు గురయ్యారు.

# రాష్ట్రమంతటా ఘనంగా ఎన్టీఆర్ 103వ జయంతి ఉత్సవాలు

**విజయవాడ,మే28,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 103వ జయంతి ఉత్సవాలను టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. అన్నగారి జన్మస్థలం నిమ్మకూరులో ఎన్టీఆర్ బసవతారకం విగ్రహాలకు గ్రామస్థులతో కలిసి పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కర్నూలు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి టీజీ భరత్ పూలమాలలు వేశారు. నంద్యాల షాదీఖానాలో ఏర్పాటు చేసిన మహానాడు కార్యక్రమంలో మంత్రి ఫరూక్ కేక్ కట్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ముక్కామలలో ఎన్టీఆర్ విగ్రహాన్ని నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు ఆవిష్కరించారు. తిరుపతి టౌన్ క్లబ్ కూడలిలోని నటసార్వభౌముడి విగ్రహానికి టీడీపీ నేతలు పాలాభిషేకం చేశారు. కర్నూలు జిల్లా ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు తెలుగుదేశం కార్యకర్తలు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట ఉన్న నటసార్వభౌముడి విగ్రహానికి జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు పుష్పాంజలి ఘటించారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం టీడీపీ కార్యకర్తలు శకపురుషుడి విగ్రహానికి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. కృష్ణా జిల్లా కోడూరులో బైక్ ర్యాలీ చేపట్టారు. పార్టీ జెండాలు చేతబట్టి జోహార్ ఎన్టీఆర్, జై తెలుగుదేశం అంటూ నినదించారు. అసెంబ్లీలోని టీడీఎల్పీ కార్యాలయ సిబ్బంది ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. శాసనసభ ఆవరణలో సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్, ఇతర అసెంబ్లీ సిబ్బంది, మార్షల్స్ అన్నగారికి నివాళులర్పించారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన చిత్రకారుడు పణిదెపు వెంకటకృష్ణ ఎన్టీఆర్ తల్లిదండ్రులు లక్ష్మయ్య చౌదరి, వెంకట రామమ్మ పేర్లతో ఆయన చిత్రాన్ని గీశారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పూలమాల వేసి కేక్ కట్ చేశారు. హిందూపురంలో పార్టీ వ్యవస్థాపకుడి జయంతిని టీడీపీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాణసంచా కాలుస్తూ సందడి చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. విజయవాడ గొల్లపూడిలో దేవినేని ఉమామహేశ్వరరావు కేక్ కట్ చేశారు. గొల్లపూడి సెంటర్‌లో నిర్వహించిన టీడీపీ వ్యవస్థాపకుడి జయంతి వేడుకల్లో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వంసత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఏలూరు జిల్లా కైకలూరు మండలం తామరకొల్లులో తెలుగుదేశం శ్రేణులు ఏర్పాటు చేసిన నటసార్వభౌముడి విగ్రహాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఆ తర్వాత కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. నెల్లూరు టీడీపీ కార్యాలయంలో యుగపురుషుడి విగ్రహానికి ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్ రావు నివాళులర్పించారు.

# నేడు ఇ-సెట్ పరీక్ష ఫలితాలు

## పరీక్షలకు 95.94 శాతం హాజరు

**హైదరాబాద్, మే 28, ప్రభాతవార్త:** బీఈ, బీటెక్, బీ ఫార్మసీ కోర్సుల్లో నేరుగా ద్వితీయ సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించే ఈ సెట్-2026 ఫలితాలను నేడు(శుక్రవారం) విడుదల చేయనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి ఫలితాలను విడుదల చేయనున్నారని ఈ సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 15న ఈ సెట్-2026 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు 95.94 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ కళాశాలలలో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్, టెక్నాలజీ, ఫార్మసీ విభాగాలలో అందించే రెగ్యులర్ బీఈ, బీటెక్, బీ ఫార్మసీ కోర్సుల్లో లాటరల్ ఎంట్రీ ప్రవేశం కోసం డిప్లొమా, బీఎస్సీ(గణితం) డిగ్రీ అభ్యర్థుల కొరకు తెలంగాణ ఉన్నత విద్యా మండలి తరపున ఈ సెట్-2026 ప్రవేశ పరీక్షను నిర్వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఈ సెట్ పరీక్షను నిర్వహించింది.

# జూన్ 5 నుండి ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమంలో కృష్ణవేణి నదీ నవహారతులు



**ఇంద్రకీలాద్రి, మే 28, ప్రభాతవార్త :** జూన్ 5 నుండి ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమంలో కృష్ణవేణి నదీ నవహారతులు వైభవంగా పునఃప్రారంభిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. నవహారతుల కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా, ఘనంగా నిర్వహించడానికి దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, దేవస్థానం సహాయ కమిషనర్, పౌర సంబంధాల అధికారి, వైదిక కమిటీతో కలిసి ఉమ్మడిగా క్షేత్రస్థాయి పరిశీలన జరపి తగు సూచనలు ఆలయ స్థానాచార్యులు, వైదిక కమిటీ లిఖితపూర్వకంగా సమర్పించాలని ఈవో శీనా నాయక్ ఆదేశించారు.

- ఘాట్ రోడ్డు మరామత్తు పనుల వాయిదా: శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ఘాట్ రోడ్డు టోల్ గేట్ నుండి కొండపైకి ఘాట్ రోడ్డు పునరుద్ధరణ పనులు వాయిదా పడ్డాయి. వాతావరణ పరిస్థితి రీత్యా పనులు కొనసాగించలేమని ఆర్‌అండ్‌బీ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఈరోజు దేవస్థానం అధికారులకు లేఖ ద్వారా తెలియజేసారు.

మే 29 ఉదయం నుండి దేవస్థానం ఘాట్ రోడ్ వైపు వాహనాలు యధావిధిగా అనుమతిస్తామని ఇఓ తెలిపారు. - నిత్యాన్నదాన పథకానికి విరాళం: దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన కే జయశంకర్ శిరీష దంపతులు రూ1,81,116ల విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# సరిహద్దు జల వివాదాలను రాష్ట్రాలే పరస్పర సహకారంతో పరిష్కరించుకోవాలి

## ప్రగతి వెబ్‌కాస్ట్ సమావేశంలో ప్రధాని మోడీ రాష్ట్రాలకు సూచన



**న్యూఢిల్లీ, మే 28:** రాష్ట్రాల మధ్య తలెత్తే నీటి వివాదాలను పరస్పర సహకారం, సకాలంలో అనుమతులు ఇవ్వడం, సరికొత్త సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ ద్వారా పరిష్కరించుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. ఈ విషయంలో మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల మధ్య సాగుతున్న కెన్-బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు దేశానికే ఒక గొప్ప ఆదర్శంగా నిలవాలని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులతో నిర్వహించిన 51వ ప్రగతి వెబ్‌క్యాస్ట్ సమావేశంలో ప్రధాని కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షలో రైల్వేలు, విద్యుత్, రహదారి రంగాలకు చెందిన సుమారు రూ.30వేల కోట్ల విలువైన ఏడు భారీ ప్రాజెక్టుల పురోగతిని ప్రధాని సమీక్షించారు. ప్రభుత్వ పనుల అమలులో అనవసర జాప్యం చేయడం వల్ల ప్రాజెక్టు వ్యయం విపరీతంగా పెరిగిపోతుందని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. పనులు ఆలస్యమైతే ప్రజలకు అందాల్సిన సౌకర్యాలు సకాలంలో అందకుండా పోతాయని అధికారులను హెచ్చరించారు. నదుల అనుసంధానం, నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, ఆధునిక నీటిపారుదల పద్ధతుల ద్వారా దేశంలో దీర్ఘకాలిక నీటి భద్రతను సాధించేందుకు అన్ని రాష్ట్రాలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులపై ఫోకస్ విద్యుత్ రంగాన్ని సమీక్షించిన ప్రధాని పట్టణ ప్రాంతాల్లోని ఇళ్లు, నివాస సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రూఫ్‌టాప్ సోలార్ అమరికను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. కరెంట్ బిల్లుల ఖర్చును తగ్గించడానికి, ఇంధన భద్రతను పెంచడానికి క్లీన్ ఎనర్జీని ఒక మిషన్ మోడ్ ఉద్యమంలా చేపట్టాలన్నారు. ఇందులో భాగంగానే సాగునీటి కాలువల వెంబడి, కాలువలపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసే సరికొత్త విధానాన్ని అన్వేషించాలని రాష్ట్రాలకు సూచించారు. దీనివల్ల అదనపు భూమి అవసరం లేకుండానే విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని, ఎండ తీవ్రతకు నీరు ఆవిరైపోకుండా అడ్డుకోవచ్చని వివరించారు. దేశ ప్రవేశ ద్వారంగా వధావన్ పోర్ట్ మహారాష్ట్రలో నిర్మిస్తున్న ప్రతిష్టాత్మక వధావన్ పోర్ట్ ప్రాజెక్టును కేవలం ఒక ఓడరేవులా కాకుండా, భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా మల్టీమోడల్ లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దాలని ప్రధాని ఆదేశించారు. ఈ ప్రాజెక్టు తీరప్రాంత షిప్పింగ్, అంతర్గత జలమార్గాలు, ప్రత్యేక సరుకు రవాణా కారిడార్లు, హైస్పీడ్ రైళ్లు, జాతీయ రహదారులు, విమానాశ్రయాలతో సజావుగా అనుసంధాన మవ్వాలన్నారు. ఇది భారతదేశ రవాణా రంగానికి ఒక అంతర్జాతీయ ప్రవేశ ద్వారంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్వచ్ఛ భారత్ 2.0 విజయవంతం కావాలి కేవలం మౌలిక వసతుల కల్పనతోనే సరిపెట్టకుండా, నిరంతర పర్యవేక్షణ, ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ భారత్ మిషన్అర్బన్ 2.0 లో స్పష్టమైన ఫలితాలు సాధించాలని మోదీ నొక్కిచెప్పారు. పట్టణాల్లో తడి, పొడి వ్యర్థాల శుద్ధి కర్మాగారాలు, గోబర్ధన్ ప్లాంట్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించారు. కేంద్ర విభాగాలు, రాష్ట్రాలు మరింత చురుకైన కాలపరిమితి విధానాన్ని అనుసరిస్తూ అడ్డంకులను తొలగించాలని కోరారు. ఎన్టీఆర్ జయంతి వేళ ప్రధాని మోడీ ట్వీట్ సమావేశం ప్రారంభంలో క్యాబినెట్ కార్యదర్శి టీవీ సోమనాథన్ మాట్లాడుతూ ప్రధాని ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయిలో సామాజిక రంగ పథకాలపై ప్రతి నెలా సమీక్ష జరిపే నూతన పర్యవేక్షక వ్యవస్థ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. క్షేత్రస్థాయిలో జవాబుదారీతనాన్ని పెంచే ఈ కొత్త విధానంలో భాగంగానే, స్వచ్ఛ భారత్ మిషన్ అమలు.

# జూన్ 2న విలీనం కోసం అపాయింటెడ్ డేట్ ప్రకటించాలి

## రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను చెల్లించేలా చూడాలి ఎంపి వేం నరేందర్‌రెడ్డికి ఆర్టీసీ జెఏసి విజ్ఞప్తి

గి**హైదరాబాద్, మే 28, ప్రభాతవార్త:** ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం కోసం జూన్ 2న అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించే విధంగా ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆర్‌టీసీ జేఏసీ నేతలు రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డిని కోరారు. జేఏసీ నేతలు గురువారం వేం నరేందర్ రెడ్డి నివాసంలో కలసి ఆర్‌టీసీ ప్రభుత్వంలో విలీనంపై పలు అంశాలను పొందపరిచిన వినతిపత్రాన్ని ఇచ్చారు. ఆయనతోపాటు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రఘు రామ్ రెడ్డినీ కలిసిన జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం థామస్ రెడ్డి, కో కన్వీనర్ బి యాదగిరి, వి బాబు, ఎన్ బుద్ధ విశాల్, జి రవికిరణ్ కలిసి ప్రస్తుత ఆర్టీసీ విలీనం గురించి జరుగుతున్న పరిణామాలపై క్షుణ్ణంగా వివరించినట్టు జేఏసీ నేతలు తెలిపారు. జేఏసీ నాయకులను ఉద్దేశించి వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను తప్పకుండా నిలబెట్టుకుంటుందని స్పష్టత ఇచ్చారని జేఏసీ నాయకులు తెలిపారు. అలాగే జూన్ 2 తేదీన అపాయింటెడ్ డేట్ ప్రకటన గురించి, విలీన విధి విధానాలకోసం అధికారులు, కార్మిక సంఘాలతో కమిటి వేసి, విలీనం సక్రమంగా చేపించేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఆంధ్రాలో ఆర్టీసీ ఉద్యోగులకు జరిగిన నష్టం తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు జరుగకుండా కార్మిక సంఘాలు, అధికారులు , తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారన్నారు. విలీనంతో ఆర్టీసీ కార్మికులకు మేలు చేయాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారని అందుకు సక్రమంగా, సజావుగా విలీనం జరగడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని భరోసా ఇచ్చారన్నారు. విలీనం గురించి కార్మికుల్లో ప్రస్తుతం నెలకొన్న గందరగోళ పరిస్థితుల గురించి పూర్తి వివరాలు జేఏసీ నాయకులు వివరిస్తున్నపుడు ఎంతో ఓపికతో విని ఆర్టీసీ కార్మికుల మనోభావాలను చిరకాల ఆకాంక్షను సహృదయంతో అర్థం చేసుకొని విలీనంపై స్పష్టమైన హామీ ఇచ్చినందుకు ఆర్టీసీ కార్మికుల పక్షాన హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని జేఏసీ నేతలు తెలిపారు.

# సుప్రీం కోర్టుకు కొత్తగా ఐదుగురు న్యాయమూర్తులు

## సుప్రీం కొలీజియం సిఫారసులు

**న్యూఢిల్లీ, మే 28:** సుప్రీంకోర్టుకు కొత్తగా ఐదుగురు న్యాయమూర్తుల నియా మకానికి రంగం సిద్ధం అయింది. సర్వోన్నత న్యాయస్థానంలో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల పోస్టుల భర్తీకి సుప్రీంకోర్టు కొలీజియం కసరత్తు చేపట్టింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని కొలీ జియం, నలుగురు సీనియర్ హైకోర్టు న్యాయమూర్తులను, ఒక సీనియర్ న్యాయవాదిని సుప్రీంకోర్టు జడ్జీలుగా నియమించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈ జాబితాలో పంజాబ్ హరియాణా హైకోర్టు సీజే జస్టిస్ షీల్ నాగు, బాంబే హైకోర్టు సీజే జస్టిస్ శ్రీచంద్రశేఖర్, మధ్యప్రదేశ్ హైకోర్టు సీజే జస్టిస్ సంజీవ్ సచ్ దేవ, జమ్మూ కశ్మీర్ లడఖ్ సీజే జస్టిస్ అరుణ్ పల్లి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వి. మోహన ఉన్నారు. సుప్రీంకోర్టులో పేరుకుపోయిన కేసుల భారాన్ని తగ్గించి, న్యాయ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఈ నియామకాలు అత్యంత కీలకమని కొలీజియం తన సిఫార్సులో పేర్కొంది. కొలీజియం పంపిన ఈ జాబితాను కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ పరిశీలించి, కేబినెట్ ఆమోదం కోసం పంపుతుంది. కేంద్ర కేబినెట్ ఆమోదం అనంతరం, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేయగానే ఈ నియామకాలు ఖరారవుతాయి.



# శుభ్‌మన్-సుదర్శన్ నిలకడా..
# వైభవ్-యశస్వీ విధ్వంసమా?



**నేడు క్వాలిఫయర్-2లో రాజస్థాన్, గుజరాత్ ఢీ * మ్యాచ్ రాత్రి 7.30 గంటలకు**

**గుజరాత్ టైటాన్స్ కీలక ఆటగాళ్లు**

సాయి సుదర్శన్ 157.86 స్ట్రయిక్ రేట్‌తో 652 రన్స్
శుబ్‌మన్ గిల్ 159.27 స్ట్రయిక్ రేట్‌తో 618 రన్స్
జాస్ బట్లర్ 159.10 స్ట్రయిక్ రేట్‌తో 498 రన్స్
వాషింగ్టన్ సుందర్ 151.70 స్ట్రయిక్ రేట్‌తో 311 రన్స్
కగిసో రబడ 9.48 ఎకానమీతో 26 వికెట్లు
రషీద్‌ఖాన్ 8.77 ఎకానమీతో 19 వికెట్లు
మహ్మద్ సిరాజ్ 896 ఎకానమీతో 17 వికెట్లు
జేసన్ హోల్డర్ 7.63 ఎకానమీతో 15 వికెట్లు

**రాజస్థాన్ రాయల్స్ కీలక ఆటగాళ్లు**

వైభవ్ సూర్యవంశీ 242.85 స్ట్రయిక్ రేట్‌తో 680 రన్స్
యశస్వీ జైస్వాల్ 153.23 స్ట్రయిక్ రేట్‌తో 426 రన్స్
ధృవ్ జురెల్ 155.35 స్ట్రయిక్ రేట్‌తో 508 రన్స్
రియాన్ పరాగ్ 156.84 స్ట్రయిక్ రేట్‌తో 298 రన్స్
జోఫ్రా ఆర్చర్ 9.17 ఎకానమీతో 24 వికెట్లు
బ్రిజేష్ శర్మ 9.70 ఎకానమీతో 13 వికెట్లు
నాండ్రే బర్గర్ 10.25 ఎకానమీతో 13 వికెట్లు
రవీంద్ర జడేజా 8.03 ఎకానమీతో 10 వికెట్లు

**న్యూచండీఘర్:** ఐపీఎల్ రెండో క్వాలిఫయర్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. నేడు జరిగే ఈ కీలక పోరులో రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్ జట్లు తలపడనున్నాయి. క్వాలిఫయర్-1లో ఘోర పరాజయంతో గుజరాత్ ఈ మ్యాచ్‌కు వస్తే... ఇక్కడే జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో భారీ విజయంతో రాజస్థాన్ రాయల్స్ విజయోత్సవంతో బరిలోకి దిగుతోంది. బ్యాటింగ్, బౌలింగ్‌లో సమవుజ్జీలుగా ఉన్న ఈ జట్ల పోరు ఉత్కంఠ రేపుతోంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టు ఫైనల్‌కు చేరుకుంటుంది.

**గిల్-సుదర్శన్ ఒకవైపు, వైభవ్-యశస్వీ మరోవైపు**

ఈ మ్యాచ్‌లో సెంటరాప్ అట్రాక్షన్‌గా ఓపెనింగ్ జోడీలు నిలుస్తున్నాయి. ఒకవైపు నిలకడగా ఆడుతూ ఇన్నింగ్స్‌ను నిర్మించే ఓపెనింగ్ జోడీ గుజరాత్‌ది కాగా, మరోవైపు ఆరంభం నుంచే బౌలర్లపై విరుచుకుపడే విధ్వంసకర ఓపెనింగ్ జోడీ రాజస్థాన్‌ది. క్వాలిఫయర్-1లో మినహాయిస్తే గిల్-సుదర్శన్ జోడీ అద్భుత ఆరంభాలను అందిస్తూ గుజరాత్ విజయాల్లో కీ రోల్ పోషించారు. ఈ ఇద్దరూ క్రీజ్‌లో నిలబడితే ఆ తర్వాత గేర్ మార్చి వేగంగా పరుగులు సాధించగల దిట్టలు. ఇక యశస్వీ జైస్వాల్-వైభవ్ సూర్యవంశీది దూకుడే మంత్రం. పవర్ ప్లే ఆరు ఓవర్లలోనే మ్యాచ్ స్వరూపాన్ని మార్చి రాయల్స్ విజయాలకు బాట వేస్తున్నారు. ముఖ్యంగా అందరి చూపు ఇపుడు వైభవ్ సూర్యవంశీపైనే. ఈ చిచ్చరపిడుగును ఎంత తొందరగా పెవిలియన్‌కు చేరిస్తే అంత సేఫ్ అన్నట్లుగా ప్రత్యర్థి జట్ల మైండ్‌సెట్ మారింది. లేదంటే గెలుపుపై ఆశలు వదులుకోవాల్సిందే.

**ఇరు జట్లను వేధిస్తున్న మిడిల్ ఆర్డర్**

గుజరాత్‌లో టాప్ ఆర్డర్‌లో గిల్, సుదర్శన్, జోస్ బట్లర్ చక్కని ఫామ్‌లో ఉన్నారు. ఒకవేళ వీరు విఫలమైతే ఆదుకునే స్ట్రాంగ్ మిడిల్ ఆర్డర్‌లో నిలకడగా ఆడగల ప్లేయర్ లేకపోవడం జీటీకి బలహీనతగా మారింది. వాషింగ్టన్ సుందర్ మినహా ఎవరూ చెప్పుకోదగ్గర బ్యాటర్ లేకుండా పోయాడు. జీటీతో పోలిస్తే రాజస్థాన్ కాస్త బెటర్. ఓపెనర్లతో పాటు ధృవ్ జురేష్, కెప్టెన్ రియాన్ పరాగ్ చక్కని పామ్‌లో ఉన్నారు. ఆ తర్వాత వచ్చే ఫెరీరా, జడేజా పరుగులు సాధించగలరు.

**బౌలింగ్‌లో జీటీ స్ట్రాంగ్. ఆర్చర్‌పైనే రాయల్స్ భారం**

బౌలింగ్ డిపార్ట్‌మెంట్‌కు వస్తే రాజస్థాన్ కంటే గుజరాత్ బలంగా ఉంది. బ్యాటర్లు విఫలమైన చోట బౌలర్లు విజయాలు అందిస్తున్నారు. ముఖ్యంగా కగిసో రబడ(26), మహ్మద్ సిరాజ్(17) ఆరంభంలోనే వికెట్లు తీస్తూ జట్టు విజయాల్లో కీ రోల్ పోషిస్తున్నారు. మిడిల్ ఓవర్లలో స్పిన్ మంత్ర రషీద్ ఖాన్ అండ ఉంది. జేసర్ హోల్డర్, వాషింగ్టన్ సుందర్ రూపంలో పేస్-స్పిన్ అటాక్ కలిగి ఉంది. రాజస్థాన్ విషయానికి వస్తే జోఫ్రా ఆర్చర్‌పైనే ఎక్కువగా ఆధారపడుతోంది. నాండ్రే బర్గర్ చేరిన తర్వాత రాయల్స్ పేస్ అటాక్ బలం పెరిగింది. బ్రిజేష్‌తో పాటు స్పిన్నర్లు రవీంద్ర జడేజా, యశ్ రాజ్ పుంజా మెరుగైన ప్రదర్శన ఇస్తున్నారు.

**ముఖాముఖిలో గుజరాత్‌దే పైచేయి**

ఇప్పటి వరకు ఐపీఎల్‌లో ఈ రెండు జట్లు 10సార్లు తలపడగా, గుజరాత్ 7 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. రాజస్థాన్ మూడు విజయాలకే పరిమితమైంది. ఈ ఐపీఎల్ సీజన్‌లో తలపడినపుడు గుజరాత్ గెలుపొందింది. గణాంకాలు గుజరాత్‌కు అనుకూలంగా ఉన్నప్పటికీ, ప్రస్తుత ఫామ్ దృష్ట్యా మరో ఉత్కంఠభరిత పోరు ఖాయంగా కనిపిస్తోంది.

## కార్ల్‌సన్‌కు చెక్ పెట్టిన ప్రజ్ఞానంద



**ఓస్లో:** భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద నార్వే చెస్ టోర్నీలో సంచలనం సృష్టించాడు. ప్రపంచ నెంబర్ వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌పై అద్భుత విజయం సాధించారు. 3 పాయింట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక వరల్డ్ చాంపియన్ గుకేశ్ మాత్రం మరో పరాజయం పొందాడు

ఏడు సార్లు చాంపియన్ అయిన మాగ్నస్ కార్ల్‌సన్ ఆయన సొంత దేశంలోనే మళ్లీ ఓడించారు. గత ఏడాది కూడా ఇక్కడే కార్ల్‌సన్‌పై ప్రజ్ఞానంద గెలుపొందాడు. ఇటీవల రొమేనియాలోని బుచారెస్ట్‌లో జరిగిన సూపర్‌బెట్ చెస్ క్లాసిక్ టోర్నీలో ప్రజ్ఞానంద విజయం సాధించారు. ఆ ఆత్మవిశ్వాసంతోనే తాజాగా నార్వే చెస్ టోర్నీలో అడుగుపెట్టాడు. నార్వే చెస్‌లో క్లాసిక్ విభాగంలో రెండోసారి ప్రజ్ఞానంద గెలుపొందాడు. ప్రస్తుతం కార్ట్‌సన్ కేవలం 1.5 పాయింట్లతో పోరాడుతున్నారు. ఇక భారత గ్రాండ్‌మాస్టర్ గుకేశ్‌పై విజయం సాధించిన ఫిరౌజా ప్రస్తుతం టోర్నీలో టాప్ ప్లేస్‌లో దూసుకెళ్తున్నాడు. అతను క్లాసిక్ గేమ్‌లో కీలకమైన 1.5 పాయింట్లు సాధించి మొత్తం 7.5 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నారు. నేడు నాలుగో రౌండ్‌లో గుకేశ్, కార్ట్‌సన్ మధ్య మ్యాచ్ జరగనున్నది. ఈ మ్యాచ్‌పైనే అందరి దృష్టి నెలకొన్నది.

## రెండో రౌండ్లోనే నిష్క్రమించిన సినర్



**పారిస్:** ఎర్రమట్టి సమరం ఫ్రెంచ్ ఓపెన్‌లో సంచలనం నమోదైంది. టాప్ సీడ్ జానిక్ సినర్ రెండో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. ప్రపంచ నెంబర్ వన్ సినర్ వరుస 30 విజయాల పరంపరకు అర్జెంటీనా ప్లేయర్ జువాన్ మాన్యుయెల్ సెరుండోలో బ్రేక్ వేశాడు. అయిదు సెట్ల పోరులో 3-6, 2-6, 7-5, 6-1, 6-1తో సినర్‌ను ఓడించి మూడో రౌండ్లో ప్రవేశించాడు. మొదటి రెండు సెట్లను అలవోకగా నెగ్గిన జానిక్ సినర్ మూడో సెట్‌లోనూ 5-1తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచి విజయం దిశగా దూసుకుపోతున్నట్లు కనిపించాడు. ఈ దశలో సినర్‌ను పారిస్ లోని తీవ్రమైన వేడి పరిస్థితులతో డీహైడ్రేషన్ దెబ్బతీశాయి. ఆ తర్వాత అతని ఆటలో వేగం తగ్గింది. ఇదే అదనుగా సెరుండోలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. మూడో సెట్‌ను 7-5తో ముగించాడు. ఆ తర్వాతి సెట్లను కూడా అలవోకగా 6-1, 6-1తో గెలుపొందాడు. దీంతో సినర్‌కు అనూహ్య ఓటమి ఎదురైంది. ఆస్ట్రేలియన్ ఓపెన్, యుఎస్ ఓపెన్, వింబుల్డన్ టైటిళ్లను నెగ్గిన సినర్ కెరీర్ గ్రాండ్ సాధించాలన్న కలలు కల్లలయ్యాయి.

## క్వార్టర్ ఫైనల్లో సింధూ, లక్ష్యసేన్

**సింగపూర్:** భారత అగ్రశ్రేణి షటర్లు పీవీ సింధూ, లక్ష్య సేన్... సింగపూర్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించారు. మహిళల సింగిల్స్ ప్రి క్వార్టర్ ఫైనల్లో సిందూ..వరుస గేముల్లో 21-9, 21-12తో జేపాన్‌కు చెందిన రికో గుంజినిని ఓడించి ముందంజ వేసింది. మొదటి గేమ్ నుంచి సింధూ జోరు చూపింది. ఆమె స్మాష్‌లకు రికో వద్ద జవాబు లేకపోయింది. 37 నిమిషాల్లోనే పోరు ముగించిన సింధూ క్వార్టర్ ఫైనల్స్‌లో టాప్ సీడ్ ఆన్ సెయంగ్‌తో తలపడనుంది.

పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ కూడా క్వార్టర్ ఫైనల్ చేరాడు. కున్లావుట్ విటిడ్సార్న్ (థాయిలాండ్)తో మ్యాచ్‌లో లక్ష్యసేన్ జోరు మొదటి రెండు పాయింట్లు నెగ్గాడు. ఆ తరుణంలో పిక్క కండరాలుపట్టేయడంతో కున్లావత్ మ్యాచ్ నుంచి వైదొలిగాడు. లక్ష్యసేన్ క్వార్టర్ ఫైనల్లో జపాన్ షట్లర్ కోకి వటనాబేతో తలపడతాడు.



ఇక పురుషుల డబుల్స్ జోడీ సత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి, మిక్స్‌డ్ డబుల్స్ జోడీ ధ్రువ్ కపిల-తనిషా క్రాస్టో కూడా గెలుపొంది క్వార్టర్ ఫైనల్స్

# ఎఐ కంటే మానవ వనరులే బెటర్

**న్యూఢిల్లీ, మే 28:** కృత్రిమ మేధస్సు(ఏఐ)పై చాలామంది అభిప్రాయం ఒక్కటే.. దీనిని అంగీకరిస్తే నిర్వహణ ఖర్చులు తగ్గుతాయి. మానవ ఉద్యోగికి కంపెనీ చెల్లించాల్సిన దానికంటే ఏఐ ఖర్చు తక్కువగా ఉంటుంది. ఏఐ ఉత్పాదకతను పదిరెట్లు లేదా అంతకంటే ఎక్కువ పెంచుతుంది. కానీ 2026లో ఏఐ వాస్తవికత మరోలా ఉంది. ఉత్పాదకత పది రెట్లు పెరుగడానికి బదులు ఏఐ ఖర్చు విపరీతంగా పెరిగింది. క్లాడ్ వంటి ఏఐ టూల్స్ ఉపయోగించడం కంటే సమర్థుడైన ఒక ఉద్యోగికి జీతం ఇవ్వడమే చౌక అని కొందరు పరిశ్రమ నిపుణులు సూచిస్తున్నారు. ఏఐకి సంబంధించిన ఖర్చుల సమస్య ఎంత తీవ్రంగా మారిందంటే మైక్రోసాఫ్ట్, ఉబర్ వంటి దిగ్గజ కంపెనీలు కూడా తమ ఏఐ ఖర్చులను సమర్థించుకోవడానికి కష్టపడుతున్నాయి. గతవారం వచ్చిన కొన్ని నివేదికలు ఏఐ వల్ల వచ్చే ప్రయోజనాలు, దానికి అవుతున్న ఖర్చులకు మధ్య ఉన్న అసమతుల్యతను కంపెనీలు గమనించడం ప్రారంభించినట్లు పేర్కొన్నాయి. మైక్రోసాఫ్ట్ మేనేజ్‌మెంట్ వేలాది మంది ఇంజినీర్లను క్లాడ్ కోడ్ వాడడం ఆపేసి అంతర్గత ఏఐ టూల్‌ను ఉపయోగించాల్సిందిగా కోరింది. దీనికి జూన్30ని గడువుగా విధించారు.

**పునఃసమీక్ష చేసుకుంటున్న కంపెనీలు**




తమ ఉద్యోగులపై క్లాడ్ కోడ్‌ను రుద్దిన కేవలం కొన్ని నెలలకే మైక్రోసాఫ్ట్ ఎందుకు ఆంత్రోపిక్ టూల్ నుంచి తప్పుకొంటున్నదో బహిరంగంగా వ్యాఖ్యానించనప్పటికీ ఉద్యోగులు క్లాడ్ కోడ్ టోకెన్ల కోసం విపరీతంగా డబ్బు ఖర్చు చేస్తుండడమే దీనికి కారణమని నివేదికలు సూచిస్తున్నాయి. ప్రస్తుతం సొంత ఏఐ స్టార్టప్ నడుపుతున్న ఇన్ఫోసిస్ మాజీ అధినేత విశాల్ సిక్కా మాట్లాడుతూ టోకెన్ ఖర్చులు నిజమైన సమస్యగా మారుతున్నాయి. భవిష్యత్తులో ఏఐ వినియోగంపై మరింత నిఘా ఉంటుందని అన్నారు. ఏఐ స్టార్టప్ ఫెక్సో జెన్ ఏఐ వ్యవస్థాపకుడు, సీఈవో కౌస్తుబ్ కశ్యప్ మాట్లాడుతూ మైక్రోసాఫ్ట్, ఉబర్ బడ్జెట్ పరిమితులు దాటిపోవడం ఒక మార్పునకు సంకేతం. ఏఐ ప్రయోగాలు ముగిశాయి. వాస్తవికత మొదలైంది. హనీమూన్ పీరియడ్ అయిపోయింది.

2026లో గూగుల్, ఆంత్రోపిక్, ఓపెన్ ఏఐలపై ఏఐకి సంబంధించిన ఆదాయాన్ని చూపించాలనే ఒత్తిడి పెరుగుతుండడంతో, అవి తమ క్లయింట్ల కోసం టోకెన్ ఆధారిత ధరల విధానానికి మారుతున్నాయి. ఇంతకుముందు ధరల విధానంలో ఏఐ కంపెనీలు సబ్సిడీ ఇచ్చేవి. నెలకు కేవలం 200 డాలర్లు చెల్లించే వినియోగదారుడి కోసం క్లాడ్, చాట్ జీపీటీలను రన్ చేయడానికి దాదాపు 1500 నుంచి 5000 డాలర్ల వరకు ఖర్చవుతుందని అంచనా వేశారు. క్లాడ్ నుంచి జెమిని వరకు అందరూ స్థిరమైన నెలవారీ లేదా వార్షిక రుసుముకు బదులుగా టోకెన్ ఆధారిత ధరలకు మారుతున్నారు.

ఏఐతో ప్రపంచంలోనే అతిపెద్ద కంపెనీగా అవతరించిన ఎన్విడియా ఐప్లెడ్ డీప్ లెర్నింగ్ వైస్ ప్రెసిడెంట్ బ్రయాన్ మాట్లాడుతూ ఏఐ ఖర్చు, ఉద్యోగుల ఖర్చు కంటే చాలా ఎక్కువగా ఉందని పేర్కొన్నారు.



## స్టాక్ మార్కెట్లలో భారత్‌ను దాటేసిన తైవాన్

## ఐదులక్షల కోట్ల డాలర్ల టర్నోవర్

న్యూఢిల్లీ, మే 28:ప్రపంచ స్టాక్ మార్కెట్లలో భారత్‌కు అనూహ్యంగా ఎదురుదెబ్బ తగిలింది. మార్కెట్ విలువ పరంగా భారత్‌ను అధిగమించిన చిన్న దేశం తైవాన్ ప్రపంచంలో ఐదో అతిపెద్ద స్టాక్ మార్కెట్‌గా అవతరించింది. తైవాన్ మార్కెట్ విలువ 5 లక్షలకోట్ల డాలర్లకు చేరువ కాగా, భారత మార్కెట్ క్యాపిటలైజేషన్ 4.92 లక్షలకోట్ల డాలర్లకే పరిమితమైంది. దీనివల్ల భారత్ ఆరో స్థానానికి పడిపోయింది. ప్రస్తుతం ఈ జాబితాలో అమెరికా77.95 ట్రిలియన్ డాలర్లతో అగ్రస్థానంలో ఉండగా, చైనా, జపాన్, హాంకాంగ్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. తైవాన్ ఈ ఘనత సాధించడం వెనుక కృత్రిమ మేధ, సెమీకండక్టర్ల బూమ్ కీలక పాత్ర పోషించాయి. ప్రపంచంలోనే అతిపెద్ద కాంట్రాక్ట్ చిప్ తయారీ సంస్థ అయిన తైవాన్ సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ టిఎస్ఎంసి షేర్లు గత ఏడాదిలో 130 శాతం మేర పెరిగాయి. ఎన్విడియా, యాపిల్ వంటి టెక్ దిగ్గజాలకు ఏఐ చిప్‌లను సరఫరా చేస్తుండటంతో గ్లోబల్ ఇన్వెస్టర్లు తైవాన్ మార్కెట్‌పై భారీగా పెట్టుబడులుపెట్టారు. భారత మార్కెట్లు ప్రతికూలతలను ఎదుర్కొంటున్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ఇంధన ధరల పెరుగుదల, రూపాయి క్షీణత వంటి కారణాలతో ఈ ఏడాది సెన్సెక్స్, నిఫ్టీలు 8 శాతం వరకు నష్టపోయాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులను విత్‌డ్రా కూడా ఒత్తిడి పెంచుతోంది. దేశీయ రిటైల్ ఇన్వెస్టర్లు, మ్యూచువల్ ఫండ్ సిప్‌ల రూపంలో వస్తున్నపెట్టుబడులు భారతమార్కెట్‌కు అండగా నిలుస్తున్నాయని నిపుణుల అంచనా.

## అంతరిక్షరంగంలో అభ్యోమ్ స్టార్టప్ రికార్డు

**ముంబయి, మే 28:** భారత అంతరిక్ష రంగంలో హైదరాబాద్‌కు చెందిన స్పేస్‌టెక్ స్టార్టప్ అబ్యోమ్ స్పేస్‌టెక్ డిఫెన్స్ రికార్డు సాధించింది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన రీయూజబుల్ లిక్విడ్ రాకెట్ ఇంజిన్ క్వాలిఫికేషన్ టెస్ట్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు సంస్థ ప్రకటించింది. ఈ విజయం, అంతరిక్ష ప్రయోగాల వ్యయాన్ని గణనీయంగా తగ్గించే సాంకేతికతలో భారత్ ముందడుగు వేయడానికి దోహదపడనుంది. కంపెనీకి చెందిన కమర్షియల్ టెస్ట్ ఫెసిలిటీలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ విజయం, త్వరలో చేపట్టనున్న 'హోవ్' వర్టికల్ టేకాఫ్ అండ్ వర్టికల్ ల్యాండింగ్ అనే పునర్వినియోగ రాకెట్ ప్రాజెక్టుకు, క్రయోజెనిక్ ఇంజిన్ అభివృద్ధికి ఎంతగానో సహాయపడుతుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈపరీక్షల్లో వాడిన ఇంజిన్ సిస్టమ్స్, కంట్రోల్ ఆర్కిటెక్చర్ సహా అన్ని పరికరాలను తమ ఇంజనీరింగ్ బృందమే దేశీయంగా తయారు చేసిందని అబ్యోమ్ వెల్లడించింది. సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో జైనుల్ అబిదీన్ మాట్లాడుతూ భారత్‌లో స్వదేశీ పునర్వినియోగ ప్రొపల్షన్ వ్యవస్థల నిర్మాణంలో ఈ పరీక్షలు చాలా కీలకమని అంతరిక్ష ప్రయోగాల ఖర్చును భారీగా తగ్గించడంలో ఇవి సహాయపడతాయి. తక్కువ ఖర్చుతో కూడిన రీయూజబుల్ స్పేస్‌ఫ్లైట్ కోసం టెక్నాలజీని మరింత ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు. బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్ ఇంక్యుబేటర్ నుంచి అబ్యోమ్ స్టార్టప్ ప్రారంభమైంది. ఈ సంస్థకు ఐఐటీ మద్రాస్, ఐఐటీ బాంబేతో పాటు డీఎస్‌టీ, ఇస్రో, మెయిటీ వంటి ప్రభుత్వ సంస్థల నుంచి మద్దతు లభిస్తోంది. క్రయోజెనిక్ ఇంజిన్ల అభివృద్ధిపై ఫోకస్ పెడుతున్నట్లు వెల్లడించింది.

## రిటైల్ బంకులకు వస్తున్న కంపెనీల బయ్యర్లు
## రోజుకు రూ.550 కోట్ల నష్టం భరిస్తున్న ఓఎంసీలు

**న్యూఢిల్లీ, మే28:** అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ, దేశీయంగా సామాన్యులపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు (పీఎస్‌యూలు) పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ అమ్మకాలపై రోజుకు సుమారు రూ.550 కోట్ల నష్టాన్ని భరిస్తున్నాయని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా ధరలు పెరిగాయి.

ఆ పెరిగిన ధరలను దేశీయ రిటైల్ మార్కెట్‌కు బదిలీ చేయకుండా వినియోగదారులకు ఉపశమనం కల్పిస్తున్నారు. ఈ ప్రయోజనం కేవలం సాధారణ గృహాలు, ద్విచక్ర వాహనదారులు, రైతుల వంటి రిటైల్ వినియోగదారులకు మాత్రమేనని, పారిశ్రామిక కొనుగోళ్లకు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ధరల వ్యత్యాసం వల్ల కొత్త సమస్య తలెత్తింది. పారిశ్రామిక అవసరాల కోసం పెద్ద మొత్తంలో ఇంధనం కొనుగోలు చేసేవారు కూడా తక్కువ ధరకు లభించే రిటైల్ బంకులకు వస్తున్నారు. దీనివల్ల ప్రైవేట్ సంస్థల డీజిల్ అమ్మకాలు 38 శాతం పడిపోగా, ఆ భారం ప్రభుత్వ రంగ బంకులపై పడుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఇది స్థానిక కొరతకు దారితీసే ప్రమాదం ఉందని మంత్రిత్వ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది ఈ పరిస్థితిని తీవ్రంగా పరిగణించిన కేంద్రం, అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలను ఆదేశించింది. అత్యవసర వస్తువుల చట్టం కింద చర్యలు చేపట్టాలని, ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేయాలని సూచించింది. సామాన్యుల కోసం ఉద్దేశించిన ఇంధనాన్ని పారిశ్రామిక అవసరాలకు మళ్లించవద్దని పరిశ్రమల సంఘాలకు కూడా హెచ్చరికలు జారీ చేసింది. దేశంలో పెట్రోల్, డీజిల్ నిల్వలకు ఎలాంటి కొరత లేదని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ భరోసా ఇచ్చింది. దేశీయ అవసరాలు తీరగా, భారత్ పెట్రోలియం ఉత్పత్తులను పెద్ద ఎత్తున ఎగుమతి కూడా చేస్తోందని గుర్తు చేసింది. దేశంలో సప్లై సమస్య లేదని, ధరల వ్యత్యాసం వల్ల కొరత ఏర్పడుతోందన్న పుకార్లను ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది.



## ఈక్విటీ కంపెనీలకు ఎల్టీసీజి రద్దుచేయాలి-కేడియా



**ముంబయి, మే 28:** పారిశ్రామిక పురోభివృద్ధితోపాటు దేశ జిడిపి మరింత వృద్ధిసాధించేందుకు ఇన్వెస్టర్లకు రాయితీలు కల్పించాల్సిన అవసరం ఉందని అలాగే లిస్టెడ్ కంపెనీలకు ఎల్టీసీజి మినహాయింపులు ఇవ్వాలని ప్రముఖ ఇన్వెస్టర్ విజయ్ కేడియా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేసారు. ఇందుకోసం ప్రస్తుతం అమలులో ఉన్న దీర్ఘకాలిక మూలధనలబ్ధిపన్నును పూర్తిగా రద్దుచేయాలని ఆయన కోరారు. దీనివల్ల పారిశ్రామికవేత్తలకు దీర్ఘకాలిక సంపద సృష్టికి దోహదం చేసినట్లవుతుందన్నారు. దీర్ఘకాలిక వాటాదారులను అంచనా వ్యాపారులుగా చూడకూడదని వారిని సంపద సృష్టికర్తలుగా చూడాలని ఆయన సూచించారు. పెట్టుబడుల్లో ఇన్వెస్టర్లు కంపెనీలు విస్తరణకు, తద్వారా ఉపాధి వృద్ధికి, భారత ఆర్థికవృద్ధికి కారకులవుతారని ఆయన సోషల్‌మీడియా వేదికగా ఆర్థికమంత్రికి సూచించారు. భారీ మొత్తం దీర్ఘకాలిక మూలధన లబ్ధిపన్ను మొత్తాలతో ప్రపంచస్థాయి కంపెనీలను తయారుచేయవచ్చని, మౌలికవసుల వృద్ధితోపాటు గ్లోబల్‌స్థాయిలో వాణిజ్యవిస్తరణకు బాటలు వేసుకోవచ్చనిసూచించారు.

## జులై 8న టాటా మోటార్స్ ఏజీఎం




**ముంబయి, మే 28:** టాటామోటార్స్ ప్యాసింజర్ వాహన విభాగం యూనిట్ తన 81వ వార్షిక సర్వసభ్య సమావేశం జులై 8వ తేదీ నిర్వహించేందుకు నిర్ణయించింది. స్టాక్ ఎక్స్ఛేంజిలకు ఈమేరకు సమాచారం కూడా ఇచ్చింది. అలాగే కంపెనీ 2026 సంవత్సర తుదివిడత డివిడెండ్ తీసుకునే అర్హులైన వాటాదారులను ఎంపికచేసేందుకు కూడా జూన్ 19 రికార్డు తేదీగా ప్రకటించింది. ఆటోమొబైల్ తయారీ కంపెనీ తుది విడత డివిడెండ్ ప్రతి రెండురూపాయల వాటాకు రూ.3చొప్పున డివిడెండ్‌ప్రకటించింది. ఈ డివిడెండ్ పంపిణీని వాటాదారుల సమావేశం ఆమోదించాల్సి ఉంటుంది. జులై 14వ తేదీనాటికి డివిడెండ్ పంపిణీ కూడా పూర్తి అవుతుందని కంపెనీ చెపుతోంది. కంపెనీ నాలుగోత్రైమాసికంలో నికరలాభం రూ.5783 కోట్లు ఆర్జించింది. అంతకుముందు ఏడాది త్రైమాసికంలో వచ్చిన 8470 కోట్లకంటే 31.7శాతం క్షీణించింది. కార్యకలాపాలద్వారా రాబడులు 7శాతం పెరిగాయి. 97,863కోట్లనుంచి 104 లక్షలకోట్లకు చేరాయి. ఎబిడిటా నాలుగోత్రైమాసికంలో 21.7శాతం క్షీణించి రూ.11,212 కోట్లుగా ఉంది. అంతకుముందు ఏడాది రూ.14,498 కోట్లుగా ఉన్న సంగతి తెలిసిందే. 14.8 శాతంనుంచి 10.7 శాతానికి దిగిపోయాయి. లగ్జరీ విభాగంలో జాగ్వార్ లాండ్‌రోవర్ ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# వాడవాడలా ఎన్‌టీఆర్ జయంతి

ప్రభాతవార్త -యంత్రాంగం

**మాజీ సీఎం నందమూరి తారక రామారావు(ఎన్టీఆర్) జయంతిని వాడవాడలా నిర్వమించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.**



వెంకటరామన్నగూడెం, డా. వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిపాలనా కార్యాలయం, వెంకటరామన్న గూడెంలో తెలుగు జాతి గర్వకారణం, మాజీ ముఖ్యమంత్రి, మహానటుడు శ్రీ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. కె. ధనుంజయరావు ముఖ్య అతిథిగా హాజరై ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, బోధనేతర సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొని ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు.



జంగారెడ్డిగూడెం : స్థానిక సాయి బాబా టెంపుల్ ఫంక్షన్ హాల్‌లో తెలుగుదేశం పార్టీ మహానాడు రెండవ రోజు వేడుకలు, పార్టీ వ్యవస్థాపకులు, స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి కార్యక్రమం ఘనంగా జరిగాయి. పార్టీ శ్రేణులు ఎన్టీఆర్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టిడిపి సీనియర్ నాయకులు పరిమి సత్తిపండు మాట్లాడుతూ, ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం కార్యకర్తలంతా పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెం పట్టణ సమగ్ర అభివృద్ధికి తాము సిద్ధం చేసిన రోడ్ మ్యాప్‌ను ఆయన వివరించారు. బుట్టాయగూడెం జంక్షన్ నుంచి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే వరకు సెంటర్ డివైడర్ నిర్మాణం, యువత కోసం అధునాతన స్టేడియం ఏర్పాటు, విద్యుత్ సమస్యల పరిష్కారానికి అదనపు సబ్ స్టేషన్ మంజూరు వంటి ప్రతిపాదనలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ప్రకటించారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ నాయకత్వంలో జంగారెడ్డిగూడెం పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని పరిమి సత్తిపండు పేర్కొన్నారు.



జంగారెడ్డిగూడెం రూరల్ : వేగవరంలోని ఆర్ఎన్‌డీ ఫంక్షన్ హాల్‌లో నందమూరి తారకరామారావు 103వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షుడు కుక్కల మాధవరావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేశారు. అనంతరం పార్టీ శ్రేణులు అక్కడ ఏర్పాటు చేసిన స్క్రీన్‌పై టిడిపి వర్చువల్ మహానాడు కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు గొల్లమందల శ్రీనివాస్, నాయకులు రాగాని శ్రీనివాస్, గొల్లమందల కేశవరావు, తాళ్లూరి వెంకటేశ్వరరావు, ఆలపాటి దుర్గా రాంప్రసాద్, గంధం గోపాలకృష్ణ, వివిధ గ్రామాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ.



**లింగపాలెం**: లింగపాలెం మండలం కె.గోకవరం ఎస్సీ కాలనీలో స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ గారి విగ్రహాన్ని చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ ఘనంగా ఆవిష్కరించారుఈ కార్యక్రమంలో విగ్రహ దాత మారుమూడి థామస్ గారు,పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఎన్టీఆర్ గారికి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్టీఆర్ గారు తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.



**నరసాపురం** : స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా నరసాపురం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం రెండవ రోజు నిర్వహించిన వర్చువల్ డిజిటల్ మహానాడు సభలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. తదుపరి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన డిజిటల్ మహానాడు కార్యక్రమంలో పాల్గొని, ప్రవేశపెట్టిన పలు కీలక తీర్మానాలను నరసాపురం నియోజకవర్గం తరపున బలపరిచారు. అనంతరం నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి ఎన్టీఆర్ జయంతిని ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు , రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి నరసాపురం మహానాడు కార్యకలాపాల అబ్జర్వర్ దాసరి చంద్రశేషు, నరసాపురం ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పాలూరి నరసింహారావు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కోలచన శ్రీ పద్మ, అలాగే పట్టణంలోని వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ మరియు తెలుగుదేశం పార్టీ అభిమానులు పాల్గొన్నారు.



**జీలుగుమిల్లి**, మే-28, (ప్రభాతవార్త): మండల కేంద్రం జీలుగుమిల్లిలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండో రోజు మహానాడు కార్యక్రమానికి పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు 103వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మహానాడు కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు కట్టుబడి పనిచేస్తామని నాయకులు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, నియోజకవర్గ పరిశీలకులు కోళ్ల నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు సుంకవల్లి సాయి, ఎంపీటీసీ నాలి శ్రీను, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



**అత్తిలి**, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీకి సేవలందిస్తున్న కార్యకర్తల సేవలు అభినందనీయమని అత్తిలి ఎంపీపీ మక్కా సూర్యారావు అన్నారు. అత్తిలి మండలంలో నిర్వహిస్తున్న మహానాడు వేడుకలు రెండవ రోజు వేడుకలలో భాగంగాపార్టీ సీనియర్ పార్టీ కార్యకర్తలను ఘనంగా సన్మానించారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే వెన్నుముక అని వారి సేవలు పార్టీ ఎల్లవేళలా గుర్తుంచుకుంటుందని అన్నారు. పార్టీ కార్యకర్తల కోసం యువనేత లోకేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు. వారికి భీమా సౌకర్యాన్ని కల్పించారని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తారని అన్నారు. మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణరావు, మండల మండల టిడిపి అధ్యక్షుడు పోలిశెట్టి చందు, కార్యదర్శి అల్తి అజయ్, ద్వారకా తిరుమల దేవస్థానం ట్రస్టీ అల్తి సత్యనారాయణ, నీటి పంపిణీ కమిటీ చైర్మన్ నల్లూరు సురేష్, టిడిపి నాయకులు కొరిపల్లి ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పోలిశెట్టి గోపికృష్ణ,మంచిలి టిడిపి నాయకుడు శిరగాని నాగేశ్వరరావు, దాసం బాబ్జి, మెంతు రాజకుమార్, గారపాటి ధనరాజు, వెలగల సత్యనారాయణరెడ్డి, ముత్యాల నాగేశ్వరరావు, అల్లూరి ధనరాజు,దువ్వాపు ధన రాజు, బోడా నరసింహమూర్తి, కొరిపల్లి విజయ్ కుమార్, వర్రి శ్రీనివాస్, గొలగాని రాజు, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. టిడిపి సీనియర్ నాయకులు బోడపాటి సూర్య చంద్రరావు, లింగంపల్లి సత్యనారాయణ, బలుసు వెంకటేశ్వరరావు, బొంతు అన్నవరం తదితరులు 18 మందిని సత్కరించారు.



**ఉర దా ళ్ల పాలెం లో ఎన్టీఆర్ జయంతి**

స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా అ త్తిలి మండలంలో ఉర దా ళ్ల పాలెం లో ఉపాధి హామీ పథకం మహిళలకు చీరలు పంపిణీ,మజ్జిగ వితరణ, స్వీట్లు పంపిణీ కార్యక్రమం ఉరదాళ్ళపాలెం గ్రామ నీటి సంఘం అధ్యక్షులు కూసంపూడి శ్రీనివాస్,ఉరదాళ్ళపాలెం గ్రామ సర్పంచ్ కాసుల చిన్ని, గ్రామ పార్టీ వైస్ ప్రెసిడెంట్ నక్క సుబ్బారావు, వార్డు మెంబర్లు చవాకులవేణు, ఆధ్వర్యంలో నిర్వహించారు. సీనియర్ టిడిపి నాయకులు బోర్ర దుర్గారావు, ఎర్రం శెట్టి సింహాచలం, కాసుల ధర్మయ్య, దాసం మునసబు, మెరిపే తిరుపతి లను సన్మానించారు.



**చాట్రాయి**, భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా తెలుగు మహిళలకు ఆస్తిలో సమాన వాటా హక్కు కల్పించిన మహనీయుడు నందమూరి తారక రామారావు అని రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మాత్యులు కొలుసు పార్థసారథి అన్నారు. గురువారం చాట్రాయి మండలంలో ఆరుగొలను పేట గ్రామంలో రెండో రోజు జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి విచ్చేసిన ఆయన ముందుగా ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. నూజివీడు మాజీ శాసనసభ్యులు మేకా ప్రతాప్ అప్పారావు నేను రౌడీలకే రౌడీ అని మీసాలు తిప్పుతున్నారని తాను రౌడీని కాదని ప్రజా సేవకుడు అని చెప్పారు. నూజివీడు నుంచి బయటికి వెళ్ళనీయమంటూ ప్రతాప్ ఆవేశంగా మాట్లాడుతున్నారని అసలు నూజివీడు నుండి వెళ్లే ప్రసక్తే లేదని ఎక్కడనుండే మళ్లీ మళ్లీ పోటీ చేసి ప్రజల ఆదరాభిమానాలు పొంది సేవ చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డు సభ్యులు కొప్పెర్ల నాగరాజు , మందపాటి బసవ రెడ్డి, మరిడి చిట్టిబాబు, కొత్తపల్లి రామదాసు, దామెర చిట్టిబాబు, పానుగల్ల కోటేశ్వరరావు, ఇజ్జిగాని చెన్నారావు, వెల్ది నాగేశ్వరరావు, వెల్ది రాజా, ఎర్రోజు రాంప్రసాద్, మాదాసు చిన్న పుల్లయ్య, మాదాసు చంద్రకళ, పలగాని దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



పెనుమంట్ర, మండలంలోని మార్టేరు రెడ్డి కళ్యాణ మండపంలో నిర్వహించిన మహానాడు రెండో రోజు వేడుకల్లో ఆచంట నియోజకవర్గ శాసనసభ్యులు పితాని సత్యనారాయణ తనయుడు వెంకట సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సామాజిక పింఛన్లు నేటికీ లక్షలాది పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయని అన్నారు. సంక్షేమానికి శాశ్వత చిరునామాగా ఎన్టీఆర్ పాలన నిలిచిందని కొనియాడారు. ఈ సందర్భంగా పార్టీ స్థాపన నుంచి నేటి వరకు తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం పేద ప్రజలకు న్యాయం చేయాలన్న ఎన్టీఆర్ ఆశయ సాధనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం కృష్ణయ్యపాలెం గ్రామంలో గురువారం ఎన్టీఆర్ 103 జయంతి కార్యక్రమం నిర్వహించారు. కూటమి నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలోఅడపా ప్రసాద్, పుల్లా బాబి, పాలూరి వెంకటేశ్వరరావు, వాడపల్లి సుబ్బరాజు, చెరుకూరి సోమశేఖర్, బేతిన గిరి, మద్దిపాటి ధర్మేంద్ర,పసుమర్తి రామ లక్ష్మణ్,బేదపూడి వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు రాంబాబు రాంబాబు, శనగన రాంబాబు, పిల్ల రాంబాబు, అమెరికా రాజు, ధనరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు



**అత్తిలి**, )అత్తిలి మండలంలో ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద, పెద్ద వంతెన వద్ద ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆరవల్లి గ్రామంలో అల్లూరి ధనరాజు, ప్రసాద్ రెడ్డి, వెలగల సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలనేసి నివాళులర్పించారు. ఆరవల్లిలో జరిగిన మహానాడు కార్యక్రమంలో తణుకు శాసనసభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణ పాల్గొన్నారు. టిడిపి నాయకులు చేకూరి శ్రీనివాస్, గనిశెట్టి శ్రీనివాస్, మంతెన గోపాలకృష్ణన్ రాజు, వై. త్రిమూర్తులు, పెన్మేత్స కృష్ణంరాజు, శీలబోయిన ధర్మారావు, కడలి రాంబాబు,మండల టిడిపి అధ్యక్షుడు పోలిశెట్టి చందు,కార్యదర్శి అల్తి అజయ్, కే రామాంజనేయులు, డి. జయరాజు తదితరులు పాల్గొన్నారు.



**నరసాపురం** స్థానిక 25 వ వార్డు నందమూరి వీవర్స్ కాలనీ లో ఐటీడీపీ టౌన్ అధ్యక్షుడు మావూరి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో అన్న ఎన్టీఆర్ 103 వ జయంతి వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులు అర్పించారు

**పాలకొల్లు** : పాలకొల్లులో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాలతో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో



స్థానిక గాంధీ బొమ్మల సెంటర్లో ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, టిడిపి పట్టణ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి పాలకవర్గ సభ్యురాలు పెండ్యాల భవాని తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



**తాడేపల్లిగూడెం,** పేద ప్రజలకు న్యాయం చేయాలన్న ఎన్టీఆర్ ఆశయ సాధనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్,.శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం కృష్ణాయపాలెంలో ఎన్టీఆర్ 103 జయంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కూటమి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా కేక్ కత్తిరించి నాయకులకు తినిపించారు. ఈ కార్యక్రమంలోఅడపా ప్రసాద్, పుల్లా బాబి, పాలూరి వెంకటేశ్వరరావు, వాడపల్లి సుబ్బరాజు, చెరుకూరి సోమశేఖర్, బేతిన గిరి, మద్దిపాటి ధర్మేంద్ర, మద్దిపాటి రవితేజ, పసుమర్తి రామ లక్ష్మణ్, బేదపూడి వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు రాంబాబు, శనగన రాంబాబు, పిల్ల రాంబాబు, అమెరికా రాజు, ధనరాజు, పాల్గొన్నారు.



కైకలూరు : మండలంలోని కొల్లేరు గ్రామాల్లో ఒకటైన చిన్న కొట్టాడ గ్రామం క్లస్టర్-6లో రాష్ట్ర వడ్డీ సాధికారిక కన్వీనర్ బలే యేసురాజు ఆధ్వర్యంలో మహానాడు కార్యక్రమాన్ని పసుపు పండగగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొత్త నాగేంద్ర బాబు, పి జె ఎస్ మాల్యాద్రి, మండల అధ్యక్షులు పంది రాధాకృష్ణ, వీరాబత్తిన సుధా, అద్దేపల్లి బ్రహ్మాజీలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ స్థాయి మహానాడు కార్యక్రమం కొల్లేరులో జరగడం ఇదే మొదటిసారి అన్నారు. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, క్లస్టర్ ఇన్చార్జ్లు, 7 కార్యకర్తలతో పాటు ముఖ్యంగా మహిళలు మరియు పురుషులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎండ తీవ్రతను కూడా లెక్కచే - యకుండా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు సుమారు 2వేల మంది ఈ సభకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయమంగళ సుబ్బరాజు, పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాలమూరులో ఘనంగా డిజిటల్ మహానాడు



**పెనుమంట్ర, మే-28, (ప్రభాతవార్త):** మండలంలోని పొలమూరులో నిర్వహించిన డిజిటల్ మహానాడు రెండో రోజు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెనుగొండ ఏఎంసీ చైర్మన్ బడేటి బ్రహ్మాజీ, జిల్లా ఉపాధ్యక్షులు తమనంపూడి శ్రీనివాసరెడ్డి, మండల అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి, చింతపల్లి రామకృష్ణ, భూపతిరాజు రాధాదేవి, వివేక్, కర్రి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. డిజిటల్ మహానాడు విజయవంతానికి సహకరించిన కార్యకర్తలు, నాయకులకు మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలు భూపతిరాజు రాధాదేవి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కార్యకర్తలకు కల్పించిన సౌకర్యాలకు ధన్యవాదాలు తెలిపారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అంశంపై నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలను ఆమె స్వాగతించారు.

## అత్యంత వైభవంగా మహానాడు వేడుకలు



**ఆగిరిపల్లి మే 28 ప్రభాతవా ర్త**
ఆగిరిపల్లి, కొత్తఈదర గ్రామాలలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహానాడు కార్యక్రమం గురువారంఅత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా పార్టీ నాయకులు జ్యోతి ప్రజ్వలన చేసి మహానాడు వేడుకలను ఘనంగా ప్రారంభించారు. అనంతరం పార్టీకి సేవలందించిన సీనియర్ నాయకులను గుర్తించి వారికి దుశాలువాలతో ఘనంగా సత్కరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా వీక్షించి పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమం మొత్తం పార్టీ జెండాలు, నినాదాలతో పండుగ వాతావరణం నెలకొంది. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, టౌన్ అధ్యక్షుడు పామర్తి నరసయ్యమాట్లాడుతూ మహానాడు వేడుకలను విజయవంతం చేసిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మాదల వెంకట సత్య ,కుమార్, మదుపల్లి గోపాలకృష్ణ కుమార్, ఆరేపల్లి శ్రీనివాసరావు, మాదల శివరాం ప్రసాద్, బెజవాడ శ్రీనివాసరావు, రాజా రాంబాబు, చిట్టినేని శివరామకృష్ణ, ముల్లంగి శ్రావణ్ కుమార్, విక్టరీ బాబు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉచిత శారీ పెయింటింగ్ శిక్షణ

**ప్రారంభించిన యుకె ఇంటర్నేషనల్ డైరెక్టర్ డా. ముచ్చర్ల సంజయ్ యుకె గవర్నర్ పెనుమాక రామ్మోహనరావు.**



**నరసాపురం మే 27 ప్రభాతవార్త** సుమారుగా 60 మంది మహిళలు ఈ మూడు రోజులు నర్సాపురం జై ఆర్కవ్ కిడ్స్ ప్లే స్కూల్ లో జరుగుతున్న శారీ పెయింటింగ్ శిక్షణలో పాల్గొంటున్న సందర్భంగా వారిని ఉద్దేశించి ముఖ్య అతిధులు డా.ముచ్చర్ల సంజయ్ , పెనుమాక రామ్మోహనరావు మాట్లాడుతూ మహిళలు తమ ఆర్థిక స్వావలంబన కోసం ఇటువంటి శిక్షణ ఎంతో అవసరమన్నారు. తమ కాళ్ళపై తాము నిలబడే విధంగా కుటుంబానికి ఆసరాగా నిలబడటానికి , ఉపాధికి ఇటువంటి కళలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. నర్సాపురం యునైటెడ్ కాపు వనితా సభ్యులను వారు అభినందించారు. యుకె ఇంటర్నేషనల్ మహిళా డైరెక్టర్ , రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డా. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ మూడు రోజుల ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్కవ్ వాణి, వనితా క్లబ్ అధ్యక్షురాలు బండిస్వర్ణలత, కార్యదర్శి రంగినీడి భరణి, కోశాధికారి మణికర్ణిక, ఉపాధ్యక్షులు పుప్పాల ఉషా కమల, పిప్పళ్ళ సుప్రజ , తోట అరుణ ,పూజిత బ్యూటీషియన్ సత్య, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# బూత్ స్థాయి కార్యకర్తలే పార్టీకి బలమైన పునాది

**వైసీపీ జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు**



**తాడేపల్లిగూడెం,మే 28 (ప్రభాతవార్త)** బూత్ స్థాయి కార్యకర్తలే పార్టీకి బలమైన పునాది అని వైసీపీ జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు సూచించారు. వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు అధ్యక్షతన బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమాన్ని స్థానిక గమిని ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైకాపా జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు, నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు ముదునూరి మురళి కృష్ణంరాజు, నరసాపురం పార్లమెంట్ ఇంచార్జి గూడూరి ఉమాబాల, వైసీపీ అధికారిక ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలకపాత్ర పోషించాల్సింది బూత్ లెవెల్ ఏజెంట్లేనని, వీరంతా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నిమిత్తం బూత్ లెవెల్ ఏజంట్లు చేయాల్సిన కార్యాచరణను తెలియజేశారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి విషయంపై బూత్ లెవెల్ ఏజెంట్లు అవగాహనను పెంచుకుని ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో ప్రముఖ పాత్ర బీఎల్ఏలదేనని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఇప్పటినుంచే సిద్ధంగా ఉంటూ పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పాటించాల్సిన నియమాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు.ముందుగా కార్యకర్తలు, నాయకులు వద్ద సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాళ్ళకూరు వెంకటేశ్వర స్వామి ప్రసాదశాల నిర్మాణానికి ఐదు లక్షలు విరాళం



**కాళ్ళ మే 28 (ప్రభాతవార్త)** దాతల సహకారం అభినందనీయమని కాళ్లకూరు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్ అడ్డాల శివరామరాజు అన్నారు. మండలంలోని కాళ్లకూరు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం అన్నదాన భవనం మాడవీధుల అభివృద్ధికి ప్రసాదశాల నిమిత్తం భీమవరం, శివరావుపేటకు చెందిన కీ:శే: కనుమూరి. అచ్చాయమ్మ జ్ఞాపకార్థం భర్త కనుమూరి.కృష్ణంరాజు ( గూడెం కృష్ణమూర్తి రాజు) రూ.5,00,000/-లు విరాళాన్ని పాలకమండలి అధ్యక్షులు అడ్డాల శివరామరాజు కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్, పాలకమండలి సభ్యులు గ్రామ పెద్దల సమక్షమున అందజేశారు. దాతలను అభినందించి వారికి స్వామి వారి శేష వస్త్రం ప్రసాదములు, వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు.

## పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపడాలంటే
# ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి

**పురపాలక సంఘ ఇంజనీర్ వెంకట రమణ**



**తాడేపల్లిగూడెం,మే 28 (ప్రభాతవార్త)** తాడేపల్లిగూడెం పట్టణంలో పారిశుద్ధ్యం మరింతగా మెరుగుపడాలంటే ప్రజల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని పురపాలక సంఘ ఇంజనీర్ వెంకట రమణ సూచించారు. పురపాలక సంఘ కమిషనర్ ఎం.ఏసుబాబు ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీర్ వెంకట రమణ నేతృత్వంలో స్థానిక బ్రహ్మానందరెడ్డి మార్కెట్ రోడ్డులో గురువారం ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డులోని దుకాణాల ముందు, ఫుట్‌పాత్‌లు, డ్రైనేజీలను పూర్తిగా శుభ్రంచేశారు. రోడ్డుపై పేరుకుపోయిన చెత్త, కుళ్లిన కూరగాయలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి ట్రాక్టర్లపై డంపింగ్ యార్డుకు తరలించారు. దుకాణదారులు చెత్తను రోడ్డుపై వేయకుండా డస్ట్‌బిన్లలో వేయాలని, తడి-పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాలని సూచించారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా మురుగు కాలువలు, చెత్త పేరుకుపోయిన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ సందర్భంగా పురపాలక సంఘ ఇంజనీర్ వెంకట రమణ మాట్లాడుతూ కమిషనర్ ఏసుబాబు ఆదేశాల మేరకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని బ్రహ్మానంద రెడ్డి మార్కెట్ రోడ్డులో చేపట్టామని తెలిపారు. మార్కెట్ ప్రాంతం నిత్యం వ్యాపారులు, కొనుగోలుదారులతో రద్దీగా ఉండటంతో పరిశుభ్రత చాలా అవసరమని చెప్పారు. వ్యాపారులు, ప్రజలు సహకరిస్తేనే పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచగలమని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రోడ్లను శుభ్రం చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. రోడ్డుపై చెత్తాచెదారాన్ని వేస్తే జరిమానాలు విధిస్తామని వ్యాపారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది, సానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## భీమవరం లో ఉత్సాహం గా ఆపరేషన్ క్లీన్ స్వీప్



**భీమవరం మే 28 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం భీమవరం పురపాలక సంఘంలో 5వ రోజూ విజయవంతంగా కొనసాగింది. జిల్లా కలెక్టర్ శ సి. నాగరాణి మున్సిపల్ కమిషనర్ కె. రామచంద్ర రెడ్డి సూచనల మేరకు అసిస్టెంట్ కమిషనర్ ఎ. రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక రెస్ట్ హౌస్ రోడ్డునందు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. ప్రజల రాకపోకలు అధికంగా ఉండే రెస్ట్ హౌస్ రోడ్డులో ఇరువైపులా పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, దుమ్మును జేసీబీలు, ట్రాక్టర్ల సహాయంతో పూర్తిగా తొలగించారు. అలాగే రోడ్డు వెంబడి ఉన్న మురుగు కాల్వల్లో పూడికను తొలగించి నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టారు. దుర్వాసన, దోమల నివారణ కోసం బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్ చల్లారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, పట్టణంలోని ప్రధాన రహదారులు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు కొనసాగిస్తున్నామని తెలిపారు. వ్యాపారులు తమ దుకాణాల ముందు చెత్త వేయకుండా తప్పనిసరిగా డస్ట్‌బిన్లను వినియోగించాలని సూచించారు. అలాగే పారిశుద్ధ్య నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై చెత్త వేస్తున్న వారిపై తగిన జరిమానాలు విధించబడతాయని అధికారులు హెచ్చరించారు. గత ఐదు రోజులుగా కొనసాగుతున్న "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డా. చీడే సత్యన్నారాయణ, జిల్లా వాకర్స్ అసోసియేషన్ గవర్నర్ వడుపు గోపి, సభ్యులు కళ్ళక్కడి గాంధీ, రామ్మోహనరావు, బొండా శ్రీరామ్, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ చిన్నయ్య, సెక్రటరీ చిన్నయ్య, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ రంగసాయి, కొప్పినేటి ప్రకాష్ (సెక్రటరీ), ఎస్. హనుమంతరావు (ట్రెజరర్), ఆల్ వాకర్స్ భీమవరం ప్రెసిడెంట్ భీమాల శ్రీరామ్ మూర్తి, ఎంహెచ్‌వో ఆర్. సోమశేఖరం, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రమణ, కృష్ణారావు, సత్యనారాయణ రాజు, మున్సిపల్ అధికారులు, శానిటరీ సిబ్బంది, పరిశుభ్రత కార్మికులు, స్థానిక వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రజలు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ కార్యక్రమంలో లోపాలు లేకుండా చూడాలి

**అత్తిలి, మే 28 (ప్రభాతవార్త )** కేంద్ర ఎన్నికల సంఘం జూన్ నెలలో రాష్ట్రంలో నిర్వహించబోయే ప్రత్యేక సమగ్ర ఓటర్ల సవరణ కార్యక్రమం లో ఎటువంటి లోపాలు జరగకుండా వైసిపి బూత్ స్థాయి కన్వీనర్లు చూడాలని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరావు కోరారు. తణుకు నియోజకవర్గం స్థాయి వైసీపీ బూత్ స్థాయి కన్వీనర్ల సమావేశం అత్తిలి షాదీఖానాలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఒక్క ఓటు నమోదు అయ్యేలా కన్వీనర్లు పనిచేయాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో గల దుర్మార్గమైన పాలనకు అంతం పరకాలంటే ఏ ఒక్క అర్హత గల ఓటరు తొలగించకుండా చూడాలని అన్నారు. సమగ్ర ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని కార్యకర్తలు ఆషా మాషి గా తీసుకోవద్దని కోరారు. ప్రస్తుతం గల ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా చూస్తున్నాయని అన్నారు. జిల్లా వైసీపీ అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ 24 సంవత్సరాల తర్వాత ఓటర్ల జాబితా సమగ్రంగా సవరిస్తున్నందున ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని కోరారు. ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఎన్నికల్లో ముఖ్యమంత్రుల ఓటమికి ఓటర్ల జాబితా లోని లోపాలే కారణమని అన్నారు. ఓటర్ల జాబితా నమోదులో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే సంబంధిత అధికారులకు తెలియజేయాలని, పార్టీ నాయకత్వానికి కూడా తెలియజేయాలని కోరారు. సమావేశంలో యనమల నాగార్జున యాదవ్ బూత్ లెవెల్ కన్వీనర్ల సందేహాలను నివృత్తి చేశారు. పార్టీ నాయకురాలు గూడూరు ఉమాబాల, జిల్లా నాయకుడు బుద్ధ రాతి భరణి ప్రసాద్, పైబోయిన సత్యనారాయణ, కంకటాల సతీష్, మహమ్మద్ హబీబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



కే ఎస్ గట్టు చర్చి వద్ద చెట్టు పడిపోవటం తో తణుకు అత్తిలి మధ్య ట్రాపిక్ కు అంతరాయం కలిగింది.గ్రామస్తుల సహాయకారంతో చెట్టును తొలగించి ట్రాఫిక్ ను క్లియర్ చేసారు.- ప్రభాత వార్త, అత్తిలి.

పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# వణుకు పుట్టించిన తుఫాను బీభత్సం

- ఈదురు గాలుల ప్రభావంతో కూలిన చెట్లు హోర్డింగులు
- ఆలమూరు తణుకు రోడ్డులో తెగిపడిన విద్యుత్ తీగలు
- జాతీయ రహదారుల పై నిలిచిన ట్రాఫిక్

**మే, 28, పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి:** గురువారం సాయంత్రం జిల్లాల పలుచోట్ల వీచిన బలమైన ఈదురుగాలులు, తుఫాను ప్రభావం కారణంగా జిల్లాలోని పలు రహదారుల్లో చెట్లు కూలిపడి, రోడ్లపైనే విద్యుత్ తీగలు తెగబడ్డాయి. దీంతో ట్రాఫిక్ కి తీవ్ర అంతరాయం కలగడంతో పాటు వాహన చోదకులు భయభ్రాంతులకు గురయ్యారు. పెను గాలులకు తోడుగా వర్షం కూడా రావడంతో విద్యుత్ సిబ్బంది ఫైర్ సిబ్బంది చేస్తున్న సహాయక చర్యలకు అంతరాయం ఏర్పడింది. జిల్లాలో చాలా చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వాతావరణ శాఖ నుంచి వర్షాలు వస్తాయని సమాచారం ఉన్నప్పటికీ పెనుగాలులు వీస్తాయని ఎవరూ ఊహించలేదు దీంతో ఊహించని నష్టం జరిగింది. ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.







# తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన ఎన్టీఆర్

## జిల్లా కలెక్టర్ వెట్రీ సెల్వి





**ఏలూరు, మే, 28 : ప్రభాత వార్త** తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి డా. నందమూరి తారక రామారావు అని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి డా. నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు గురువారం స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో కేకును కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ లు ఎన్ .టి. రామారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఎన్ .టి. రామారావు ప్రజలకు సుపరిపాలనను అందించేందుకు పాలనాపరమైన ఎన్నోసంస్కరణలు తీసుకువచ్చారన్నారు. సామజిక పెన్షన్లు, మహిళలకు ఆస్తిలో హక్కు, పేదల ఆరోగ్య భద్రతకు 2 రూపాయలకే కిలో బియ్యం వంటి ఎన్నో పథకాలను తీసుకువచ్చారన్నారు. రాజకీయవేత్తగానే కాక నటుడిగా కూడా అందరి హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఆయన నటనకు దేశవ్యాప్తంగా అభిమానులు ఉన్నారన్నారు. ప్రజలకు మెరుగైన పాలనతో పాటు ప్రజలకు సంతృప్తికరమైన రీతిలో సేవలను అందించేందుకు ప్రాధాన్యతను ఇచ్చేవారన్నారు. దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ పేదలు, రైతుల సంక్షేమానికి డా. నందమూరి తారక రామారావు ఎన్నో కార్యక్రమాలను అమలు చేశారన్నారు. పార్టీని స్థాపించిన 9 నెలల కాలంలోనే అధికారాన్ని చేపట్టి, ముఖ్యమంత్రి పదవి చేపట్టి చరిత్ర సృష్టించారన్నారు. సామజిక పెన్షన్లను అన్న రామారావు గారు 30 రూపాయలతో ప్రవేశపెట్టారని, ఆ పెన్షన్ ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 4 వేల రూపాయలకు తీసువెళ్లారన్నారు. ప్రజల ఆహారభద్రతకు 2 రూపాయలకే కిలో బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. పేదప్రజలకు కూడు, గూడు, నీడ అందిస్తానని వాగ్దానం చేసి అమలు చేసి చూపించారన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, ఇంచార్జ్ డిఆర్ఓ దేవకీదేవి, ఆర్డీఓ కె. లక్ష్మీప్రసన్న, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి, ఎస్డిసి భాస్కర్, సెట్ వెల్ సీఈఓ ప్రభాకర్, పర్యాటకాధికారి పట్టాభి రామయ్య, ఐసిడిఎస్ పీడీ శారద, ఎల్డిఎమ్ నీలాద్రి, కలెక్టరేట్ సిబ్బంది, ప్రభృతులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

## పాల్గొన్న కలెక్టర్ నాగరాణి



**భీమవరం మే 28 ప్రభాతవార్త** తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి, మహానటుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి వేడుకలను గురువారం పశ్చిమగోదావరి జిల్లా యంత్రాంగం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్వో బి.శివన్నారాయణ రెడ్డి తదితర అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీఆర్ తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా పేదల సంక్షేమానికి అనేక వినూత్న పథకాలను అమలు చేసి ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. సమాజంలోని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. తెలుగు సంస్కృతి, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహానుభావుడిగా ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. ప్రజా సేవకు ఆయన చూపిన మార్గం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వరరావు, డిటి ఏం.సన్యాసిరావు, తదితరులు పాల్గొని స్వర్గీయ ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పించారు.

# కోపల్లె వంతెన పనులు పరిశీలించిన కలెక్టర్ నాగరాణి



**భీమవరం మే 28 ప్రభాతవార్త** నిర్మాణంలో ఉన్న కోపల్లె నాలుగు లేన్ల వంతెన పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కాళ్ళ మండలం కోపల్లెలో రూ. 12 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న నాలుగు లేన్ల వంతెన పనులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గురువారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వంతెన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులను పనుల స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రజలకు రాకపోకల సౌకర్యం మెరుగుపడేలా ప్రభుత్వం చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఈ వంతెన నిర్మాణం ఎంతో కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా భద్రతా ప్రమాణాలను పాటిస్తూ నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. అధికారులు వంతెన నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక వివరాలు, ప్రస్తుత పనుల పురోగతి, మిగిలిన పనుల వివరాలను కలెక్టర్‌కు వివరించారు. పనులు నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్ అండ్ బి అధికారి అడబాల శ్రీనివాసరావు, గుత్తేదారు అర్జునరాజు, ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల అభిమానం చూరగొన్న ఎన్టీఆర్

- బడుగు బలహీన వర్గాలకు అధికారం కల్పించిన మహానేత
- తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వెల్లడి
- తణుకులో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



**తణుకు, మే 28 ( ప్రభాత వార్త)** సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన నందమూరి తారక రామారావు పౌరాణిక, సాంఘిక, జానపద పాత్రల్లో నటించి తెలుగు ప్రజల అభిమానాన్ని చూరగొన్న మహానుభావుడని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా గురువారం తణుకులోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడుతూ సినీ వినీలాకాశంలో వెలుగొందిన ఎన్టీ రామారావు సమాజంపై బాధ్యతతో ప్రజల అవసరాలకు ఎల్లప్పుడూ స్పందించేవారని అన్నారు. తెలుగుదేశం పార్టీని స్థాపించిన కేవలం తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి తీసుకువచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారాన్ని అందించిన మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు.దళితులు, బీసీలు సహా వెనుకబడిన వర్గాలకు చెందిన అనేక మంది నాయకులను ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్లమెంట్ సభ్యులుగా ఎదగడానికి అవకాశం కల్పించిన గొప్ప దూరదృష్టి నాయకుడు ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. రెండు రూపాయల కిలో బియ్యం పథకం, మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు కల్పించడం వంటి సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు.అనంతరం తణుకు నియోజకవర్గంలో మహానాడు కార్యక్రమాల సందర్భంగా ఏర్పాటు చేసిన 10 క్లస్టర్ల పరిధిలోని కళ్యాణ మండపాలను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ స్వయంగా సందర్శించారు. ప్రతి క్లస్టర్‌కు వెళ్లి నాయకులు, కార్యకర్తలతో ముచ్చటిస్తూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. సీనియర్ కార్యకర్తలను ప్రత్యేకంగా సత్కరించి పార్టీకి వారి సేవలను గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే స్వయంగా అన్ని క్లస్టర్లను సందర్శించడం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, రైతులకు అండగా నిలిచే నిర్ణయాలు తీసుకోవడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఏడాదికాలంగా ఎంతో ప్రగతి సాధించా : రాజ్యసభ సభ్యుడు పాకా



**భీమవరం టౌన్, మే 28 : ప్రభాతవార్త** సంవత్సర కాలంగా రాజ్యసభలో పలు రాష్ట్ర సమస్యలపై తన గళాన్ని వినిపించడమే కాక, విద్య, వైద్య, ప్రజా వసరాల నిమిత్తం, ఇతర అభివృద్ధి పను లకు తన నిధులను ప్రాధాన్యతను బట్టి వినియోగించినట్లు, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ వెల్లడించారు. పార్లమెంట్ (రాజ్యసభ) సభ్యునిగా ఆయన ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా భీమవరంలోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆక్వా రంగ అభివృద్ధి, ఆక్వా ఉత్పత్తుల దేశీయ వినియోగ కీలక అంశంగా చర్చించటం జరిగిందన్నారు. రాజధాని అభివృద్ధి అవసరాన్ని ప్రస్తావించానని, బీసీ వర్గాల సంక్షేమం నైపుణ్య అభివృద్ధి సంప్రదాయ వృత్తుల పరిరక్షణకు పార్లమెంట్లో ప్రసంగించా నన్నారు. నదీ జలాలు ,సాగు ,తాగునీరు మరియు అభివృద్ధికి సమర్థ వినియోగ అంశాలను ప్రస్తావించడం జరిగిందన్నారు. అదే విధంగా స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, కొల్లేరు పునరుద్ధరణ ,వ్యర్థాలను సంపదగా మార్చటం, భూగర్భ జలాల తగ్గుదలపై అధికారుల ద్వారా చర్యలు తీసుకోవడం, ప్రజా పంపిణీ వ్యవస్థ సమర్థ అమలుకు తగు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్ర జిల్లా స్థాయి సమీక్ష సమావేశాల్లో పాల్గొని ప్రజా సమస్యలను ప్రస్తావించటం పరిష్కారాలకు చర్యలు తీసుకున్నా మన్నారు. మన్ కీ బాత్, సామాజిక సమరసతావేదిక, ఖేల్ ఇండియా, ఆపరేషన్ సింధూర్ వంటి అవగాహన సమన్వయ కార్యక్రమాల్లో ప్రాతినిధ్యం వహించటం జరిగిందన్నారు. పాఠశాలల మౌలిక వసతులకు , ల్యాబ్ లకు, స్మశాన వాటికలు, ప్రజా వైద్య సేవల కోసం అంబులెన్సులు, పెండింగ్ లో ఉన్న కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు, నిధులు వినియోగించడం జరిగిందన్నారు. కేంద్ర రాష్ట్ర పార్టీ నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజల్లో అవగాహన కల్పించడం, పార్టీ ఆవిర్భావ దినోత్సవాలు, వివిధ వర్గాల సంఘ సమావేశాల్లో పాల్గొనడం, బీసీ వర్గాల సమస్యలపై మంత్రులతో చర్చించడం పార్టీ ప్రశిక్షణ కార్యక్రమాల్లో పాల్గొంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ఏడాదికాలంగా తాను చేసిన అభివృద్ధి పట్ల, ప్రజా సంక్షేమం పట్ల తీసుకున్న చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయి అన్నారు. ప్రధానమంత్రి మోడీ నాయకత్వంలో దేశం గణనీయ స్థాయిలో అభివృద్ధి చెందిందని, అగ్ర రాజ్యాల సరసన నిలబడేందుకు నిస్సందేహ స్థితిలో ఉన్నద న్నారు. పలువురు బిజెపి నేతలు రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణకు పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు. పెద్ద స్థాయిలో బిజెపి శ్రేణులు కార్య కర్తలు పాల్గొన్నారు.

# జీలుగుమిల్లిలో వర్షం

**జీలుగుమిల్లి, మే-28, (ప్రభాతవార్త)** గత వారం రోజులకు అత్యధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో బిక్కిరిబిక్కిరైన జనం గురువారం సాయంత్రం జీలుగుమిల్లిలో కురిసిన ఓ మోస్తారు వర్షానికి వాతావరణం చల్లగా మారడంతో ప్రజలు సేద తీరారు. బుధవారం కాస్త ఎండ దాటి తగ్గి వాతావరణంలో మబ్బులు కారణంగా ఏజెన్సీ వాసులు రోజంతా ఉపశమనం పొందినప్పటికీ, తిరిగి గురువారం సూర్యుడు రోజంతా తన ప్రతాపాన్ని తిరిగి చూపించడంతో ప్రజలు ఎండ వేడికి తట్టుకోలేక ఇళ్లకే పరిమితమయ్యారు. సాయంత్రం ఉరుములు, మెరుపులు మద్య కొద్దిసేపు వర్షం పడటంతో చల్లని వాతావరణానికి ప్రజలు కాస్త ఉపశమనం పొందారు.

# తాడువాయి కాలనీలో మౌలిక వసతుల కల్పన.. నిర్వాసితుల హర్షం

## జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి ప్రత్యేక చొరవ



**జంగారెడ్డిగూడెం రూరల్ మే 28 ప్రభాత వార్త** పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజల కోసం జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన పునరావాస కాలనీలో మంచినీరు, విద్యుత్ సౌకర్యాలు సమకూరాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా వి.ఆర్.పురం మండలం సీతంపేట, ములకలంపల్లి, శ్రీరామగిరి గ్రామాల నుంచి తరలివచ్చి ఇక్కడ నివసిస్తున్న నిర్వాసితులకు ఈ వసతులు కల్పించారు. ?కాలనీలో ఎదురవుతున్న తాగునీరు, కరెంట్ సమస్యలపై జనసేన నాయకుడు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. స్థానిక శాసనసభ్యులు రోషన్ కుమార్, జిల్లా కలెక్టర్, ఆర్డీఓలతో మాట్లాడి సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. అధికారుల సానుకూల స్పందనతో కాలనీకి మంచినీరు, విద్యుత్ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ఎన్నాళ్లోగానో ఎదురుచూస్తున్న తాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించడంపై కాలనీ నిర్వాసితులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలో ఇంకా మిగిలి ఉన్న చిన్నపాటి సమస్యలను, ఇతర మౌలిక వసతుల పనులను కూడా ఇదే విధంగా చొరవ తీసుకుని పూర్తి చేయించాలని ఈ సందర్భంగా స్థానికులు కోరారు.



# ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరించిన మంత్రిపార్థసారథి



**ఆగిరిపల్లి మే 28 ప్రభాతవార్త** ఆగిరిపల్లి బ్రాహ్మణ వీధిలో పురప్రముకుడు పొన్నం వెంకట లక్ష్మణరావు ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని గురువారం రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభించారు. లక్ష్మణరావు విగ్రహం ఏర్పాటు చేయడం ముదావహమనిఅని ఆయన పార్టీకి వెనక ఉండి అనేక విధాలుగా సహాయపడుతున్నారని అన్నారు. ఆయనకు ప్రత్యేక అభినందనలుతెలిపారు. అనంతరం మాట్లాడుతూ తెలుగువారు అంటే చిన్న చూపు తెలియని రోజుల్లో పార్టీని స్థాపించి తొమ్మిది నెలల్లోనే అద్భుత విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మహామనిషి నందమూరి తారకరామారావు అని అన్నారు. తెలుగు వారి ఖ్యాతిని ప్రపంచ దేశాలలో గుర్తింపు తెచ్చిన ఎన్టీఆర్ అనిఅన్నారు. గతంలో మనలను ఢిల్లీలో మద్రాసిలుగానే పిలిచేవారని ఎన్టీఆర్ వల్ల తెలుగు వారి పేరు ప్రతిష్టలు అభివృద్ధి చెంది కేంద్రాల్లోనే మంచి గుర్తింపు తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పి.వెంకట లక్ష్మణరావు మండల దేశం అధ్యక్షుడు నక్కన బోయిన వేణు, గ్రామ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు పామర్తి నరసయ్య, లక్ష్మణరావు నాయకులు మాదల వెంకట సత్యకుమార్, ఆరేపల్లి శ్రీనివాసరావు, మాదల శివరాం ప్రసాద్, నలజాల హరికృష్ణ, చౌటుపల్లి విక్టర్ బాబు, శ్రావణ్ కుమార్, ఏం సి డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**శాస్త్రవేత్త డాక్టర్ భగవంతం విగ్రహం ఏర్పాటు చేయాలి**

శాస్త్రవేత్త డాక్టర్ సూరిభగవంతం ఆగిరిపల్లి గ్రామంలో జన్మించడం మన అదృష్టం అని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు .గ్రామంలో ఒక మంచి ప్రదేశాన్ని ఏర్పాటు చేసుకొని పార్టీలరహితంగా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి అందరూ సహకరించాలన్నారు. నూజివీడు త్రిబుల్ ఐటీ లో భవన సముదాయానికి సూరి భగవంతం పేరు పెట్టడానికి కృషి చేస్తానన్నారు

## 24 గంటల్లో 5లక్షల ముఖ్యమంత్రి సహాయక నిధి మంజూరు.

**ఆగిరిపల్లి, మే, 28(ప్రభాత వార్త):** కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, రాష్ట్ర ప్రజల పూర్తి ఆరోగ్య భద్రతకు ఏటా వేల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. ఏటా 60 లక్షల ఆరోగ్య పరీక్షలు చేసి ప్రజల ఆరోగ్యానికి పూర్తి భద్రత కల్పిస్తుందన్నారు.సంజీవని కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో ఏటా 60 లక్షల మంది ప్రజలకు 41 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య వివరాలను ఆన్లైన్ లో పొందుపరచడం జరుగుతుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. ఆగిరిపల్లి మండలం కనసాని పల్లి గ్రామ నివాసి సి, ఎచ్, శివయ్య అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం విజయవాడ హాస్పిటల్లో చేర్పించాలని దానికి సరిపడ నగదు మా దగ్గర లేదని ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి కొంత ఆర్థిక సహాయం అందించాలని శివయ్య కుటుంబ సభ్యులు కోరగా 24 గంటల గడవకముందే సుమారు. రూ.5 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఎల్. ఓ, సి, చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. రాష్ట్రంలో 104 వాహనాల తరహాలో 904 వాహనాలతో రాష్ట్రంలోని ప్రతీ మారుమూల గ్రామాలలో ప్రజలవద్దకు వెళ్లి 7 నుండి 10 వేల రూపాయలు విలువచేసే వైద్య పరీక్షలు నిర్వహించి, వాటి వివరాలను ఆన్లైన్ లో పొందుపరుస్తారని, ప్రజలెవరైనా అనారోగ్యానికి గురైనప్పుడు వారి ఆరోగ్య చరిత్రను తెలుసుకునేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు గురైనవారికి ఈ ఆరోగ్య పరీక్షల వివరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.ఇలా ఏటా 60 లక్షల మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని, రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికి ఆరోగ్య వివరాలు ఆన్లైన్ లో పొందుపరచి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కు రాష్ట్రప్రభుత్వం కృషిచేస్తుందన్నారు.ముఖ్యమంత్రి సహాయక నిధి పేదల ఆరోగ్యానికి సంజీవని వంటిదని అన్నారు. దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## ఈద్గాలో ప్రత్యేక ప్రార్ధనలు



**ఆగిరిపల్లి మే 28 ప్రభాతవార్త** బక్రీద్ పండగ సందర్భంగా స్థానిక ఈద్గాలో గురువులు కలాం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. త్యాగానికి ప్రత్యేకమైన బక్రీదు పండుగ నాడు గొర్రెపోతును కుర్బానీగా ఇవ్వడం జరిగిందని ముస్లిం సోదరులు తెలిపారు. ఈ ప్రార్థనలో అధిక సంఖ్యలోముస్లిం సోదరులు పాల్గొన్నారు

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత



**వేలేరుపాడు, మే 28(ప్రభాత వార్త ):** వేలేరుపాడు మండలంలోని తాట్కూరు గొమ్ము కాలనీకి చెందిన పోసవరపు కృష్ణయ్యకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 36,300 చెక్కును జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గణేషుల ఆదినారాయణ గురువారం తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.సీఎం సహాయనిధి వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు భరోసాగా నిలుస్తోందన్నారు.కార్యక్రమంలో జనసేన నాయకులు మాచార్ల వెంకటేశ్వర్లు, దేవిరెడ్డి సుధాకర్, కొవ్వాల క్రాంతికుమార్, కమ్మచిచ్చు సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## సత్యవరం నుండి "సైకిల్" పై మల్లిడి



**పెనుమంట్ర, మే-28, (ప్రభాతవార్త)** తెలుగుదేశం పార్టీ అంటే అణు అణువునా అభిమానం పెంచుకొని, పార్టీపై ఎనలేని ముక్కువతో తనకిష్టమైన పసుపు చొక్కాతో, మహానాడుకు సత్యవరం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు మల్లిడి వెంకట రెడ్డి సైకిల్ పై మండలంలోని మార్టేరు రెడ్డి కళ్యాణ్ మండపంలో టిడిపి మహానాడుకు చేరుకొని అందర్నీ ఆకర్షించారు. వెంకటరెడ్డి ఎన్టీఆర్ గతంలో నీటి సంఘం అధ్యక్షులు గ ఎంపీటీసీగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత శాసనసభ్యులు పితాని సత్యనారాయణ అభిమానంతో, టీడీపీ పథకాలు ప్రజలును బాగా ఆకట్టుకున్నాయన్నారు. టీడీపీ పార్టీ అభివృద్ధి కి తాను కట్టుబడి ఉన్నాని అయన తెలిపారు. మహానేత ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో తాము భాగస్వాములు అయినందుకు గర్వంగా ఉందన్నారు. మహానాడు ఒక పండుగ వాతావరణం జరగడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈయనతో పాటు టీడీపీ సీనియర్ నాయకులు, సత్యవరం గ్రామం మాజీ సర్పంచ్ నల్లమిల్లి వివేకానంద రెడ్డి కూడ ఉన్నారు.

## మహానాడు డిజిటల్ పండుగ వేడుకలు.



**లింగపాలెం మే 28 (ప్రభాతవార్త)** శాసన సభ్యులు శ్రీ సొంగా రోషన్ కుమార్ ఆధ్వర్యంలో లింగపాలెం మండలం రంగాపురం సత్యశ్రీ కళ్యాణమండపంలో నిర్వహించిన వర్చువల్ మహానాడు 2026 పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని పండుగ వాతావరణాన్ని తలపించేలా సందడి చేశారు. ఈ సందర్భంగా స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతిని పురస్కరించుకుని కేక్ కట్ చేసి ఘనంగా నివాళులర్పించారు. ఎన్టీఆర్ ప్రజాసేవ, తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం చేసిన కృషిని నాయకులు స్మరించుకున్నారు.పార్టీ ఏర్పడిన దగ్గరనుంచి పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన సీనియర్ కార్యకర్తలను సన్మానించారు, అనంతరం పార్టీ బలోపేతం, గ్రామ స్థాయిలో కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చలు నిర్వహించారు. మహానాడు ద్వారా పార్టీ సిద్ధాంతాలు, సంక్షేమ లక్ష్యాలు ప్రజలకు మరింత చేరువ కావాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరిత నినాదాలు, కార్యకర్తల సందడితో విజయవంతంగా కొనసాగింది.

## "మినీ స్టేడియం" పనులు త్వరలో ప్రారంభిస్తాం శాప్ డైరెక్టర్ కొవ్వాసు



**జీలుగుమిల్లి, మే-28, (ప్రభాతవార్త)** మండల కేంద్రం జీలుగుమిల్లిలో ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్న "మినీ స్టేడియం" నిర్మాణాన్ని త్వరలో పనులు ప్రారంభించి, రానున్న మూడు నెలలు లోపే అన్ని హంగులతో ప్రారంభిస్తామని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (శాప్) డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి అన్నారు. గురువారం మండల కేంద్రం జీలుగుమిల్లిలో నిర్వహించిన మహానాడు కార్యక్రమానికి ఆమె విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీలుగుమిల్లి మినీ స్టేడియం నిర్మాణానికి నిర్మాణానికి డి పి ఆర్ రూ.2.50 కోట్లు (డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్) రూపొందించినట్లు తెలిపారు. ఈ స్టేడియం పూర్తయితే ఇక్కడ యువకులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అంతకుముందు ఆమె మహానాడును ఉద్దేశించి మాట్లాడుతూ జీలుగుమిల్లిలో మహానాడు పసుపు మయంగా, చక్కని పండుగ వాతావరణం కనిపించిందని కితాబిచ్చారు. స్వర్గీయ నందమూరి తారకరామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆమె టిడిపి సీనియర్ నాయకులు ఆళ్ల అంజయ్య ను ఘనంగా సత్కరించారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి

**అత్తిలి మే 28 (ప్రభాతవార్త )** అత్తిలి పె న్జరువు చెరువులో పడి అత్తిలి కి చెందిన దామిశెట్టి వెంకన్న అనే వ్యక్తి మృతి చెందినట్లు అత్తిలి హెడ్ కానిస్టేబుల్ పి.శ్రీనివాస్ తెలిపారు. అత్తిలిలో ఒక హోటల్లో పని చేస్తున్న వెంకన్న మృతదేహం చెరువులు ఉబ్బిపోయి కనిపించిందని తెలిపారు. భార్య పెనుగొండలో ఉంటుందని అన్నారు. భార్య దామిశెట్టి వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ధర్మాజీ గూడెంలో బక్రీద్ ప్రార్థనలు.



**లింగపాలెం మే 28 (ప్రభాతవార్త)** లింగపాలెం మండలం ధర్మాజీ గూడెం గ్రామంలో బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రార్థన నిర్వహించారు నమాజ్ అయిన అనంతరంఆఫీస్ సబ్ ముతవల్లి ప్రసంగించారు ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు ఈ కార్యక్రమంలో ఎండి గౌస్ మొహిద్దిన్ భాష సెక్రటరీ సయ్యద్ బాజీ వైస్ ప్రెసిడెంట్ ఎస్.కె షరీఫ్ వైస్ సెక్రెటరీ మీరావలి ముస్లిం పెద్దలు. షేక్ సాదిక్ షేక్ బాషి. ఎండి తహర్ తహరి ఎండి జానీ భాష బషీర్ మస్తాన్ ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## శ్రీ వైన్ కళాశాలలో టెట్, డీఎస్సీ అవగాహన సదస్సు



**నరసాపురం మే 27 ప్రభాత వార్త** స్థానిక శ్రీ వైన్ కళాశాలలో జీవీఆర్ ఇనిస్టూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, శ్రీ వైన్ కళాశాల మరియు శ్రీ మన అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో రాబోవు మెగా డీఎస్సీని దృష్టిలో ఉంచుకొని టెట్ మరియు డీఎస్సీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ జివిఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ మరియు శ్రీవైన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పిట్టా శాంతి అధ్యక్షత వహించారు. శ్రీ మన అకాడమీ డైరెక్టర్ ఎం. సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ ముత్యాల కళ్యాణ్ కృష్ణారావు , మెథడాలజీ ఫ్యాకల్టీ ఎం. వేణు, మ్యాథమెటిక్స్ ఫ్యాకల్టీ శ్రీ విశ్వ చైతన్య పాల్గొని ప్రసంగించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన చాత్రోపాధ్యాయులను ఉద్దేశించి వారు మాట్లాడారు. విద్యార్థులు సరైన ప్రణాళికతో, కష్టపడి చదివితేనే విజయాలు దరిచేరతాయని వారు పేర్కొన్నారు. రాబోయే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. టెట్ మరియు డీఎస్సీ పరీక్షల్లో సిలబస్ను ఎలా విభజించుకోవాలి ఎక్కువ మార్కులు ఎలా పొందాలి అనే అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. మెథడాలజీ సబ్జెక్టులో ఎక్కువ మార్కులు సాధించడానికి ఫ్యాకల్టీ ఎం. వేణు ప్రత్యేక చిట్కాలను అందించారు. ఈ సదస్సుకు హాజరైన చాత్రోపాధ్యాయులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ మోడల్ పేపర్లను పంపిణీ చేశారు. శ్రీ మన అకాడమీ ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభం కాబోయే ప్రత్యేక బ్యాచ్ల వివరాలను డైరెక్టర్ సురేష్ కుమార్ ప్రకటించారు. ఈ సదస్సులో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ అందే రామ సతీష్ , వైస్ ప్రెసిడెంట్ పోలిశెట్టి రఘురామరావు, బి యిడి కళాశాల కరస్పాండెంట్ కానూరు స్వామినాయుడు అభినందనలు తెలియజేశారు ఈ సదస్సులో పలువురు అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో చాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

## హిందీ ఉపాధ్యాయులు రవి గుండెపోటుతో మృతి



**చాట్రాయి, మే 28 ప్రభాతవార్త** చాట్రాయి మండలం చనుబండ జిల్లా పరిషత్ హైస్కూల్లో హిందీ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న హస్వావత్తు రవి(48) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఉదయం చాతిలో నొప్పి రావడంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆయన కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య లీలా చాట్రాయి జిల్లా పరిషత్ హైస్కూల్లో తెలుగు పండిట్ గా పనిచేస్తున్నారు. మృతదేహాన్ని వారి స్వగ్రామమైన తెలంగాణ రాష్ట్రంలోని వేంసూరు మండలం, కృష్ణాపురం కాగా అక్కడికి తరలిస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలో మంచి పేరుగాంచిన రవి మృతి పట్ల పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చాట్రాయి మండల ఉపాధ్యాయ సంఘాలు సంతాపం తెలియజేసాయి.

## భారీగా తరలివచ్చిన తెలుగు తమ్ముళ్లు



**చాట్రాయి, మే 28 ప్రభాతవార్త** మహానాడు రెండో రోజు కార్యక్రమానికి చాట్రాయి మండలంలోని అన్ని గ్రామాల నుండి కార్యకర్తలు అభిమానులు భారీగా తరలివచ్చారు. ఎన్టీఆర్ జయంతి కూడా ఉండటంతో అభిమానులు అధికంగా రావడంతో ఆరుగొలను పేట, చిన్నంపేట గ్రామాలలో సభా ప్రాంగణాలు జనంతో పోటెత్తాయి. ఎన్టీఆర్ పేరు చెప్పినప్పుడల్లా జేజేలు పలుకుతూ ఎన్టీఆర్ పై ఉన్న అభిమానాన్ని కార్యకర్తలు చాటుకున్నారు. ప్రతి ఒక్కరూ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్లస్టర్ ఇంచార్జీలు రుచికరమైన భోజనాలను ఏర్పాటు చేయటంతో కార్యకర్తలు విందు భోజనం చేసి తరలి వెళ్లారు.

## బసవయ్య కుటుంబీకులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**చాట్రాయి, మే 28 ప్రభాతవార్త** చాట్రాయి మండలం, మంకొల్లు గ్రామస్తులు మాజీ సర్పంచ్ పేరం బసవయ్య కుటుంబీకులను నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు గురువారం పరామర్శించారు. పార్టీకి నిబద్ధతతో పనిచేసి గ్రామ అభివృద్ధిలో తన వంతు కృషి చేశారని ప్రతాప్ కొని అడిగారు. కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. అదేవిధంగా మంకుల్లో మరో రెండు కుటుంబాలలో కూడా మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార్ యూనియన్ మాజీ చైర్మన్ దేశరెడ్డి రాఘవరెడ్డి, పోతనపల్లి మాజీ సర్పంచ్ కారంగుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## దేశాభివృద్దే భాజపా లక్ష్యం : చాట్రాతి ప్రసాద్



**జీలుగుమిల్లి, మే-28, (ప్రభాతవార్త)** దేశాభివృద్దే భారతీయ జనతా పార్టీ లక్ష్యం అని ఆ పార్టీ సీనియర్ నాయకులు చాట్రాతి ప్రసాద్, కొండపల్లి ప్రసాద్, మండల బీజేపీ అధ్యక్షుడు గుడ్ల రాంబాబు పేర్కొన్నారు. గురువారం కైకలూరులో రెండు రోజులపాటు నిర్వహించనున్న "పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ శిక్షణ అభియాన్" కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న శిక్షణ తరగతులకు మండలం నుంచి నాయకులు తరలి వెళ్లినట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ హాజరైనట్లు చెప్పారు. శిక్షణ తరగతుల్లో దేశ అభివృద్ధిలో భాజపా పాత్ర, గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం, కార్యకర్తల పనితీరు తదితర అంశాలపై నాయకులు దిశానిర్దేశం చేయనున్నట్లు వివరించారు. మండలం నుంచి వీరంకి బాలు తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

## మహానాడు విజయవంతం

### నాయకులు కార్యకర్తలకు అమరవరపు అశోక్ కృతజ్ఞతలు



**వేలేరుపాడు, మే 28(ప్రభాత వార్త ):** మండలంలో జరిగిన తెలుగుదేశం పార్టీ రెండు రోజుల మహానాడు కార్యక్రమం విజయవంతం కావడంపై మండల అధ్యక్షుడు అమరవరపు అశోక్ నాయకులు,కార్యకర్తలు, మహిళలు,యువతకు ధన్యవాదాలు తెలిపారు.ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయం నుంచి భూదేవిపేట వరకు ర్యాలీ నిర్వహించి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన మహానాడు కార్యక్రమాలను డిజిటల్ స్క్రీన్ ద్వారా వీక్షించారు.ఎండ తీవ్రత దృష్ట్యా పాల్గొన్న వారికి భోజనాలు,మజ్జిగ, మంచినీరు అందించారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తామని అమరవరపు అశోక్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శాఖమూరి సంజీవులు,కొమ్మన వెంకటేశ్వరరావు,కరటూరి రాధాకృష్ణ,చాపర్ల శ్రీను, పసుపులేటి లక్ష్మయ్య,కట్టం రాంబాబు,బేతి శ్రీను, కురిమెళ్ళ కృష్ణ,కుక్కునూరు రాంబాబు,సత్తిబాబు,సోడే రామకృష్ణ,కోటిపల్లి ముత్యాలరావు,బీరం అంజి, పోసి బాబు, ఎస్కే సలీం, కోటిపల్లి ముత్యాలరావు,శ్రీ తారాములు, వెంకన్న, రాంబాబు, చిట్టిబాబు, రంగారావు, వెంకటేశ్వరావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ మహానాడు ముగింపు కార్యక్రమాలు



**మొగల్తూరు మే 28 (ప్రభాతవార్త):** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలంలోని పేరుపాలెం, మొగల్తూరు, ముత్యాలపల్లి, కాళీపట్నం గ్రామాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ మహానాడు ముగింపు కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహించారు. నర్సాపురం నియోజకవర్గం డిజిటల్ మహానాడు ఇంచార్జ్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేఖర్, మొగల్తూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుబ్బల వీర వెంకట నాగరాజు కార్యక్రమాలను పరిశీలించి కేక్ కట్ చేసి కార్యకర్తలు, అభిమానులకు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేతల ఆశయాలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. డిజిటల్ మహానాడు ద్వారా పార్టీ విధానాలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువయ్యాయని తెలిపారు. యువత సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకొని పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ ఐక్యంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గడ్డివాము దగ్ధం కాకుండా నివారించిన అగ్నిమాపక శాఖ

**అత్తిలి, మే 28( ప్రభాత వార్త )** అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో పెద్దవాము దగ్ధం కాకుండా అత్తిలి అగ్నిమాపక శాఖ వారు నివారించారు. గడ్డివాము సమీపంలో గల ఒరే చాలా దుబ్బులకు నిప్పు పెట్టగా మంటలు కలిసాయి. బల్లిపాడు కు చెందిన ప్రగడ వెంకటేష్ అనే రైతు ఫిర్యాదు చేయడంతో అగ్నిమాపక దళాధికారి కే. గంగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది వెళ్లే గడ్డివాము దగ్ధం కాకుండా నివారించారు. దీనివల్ల 10 వేల రూపాయలు విలువైన గడ్డిని కాపాడినట్లు తెలిపారు.

## అభినందనీయం అభయ్ ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు

- పర్యావరణహితంగా శ్రీనివాస్ దాతృత్వం
- ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్



**నరసాపురం మే 27 ప్రభాతవార్త** నరసాపురం పట్టణంలో అభయ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నూలి శ్రీనివాస్ కుమారుడు స్వర్గీయ అభయ్ పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు.ఆయన పర్యావరణాన్ని కాపాడేందుకు 1000 స్టీల్ ప్లేట్లు 1000 స్టీల్ గ్లాసులు వివాహాది శుభ కార్యక్రమాలకు ఉచితంగా అందించేందుకు ఈరోజు ప్రారంభించారు. అదేవిధంగా సాయిబాబా ఆలయానికి 45 వేల రూపాయలు విలువచేసే మైక్ సెట్ సౌండ్ బాక్స్ లతో సహా విరాళంగా ఇచ్చారు. అదేవిధంగా నిత్య చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం సాయిబాబా ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని అన్నారు. ఈరోజు నూలి శ్రీనివాస్ పర్యావరణహితంగా తన దాతృత్వాన్ని చాటుకుంటూ మంచి కార్యక్రమాన్ని తలబెట్టారని ఫంక్షన్లలో ఎక్కువగా ప్లాస్టిక్ వాడటం వల్ల డంపింగ్ సమస్య ఏర్పడుతుందని అందువల్ల అటువంటి సమస్య లేకుండా ఫంక్షన్లకు ఉచితంగా స్టీలు ప్లేట్లను గ్లాసులను ఇవ్వడం పై నూలి శ్రీనివాసును అభినందించారు. వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని పర్యావరణ పరిరక్షణ ఆరోగ్య రక్షణ కు సహకరించాలని కోరారు. అదేవిధంగా ఈ ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ నూలి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అభయ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి చెస్ పోటీలను నిర్వహించేవారుమని అదేవిధంగా పేద విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందని ప్రతి సంవత్సరం తన కుమారుడు అభయ్ పుట్టినరోజున అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, నూలి శ్రీనివాస్, వలవల నాని, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఆత్మూరి నరసయ్య, కోట్ల బాలకృష్ణ, న్యాయవాది అమర్ , అప్పన రాజ్ కుమార్ ,సమయంతుల సత్యనారాయణ మరియు ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.



## మే-29న పెనుగొండలో "ఒక నెల-ఒక గ్రామం నాలుగు సందర్శనలు" జిల్లా కలెక్టర్ నాగరాణి



**ఆచంట, మే-28, (ప్రభాతవార్త)** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "ఒక నెల -- ఒక గ్రామం -- నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భాగంగా మే 29న ఆచంట నియోజకవర్గంలోని వాసవి పెనుగొండలో ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. వాసవి పెనుగొండలోని ఎస్వీకేపీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు, వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ప్రతి శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఆచంట నియోజకవర్గంలో మే15న తొలి విడత, మే 22న రెండో విడత కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. మే 29న మూడవ విడత కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే జిల్లా, డివిజన్, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు ఉదయం 8.30 గంటలకే వాసవి పెనుగొండలోని ఎస్వీకేపీ డిగ్రీ కళాశాల ప్రాంగణానికి తప్పనిసరిగా చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## 216 నేషనల్ హైవేపై జరుగుతున్న ప్రమాదాలను అరికట్టాలి



**మొగల్తూరు మే 28 (ప్రభాతవార్త):** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండల పరిధిలోని 216 నేషనల్ హైవేపై తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని ప్రజలు గురువారం హైవే అధికారులను కోరారు. అధిక వేగంతో వెళ్తున్న వాహనాలు, సరైన హెచ్చరిక బోర్డులు లేకపోవడం, రహదారిపై గుంతలు, రాత్రి వేళల్లో తగినంత లైటింగ్ లేకపోవడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకంగా గ్రామాల సమీపంలో స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రమాదకర మలుపుల వద్ద సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో పలువురు గాయపడటంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయని తెలిపారు. పాదచారులు రహదారి దాటేందుకు సౌకర్యాలు కల్పించాలని, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రమాద అంచుల్లో రహదారులు



**మొగల్తూరు మే 28 (ప్రభాతవార్త)** పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం మొగల్తూరు గ్రామంలో శివాలయం నుంచి వెంప వెళ్లే మార్గం లో నక్కావారిపాలెం గ్రామ సమీపంలో రహదారుల దుస్థితి ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోంది. నాణ్యత లోపం తో రోడ్డు పక్క భాగం పూర్తిగా కుంగిపోవడంతో ప్రయాణికులకు ప్రాణాపాయం ఏర్పడనుంది రోడ్డు అంచు కూలిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. ఈ మార్గంలో ప్రతిరోజూ విద్యార్థులు, రైతులు, గ్రామస్తులు రాకపోకలు సాగిస్తుండగా అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని, హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పిల్ల కాలువకు ఇరువైపులా ప్రొటెక్షన్ గోడ నిర్మించి ప్రమాదాలను నివారించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## పండుగలా మహానాడు: హాజరైన మంత్రి, ఎమ్మెల్యే



**కామవరపుకోట,మే 28(ప్రభాతవార్త):** కూటమి ప్రభుత్వంలో చింతలపూడి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి తీరుతామని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ స్పష్టం చేశారు. గురువారం కామవరపుకోటలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మండల టీడీపీ అధ్యక్షుడు కిలారు.సత్యనారాయణ అధ్యక్షతన వర్చ్యువల్ మహానాడు కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. మహానాడు అనేది పసుపు సైన్యానికి ఒక పెద్ద పండుగ లాంటిదన్నారు. ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ మాట్లాడుతూ, నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. కార్యకర్తలను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, నియోజకవర్గం పరిశీలకులు రావి.వెంకటేశ్వరరావు,మాజీ ఏఎంసీ చైర్మన్ లు కోనేరు. వెంకట సుబ్బారావు,జగ్గవరపు. ముత్తారెడ్డి, మాజీ జడ్పీటీసి ఘంటా.సుధీర్ బాబు,మద్దిపోటి నాగేశ్వరరాంబాబు, కామవరపుకోట క్లస్టర్ ఇంచార్జ్ బొబ్బిలి.డాన్ దివాకర్, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## గౌడ సంఘం నాయకుడు పల్లగాని రాంబాబు మృతి పట్ల సంతాపం



**టి.నర్సాపురం మే 27 ప్రభాత వార్త** టి.నర్సాపురం గౌడ సంఘం నాయకుడు మెయిన్ సెంటర్ లోని పల్లగాని కాంప్లెక్స్ అధినేత పల్లగానిరాంబాబు వయస్సు 52 గురువార0 గుండెపోటుతో మరణించారు. ఆయన గౌడ సంఘానికి అనేకసేవలు అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌడ సంఘ నాయకులు తెలుగుదేశం పార్టీ మండలఅధ్యక్షులు నాయుడు రామకృష్ణ గౌడ్ రాంబాబు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారిఆత్మకు శాంతి కలగాలని కోరారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రాంబాబు చేసిన సేవలు మరువలేనివి అన్నారు. టీ నర్సాపురం సహకార సంఘ అధ్యక్షులు జోను పోయిన సోంబాబు కూడా రాంబాబు కుటుంబానికి సానుభూతితెలిపారు .ఈకార్యక్రమంలోనూతి దుర్గారావు ,మరీదు నాగేశ్వరరావు, వీరంకి శివ సత్యనారాయణ, పబ్బు జయరాజు నాయుడు జోగేశ్వరరావు,శ్యామపూరి సత్యనారాయణ, నాయుడు గురవయ్య భాషా, మధు, పెట్టిన సత్యనారాయణ, కొల్లి మురళి దేవరపల్లిరంగారావు తదితరులు పాల్గొన్నారు